ఈనాడు

విజయవాడ 5-1-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 146

THE LARGEST CIRCULATED TELUGU DAILY


రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

విహారి

- కోనసీమ పిలుస్తోంది మహాబలిపురం రమ్మంటోంది ఉడుపి పై అంటోంది.. సంక్రాంతి సందడి ఎక్కడ? ఎలా?
- అడవి అందాలు కనువిందు చేస్తున్నాయ్.. బయల్దేరుదామా? పదండి పాండవుల గుట్టకు..
- కొంగవాలు వచ్చారు.. పలకరించొద్దామా!

పర్యాటక విశేషాలు 7వ పేజీలో



ఎమ్మార్ కేసులో ఎల్వీ సుబ్రహ్మణ్యంపై కేసు కొట్టివేత

- నిర్ణయాలన్నీ మంత్రి మండలివే
- కొన్ని ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాల్లేవు 2లో
- ఉమ్మడి హైకోర్టు తీర్పు

రెండో పింఛను!

- ఒకే కుటుంబంలోని అర్హులకు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తా
- ఒంటరి ఆడబిడ్డల గురించి కూడా ఆలోచిస్తా
- మార్చి ఆఖరుకు రాష్ట్రం 'ఓడీఎఫ్' కావాల్సిందే
- లేదంటే మీ ఊరొస్తా.. మీ ఇంటికొస్తా.. మౌన దీక్ష చేస్తా
- ఇచ్ఛాపురం 'జన్మభూమి-మా ఊరు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే



ఒకే కుటుంబంలో అర్హత గల వారికి రెండో పింఛను ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పెళ్లి కాకుండా ఒంటరిగా మిగిలిపోయిన ఆడబిడ్డలకు కూడా పింఛను మంజూరు చేసే అంశాలను అధ్యయనం చేస్తానని చెప్పారు. కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో దెయ్యాలు కూడా పింఛన్లు అందుకున్నాయని ఎద్దేవా చేశారు. తన పాలనలో అలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శకతతో అర్హులను ఎంపిక చేశామన్నారు. దెయ్యాలను శ్మశానం దాటి బయటకు రానీయబోనని ఛలోక్తిగా అన్నారు. 'జన్మభూమి - మా ఊరు'లో మూడో రోజైన గురువారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జన్మభూమిలో తొలిరోజు సంక్షేమం, సంతృప్తికి.. రెండోరోజు ఆరోగ్యం-ఆనందానికి ప్రాధాన్యమిచ్చిన చంద్రబాబు మూడో రోజు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడిస్తూ ఈ అంశంపైనే దృష్టిని కేంద్రీకరించారు.

ఒక రోజంతా నిరాహార దీక్ష చేస్తా...

"ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్) రాష్ట్రంగా ప్రకటించాల్సిందే. రాష్ట్రంలో ఇంకా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు ఈ విషయంలో వెనుకబడి ఉన్నాయి. ఈలోపు మీరు నిర్మించుకోకపోతే.. మీకు ఆత్మగౌరవం లేకపోతే.. మీ ఊళ్లోనే బస చేస్తా. మీ ఇంటికొస్తా. మీరంతా మరుగుదొడ్లు కట్టిన తరవాత అమరావతికి వెళ్తా. అది కూడా మీకోసమే. ఒక రోజంతా మాట్లాడను. మౌనంగా ధర్నా చేస్తా.. మరో రోజంతా భోజనం చేయకుండా దీక్ష బూనతా" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు, పితాని సత్యనారాయణ, ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గౌతు శిరీష, జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు (మిగతా 2లో)



టెండర్లకు కేంద్రం సరే!

- పోలవరంపై కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శి సూత్రప్రాయ అంగీకారం
- ప్రాజెక్టు అథారిటీ ఆమోదమే తరువాయి..
- వచ్చే వారంలో అథారిటీ సమావేశమయ్యే అవకాశం

ఈనాడు, అమరావతి: పోలవరం పనుల్లో కొత్త గుత్తేదారుల ప్రవేశానికి కేంద్రం సరేనంది. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలమైంది. కొత్తగా రాష్ట్రం చేపట్టిన టెండర్ల ప్రక్రియకు కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శి మౌఖికంగా అంగీకారం తెలిపారు. దీనిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున వారికీ లేఖ రాయాలని సూచించారు. అథారిటీ సమావేశంలో టెండర్లకు ఆమోదం పొంది తదుపరి ప్రక్రియను కొనసాగించుకోవాలని కార్యదర్శి సూచించినట్లు సమాచారం.

పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల్లో 60సి కింద కొంత భాగం తొలగించి రూ.1483.23 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. ఈ టెండర్ల ప్రక్రియపై ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరం ఈఎన్‌సీకి లేఖ రాస్తూ ఆ ప్రతిని కేంద్ర జల వనరులశాఖకు పంపింది. దీంతో సంబంధిత అంశాలపై స్పష్టత వచ్చే వరకూ పోలవరం టెండర్లను నిలిపివేయాలంటూ కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శి రాష్ట్రానికి లేఖ రాయడంతో టెండర్ల ప్రక్రియ ఆగిపోయింది. ఆ తర్వాత కేంద్ర జల వనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వద్ద జరిగిన సమావేశంలో ప్రస్తుత గుత్తేదారుకు నెలరోజుల పాటు సమయం (మిగతా 2లో)



నేడో, రేపో విచారణ

- నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు
- నివేదిక వచ్చాక ప్రజలకు వాస్తవాల వెల్లడి
- ఆలయ కమిటీ తీరుపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- కమిటీని రద్దు చేస్తానని హెచ్చరిక 3లో

తలాక్ బిల్లుపై రాజ్యసభలో కొనసాగిన ప్రతిష్టంభన

- సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనన్న విపక్షాలు
- విపక్షాల తీర్మానాలు నిబంధనలకు విరుద్ధమన్న జైట్లీ 6లో

రాజధానికి మణిహారం

రెండు దశల్లో అంతర వలయ రహదారి

- మొత్తం 16,556 ఎకరాలు అవసరం
- 8 వరుసలుగా నిర్మిస్తే తొలి దశ నిర్మాణ వ్యయం రూ. 7,625 కోట్లు
- ప్రణాళిక ఖరారు

ఈనాడు - అమరావతి



చిత్రంలో నీలి రంగులో ఉన్నది అంతర వలయ రహదారి. పసుపు రంగులో ఉన్నది బాహ్య వలయ రహదారి

రాజధాని అమరావతి, విజయవాడ నగరాల చుట్టూ నిర్మించే అంతర వలయ రహదారి (ఐఆర్ఆర్) ప్రణాళిక ఖరారైంది. దీనిని రెండు దశల్లో చేపడతారు. తొలిదశలో చేపట్టే రహదారి నిర్మాణం పొడవు 97.5 కిలోమీటర్లు. రెండో దశలో నిర్మించే రహదారి పొడవు 29 కిలోమీటర్లు. ప్రస్తుతం తొలి దశలో చేపట్టే 97.5 కి.మీ.ల రహదారి నిర్మాణానికే అంచనాలు సిద్ధం చేశారు. దీన్ని 8 వరుసల రహదారిగా నిర్మిస్తే రూ.7,624 కోట్లు, 10 వరుసల రహదారిగా నిర్మిస్తే రూ.8,300 కోట్లు వ్యయమవుతుంది. తొలి దశలో చేపట్టే రహదారిని 34 కి.మీ., 33. కి.మీ.లు, 30 కి.మీ.ల పొడవైన మూడు భాగాలుగా విభజించారు. మొదటి రెండు భాగాలు పూర్తిగా కొత్తగా (గ్రీన్ ఫీల్డ్) నిర్మించాల్సినవి. మూడో భాగం ఇప్పటికే ఉన్న రహదారిని మెరుగుపరుస్తారు. మొదటి రెండు భాగాల రహదారి గుంటూరు జిల్లాలోని 18 గ్రామాలు, కృష్ణా జిల్లాలోని 12 గ్రామాల మీదుగా వెళుతోంది. ఈ రెండు భాగాల రహదారి నిర్మాణానికి 1428 ఎకరాల భూమి అవసరం. అవసరమైన భూమి, నిర్మాణ వ్యయానికి సంబంధించి 3 రకాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం భూమిని భూసేకరణ విధానంలో తీసుకోవడం, మొత్తం భూసమీకరణలో తీసుకోవడం, స్వచ్ఛందంగా (మిగతా 2లో)

2014 నుంచి సేకరించిన భూమికే 'కొత్త పరిహారం'

- ఆలోపు సేకరిస్తే పాత విధానమే
- జీవనోపాధి కోల్పోయే వారికీ పరిహారం 2లో
- పోలవరంపై కేంద్రం వెల్లడి

తిరుపతిలో 'స్మార్ట్ రైల్వేస్టేషన్'

- రూ.400 కోట్లతో ఆధునికీకరణ 5లో
- చైనా తరహాలో ప్లాట్‌ఫారాలు

సమీకరణ కష్టమే... సేకరణే మార్గం

- వ్యయ భారం తగ్గించే ప్రత్యామ్నాయాలపై దృష్టి 5లో
- అమరావతి ఎక్స్‌ప్రెస్ రహదారిపై సర్కార్ కసరత్తు

కోడి పందేలను కట్టడి చేయాల్సిందే

- రాష్ట్ర సర్కారుకు తేల్చిచెప్పిన హైకోర్టు
- ఈసారి అధికారుల విశ్వసనీయతను పరీక్షిస్తాం
- మా ఉత్తర్వుల ఉల్లంఘన జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- నివారణ చర్యలపై నివేదికలు సమర్పించండి
- సీఎస్, డీజీపీలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు - హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేలను కట్టడి చేయాల్సిందేనని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. 2016 డిసెంబరు 26 తామిచ్చిన ఉత్తర్వులను ఈ సంక్రాంతికి కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెప్పింది. తమ ఉత్తర్వులకు విరుద్ధంగా పందేలు జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. ఈ సంక్రాంతి సమయంలో పందేల నిలువరింతలో అధికారుల విశ్వసనీయతను (బోనఫైడ్) పరీక్షించదలిచామని పేర్కొంది. కోడి పందేలను నిలువరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ వేర్వేరుగా నివేదికలు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల అమలుకు సీఎస్, డీజీపీలు తగిన చర్యలు చేపడతారని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ ఇచ్చిన హామీని నమోదు చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసులో విచారణ జరిపింది. గత సంక్రాంతికి తమ ఉత్తర్వులకు వ్యతిరేకంగా వ్యవహరించిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 43 మంది (మిగతా 2లో)

ఇదీ సంగతి!



కిమ్ మానసిక స్థితిని పరీక్షించి రిపోర్టులు తెచ్చాను సార్... అచ్చు మీ మానసిక స్థితి లాగే ఉంది. అస్సలు తేడా లేదు.

కృష్ణాలో ఇంటి పడవలు!

- 3-4 నెలల్లో అందుబాటులోకి
- పర్యాటక-సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కసరత్తు
- ఎస్సీ లబ్ధిదారుల ద్వారా 10బోట్లు, ఏపీటీడీసీ 5 బోట్లు ఏర్పాటుకు నిర్ణయం

ఈనాడు - అమరావతి



పర్యాటకులకు మరో కొత్త అనుభూతిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పర్యాటక శాఖ సిద్ధమైంది. విజయవాడలోని కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి పవిత్ర సంగమం వరకు నీటిలో విహరించేందుకు ఇంటి పడవలు (హౌస్ బోట్‌లు) రానున్న 3-4 నెలల్లో అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తును వేగవంతం చేసింది. సాంఘిక సంక్షేమ శాఖనూ ఇందులో భాగస్వామిని చేస్తున్నారు. తొలివిడతలో 15 హౌస్‌బోట్లను తీసుకువచ్చేందుకు నిర్ణయించారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) సొంతంగా 5, మిగిలిన 10 పడవలను ఎస్సీ లబ్ధిదారుల ద్వారా ఏర్పాటు చేయించాలని ఈ రెండు శాఖలు నిర్ణయించాయి. ఈ మేరకు పర్యాటకశాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ప్రాజెక్టు విధానంపై చర్చించారు.

బోటు ఇలా...: కారిడార్, హాలు, వంటగది, డైనింగ్, పడక గదులు ఇలాంటి వసతులు పడవలో ఉంటాయి. ఒక పడకగది లేదా 2పడక గదులతో పడవలను సిద్ధం చేయనున్నారు. వీటిలో ఉండే సదుపాయాల ఆధారంగా ధరను నిర్ణయించనున్నారు. ప్రస్తుతం ఇలాంటి 2 పడవలను తూర్పుగోదావరి జిల్లాలోని దిండి వద్ద ఏపీటీడీసీ నిర్వహిస్తోంది. కృష్ణాలో తిప్పే పడవల్లో వాటి కంటే మెరుగైన సదుపాయాలు ఉండేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.

అమలు ఇలా...

- ఒక్కో పడవ ఖరీదు రూ.60లక్షల నుంచి రూ.1కోటి (సదుపాయాలను బట్టి ధర ఉంటుంది). రూ.కోటి వరకు అయితేనే ఎస్సీ సహకార సంస్థ, ఏపీటీడీసీ లబ్ధిదారులకు రాయితీనిచ్చే వీలుంది. అందువల్ల రూ.కోటి లోపు పడవలను ఎస్సీ లబ్ధిదారులు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తే ప్రోత్సాహకంగా రాయితీలు (మిగతా 2లో)



2వేల గుడిసెలు దగ్ధం

- 3 గంటల పాటు ఎగసిపడ్డ మంటలు
- బద్వేలులో ఘోర అగ్ని ప్రమాదం
- బాధితులకు సాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశం 6లో

రెండో పింఛను!

(మొదటి పేజీ తరువాయి)

ధనలక్ష్మి, కలెక్టర్ ధనంజయరెడ్డిలు పాల్గొన్న ఈ సభలో మూడో తరగతి చదువుతున్న రిషిత చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగానికి చంద్రబాబు ముగ్ధులై రూ.50వేల నగదును బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మనమే బాధ్యతగా లేకుంటే ఎలా?

స్వచ్ఛభారత్‌కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఆరుగురు ముఖ్యమంత్రులతో కూడిన 'స్వచ్ఛభారత్ మిషన్'కు తనను ఛైర్మన్‌గా నియమించారని చంద్రబాబు గుర్తు చేశారు. ఈ సందర్భంలోనే తాను అనేక దేశాలు, రాష్ట్రాల్లో స్వచ్ఛతకు ఇస్తున్న ప్రాధాన్యంపై అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. "మేం మరుగుదొడ్డికి రూ.15 వేలు సిఫార్సు చేశాం. కేంద్రం రూ.7,200 మాత్రమే ఇస్తే... ఆత్మగౌరవమే ముఖ్యమని రాష్ట్రం నుంచి రూ.7,800 సమకూర్చా. కమిటీలో మనం అంత బాధ్యత వహించినప్పుడు అన్ని రాష్ట్రాల కంటే మనమే ముందుండాల్సిన అవసరం ఉంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.

చెంబుకు శవయాత్ర చేయాలి...

"చాలామంది నిద్ర లేస్తూనే చెంబుపట్టుకుని పోతారు... అలాంటి ఆ చెంబుకు శవయాత్ర చేయాలి. అంత్యక్రియలు చేయాలి" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. వారానికి ఓసారి విద్యార్థులతో స్వచ్ఛత ర్యాలీలు చేయాలన్నారు. "ప్రతి శనివారం మధ్యాహ్నం మన ఆరోగ్యం కోసం, సమాజం కోసం, పరిశుభ్రత కోసం స్వచ్ఛ ఆంధ్ర కోసం ఆలోచన చేద్దాం. భక్తి దీక్షలు చేసినట్లుగా ఆత్మగౌరవ దీక్షలు చేపట్టాలి. 'మరుగుదొడ్డి నా ప్రాథమిక హక్కు' అనేవిధంగా ప్రతిజ చేపట్టాలి. స్థలం లేకుంటే.. సామాజిక మరుగుదొడ్లు నిర్మించుకోవాలి" అని సూచించారు. మరుగుదొడ్డిని వినియోగించుకున్నప్పుడు నిండిపోతే.. దాన్ని ఖాళీ చేయించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు.

మురుగునీటి పారుదల వ్యవస్థకు శ్రీకారం: రాష్ట్రంలో మూడంచెల విధానంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. 200 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో ఇంకుడు గుంతలు.. 500 జనాభా వరకు ఉంటే.. బహిరంగ మురుగునీటి పారుదల వ్యవస్థ.. 5వేల మంది జనాభాకంటే పైబడిన గ్రామాల్లో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణాలకు ఎంత ఖర్చయినా అన్ని గ్రామాల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు.

పేడను మీ పొలాలకు తరలిస్తా..

"ఇకపై మీ ఇంటివద్ద పశువుల పేడను మీ పొలాలకు తరలించే బాధ్యతను కూడా నేనే తీసుకుంటా. ఇందుకోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తా" అని సీఎం ప్రకటించారు. భవన వ్యర్థాలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో ప్రయోగాత్మకంగా కార్యాచరణ చేపడుతున్నట్లు చెప్పారు.

పోషకాహారం అందించేందుకు...

గ్రామ పంచాయతీల్లో అయిదేసి ఎకరాల్లో పోషకాహార ఉత్పత్తులను పండించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఇక్కడ ఆకుకూరలు, కూరగాయలు పండించి గర్భిణులు, చిన్నారులకు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించనున్నట్లు వెల్లడించారు.

జిల్లాకు సంబంధించి సీఎం ఏమన్నారంటే..

- శ్రీకాకుళం జిల్లాలో వంశధార జలాశయం నిర్మాణాన్ని పూర్తి చేసి.. ఇచ్ఛాపురం వరకు వర్షాభావ భూములకు సాగునీటిని అందిస్తాం.
- ఉద్దానం కిడ్నీ బాధితులకు వంశధార నీటిని అందిస్తా. బాధితులకు మందులు పంపిణీ చేసేందుకు రూ.పది కోట్లు విడుదల చేస్తా.
- కళింగపట్నంలో రూ.200 కోట్లతో రిసార్ట్స్.. రూ.43 కోట్లతో పర్యాటక జెట్టీ నిర్మాణాలు చేపడతా.
- భావనపాడు ఓడ రేవు నిర్మాణాన్ని చేపట్టి జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపిస్తా.
- కొబ్బరితో వివిధ ఉప ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమను నెలకొల్పుతా.
- మత్స్యకారులకు మేలు జరిగేలా శీతల గిడ్డంగులను నిర్మిస్తా.



ఇచ్ఛాపురంలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'అగ్రిగోల్డ్'పై ముంబయి ట్రస్టు సంప్రదిస్తోంది

సోంపేట, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులు రాష్ట్రంలో దాదాపు ఇరవై లక్షల మంది ఉంటే.. అందులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనే అత్యధికులు ఉన్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. బాధితులకు నయాపైసాతో సహా తిరిగి ఇప్పించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. 'ముంబయికి చెందిన ఒక ట్రస్టు ప్రభుత్వాన్ని కలిసింది. అగ్రి గోల్డ్ ఆస్తులు ఇస్తే.. బాధితులకు చెల్లించాల్సిన మొత్తాన్ని తామే చెల్లిస్తామని ముందుకొచ్చింది. ఆ ట్రస్టుకు ఆస్తులను బదలాయింపు చేస్తే 20 లక్షల మంది సమస్య పరిష్కారం అవుతుంది' అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

2014 నుంచి సేకరించిన భూమికే 'కొత్త పరిహారం'

- **ఆలోపు సేకరిస్తే పాత విధానమే**
- **పోలవరంపై కేంద్రం వెల్లడి**

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు కోసం 2014 నుంచి సేకరించిన భూమికి 2013 నాటి కొత్త భూసేకరణ చట్టం కింద పరిహారం అందించనున్నట్లు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయ మంత్రి సుదర్శన్ భగత్ తెలిపారు. గురువారం రాజ్యసభలో సీపీఐ సభ్యుడు డి.రాజా అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 2012కు ముందు గిరిజనులు, గిరిజనేతరులందరికీ ఆంధ్రప్రదేశ్ సహాయ, పునరావాస విధానం 2005 ప్రకారం భూములు, ఆస్తులకు పరిహారం అందించి, సహాయ, పునరావాస ప్రయోజనాలు కల్పించినట్లు చెప్పారు. పోలవరం కిందకు వచ్చే అంగలూరు, దేవరగుండి, మామిడిగొంది, చేగొండపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులకు ఆ ప్రకారమే పరిహారం చెల్లించినట్లు తెలిపారు. 2013 డిసెంబరు 31 వరకు భూసేకరణ చట్టం-1894 చట్టం ప్రకారం.. ఆ తేదీ తర్వాత 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రయోజనాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ఈ డ్యాం కింద ఆంధ్రప్రదేశ్‌లో 17,444 గిరిజన కుటుంబాలు తరలిపోవాల్సి వస్తోందని తెలిపారు. ఇందులో కోయ, కొండరెడ్డి కుటుంబాలు 15,371, కోయ దొర 1715, కొండకమ్మర 251, వాల్మీకి 3, కొండ కాపు 1, కొండ దొర 62, నాయకపోడి కుటుంబాలు 41 ఉన్నట్లు వెల్లడించారు.

కృష్ణాలో ఇంటి పడవలు!

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని, అనుభవం ప్రాతిపదికవీరిని ఎంపిక చేయాలని నిర్ణయించారు.

- ప్రాజెక్టు వ్యయంలో ఒక్కో లబ్ధిదారుడికి ఏపీటీడీసీ 15శాతం రాయితీ, ఎస్సీ సహకార సంస్థ పెట్టుబడి ఆధారంగా రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా ఇప్పిస్తారు.
- లబ్ధిదారుడు బ్యాంకు రుణం పూర్తిగా చెల్లించాక, ఈ పడవలపై వచ్చే ఆదాయంలో ఖర్చులుపోను మిగిలిన మొత్తంలో 50శాతం ఆ పడవ యజమాని, 50శాతం ఏపీటీడీసీ పంచుకునేలా చర్చిస్తున్నారు.
- ఈ పడవలకు సంబంధించి ఆన్‌లైన్ టికెట్ బుకింగ్, మార్కెటింగ్ తదితర బాధ్యతలు ఏపీటీడీసీ తీసుకోనుంది. ఈ మేరకు ప్రాజెక్టు విధానంపై గురువారం పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి హిమాన్షుశుక్లా, ప్రాజెక్టు పర్యవేక్షక అధికారి లక్ష్మణమూర్తి హాజరయ్యారు. కృష్ణా నదిలో ఇంటి పడవలను తీసుకువచ్చాక.. రెండో విడతలో దిండిలో మరో 10 పడవలను అదనంగా తీసుకురావాలని నిర్ణయించారు.

చిన్నారుల విక్రయం దారుణం

దిల్లీ: దేశంలో అనాథాశ్రమాల నిర్వహణ, చిన్నారులను సంరక్షిస్తున్న తీరు, దత్తత నిబంధనల అమలు సంబంధిత వివరాలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమకు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పశ్చిమ బెంగాల్‌లో అనాథ బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించి తాను జారీచేసిన ఆదేశాలను కలకత్తా హైకోర్టు నిలుపుదల చేయటాన్ని సవాల్ చేస్తూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్‌సీపీసీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్‌లు ఏఎం ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టింది. అనాథాశ్రమాల నిర్వాహకులు తమ ఇష్టప్రకారం చిన్నారులను దత్తతకు ఇచ్చేయటం సరికాదని వ్యాఖ్యానించింది. దత్తత పేరుతో పసివాళ్లను విక్రయించటం దారుణమని చెబుతూ కేసు పరిధిని పశ్చిమ బెంగాల్‌కే పరిమితం చేయకుండా అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తూ ఆదేశాలు వెలువరించింది.

అది 'ఫేక్ ఇన్ ఇండియా': రాహుల్

దిల్లీ: భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా)ని.. 'భారత్‌లో బోగస్ (ఫేక్ ఇన్ ఇండియా)' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం ఎద్దేవా చేశారు. ఈమేరకు ఓ వార్తాకథనాన్ని జతచేస్తూ ఆయన ట్విట్టర్‌లో విమర్శలు చేశారు.

రాజధానికి మణిహారం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు వచ్చిన గ్రామాల వరకు భూసమీకరణలోనూ, మిగతా భూమిని భూసేకరణ విధానంలోనూ తీసుకోవడం అన్న ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం భూసమీకరణ విధానంలో తీసుకునే పక్షంలో... రహదారికి రెండు పక్కలా 500 మీటర్ల వెడల్పున ప్రత్యేక కారిడార్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. అప్పుడు మొత్తం 16,556 ఎకరాల భూమి అవసరమవుతుంది.

అంతర వలయ రహదారి సమగ్ర వివరాలు..

మొదటి భాగం

హైదరాబాద్ హైవే- చెన్నై హైవే మధ్య పొడవు 34 కి.మీ.

రెండో భాగం

చెన్నై హైవే- జాతీయ రహదారి బైపాస్ మధ్య పొడవు 33.5 కి.మీ.

మూడో భాగం

జాతీయ రహదారి బైపాస్- హైదరాబాద్ హైవే మధ్య పొడవు 30 కి.మీ.

- ★ **రెండో దశలో చేపట్టే 29 కి.మీ. రహదారి ఎన్‌హెచ్ బైపాస్ నుంచి హైదరాబాద్ హైవే మధ్య వస్తుంది.**
- ★ 8 వరుసల ప్రధాన రహదారి (మెయిన్ క్యారేజ్ వే), 4 వరుసల సర్వీసు రోడ్డు నిర్మిస్తే... మొదటి భాగానికి రూ.4,531 కోట్లు, రెండో భాగానికి రూ.3,093 కోట్లు ఖర్చవుతుంది.
- ★ 10 వరుసల ప్రధాన రహదారి, 4 వరుసల సర్వీసు రోడ్డు నిర్మిస్తే మొదటి భాగానికి రూ.4,871 కోట్లు, రెండో భాగానికి రూ.3,429 కోట్లు ఖర్చవుతుంది.
- ★ ఇంటర్‌ఛేంజ్‌లు 10.
- ★ మూడు చోట్ల ట్రంపెట్లు.
- ★ గ్రేడ్ సెపరేటర్లు 15.
- ★ రైలు ఓవర్ బ్రిడ్జిలు 5.
- ★ కృష్ణా నదిపై రెండు చోట్ల వారధులు.

మొదటి, రెండు భాగాల రహదారికి రెండు పక్కలా 500 మీటర్ల మేర కారిడార్‌లు అభివృద్ధి చేసేటట్లయితే..! (భూసమీకరణ విధానంలో తీసుకునే పద్ధతిలో)

- ★ మొత్తం కావాల్సిన భూమి: 16556 ఎకరాలు.
- ★ ఇందులో రహదారి నిర్మాణానికి: 1428 ఎకరాలు
- ★ రైతులకు అభివృద్ధి చేసిన స్థలాల రూపంలో ఇవ్వాల్సింది: 4470 ఎకరాలు.
- ★ మౌలిక వసతులు, రహదారుల నిర్మాణానికి: 5296 ఎకరాలు

తొలి దశ ప్రాజెక్టులో మొదటి భాగం (34 కి.మీ.లు) వెళ్లే గ్రామాలు, ఆయా గ్రామాల్లో అవసరమైన భూమి (ఎకరాల్లో)

గ్రామం	పొడవు (కి.మీ.లలో)	అవసరమైన భూమి
కృష్ణా జిల్లాలో...		
కేతనకొండ	1.2	42
కొటికలపూడి	1.7	30
దామలూరు	1.5	15
గుంటూరు జిల్లాలో		
హరిశ్చంద్రపురం	2.5	18
వైకుంఠపురం	2.0	51
వడ్డమాను	2.9	85
ఎండ్రాయి	0.7	5
అనంతవరం	0.3	19
కర్లపూడి	3.7	124
నెక్కల్లు	0.1	5
మోతడక	0.4	6
పెదపరిమి	3.7	111
తాడికొండ	6.2	165
కంతేరు	2.8	51
కాజ	3.0	56
చినకాకాని	1.3	40

రెండో భాగం (33.5 కి.మీ.లు) వెళ్లే గ్రామాలు, అవసరమైన భూమి

గుంటూరు జిల్లాలో		
చినకాకాని	2.4	46
పెదవడ్లపూడి	3.8	54
చినవడ్లపూడి	1.0	18
తుమ్మపూడి	1.0	14
నూతక్కి	3.0	50
రామచంద్రపురం	2.7	42
కృష్ణా జిల్లాలో...		
చోడవరం	4.3	45
పెనమలూరు	2.6	47
పోరంకి	3.2	79
గంగూరు	0.2	2
దోనేఆతుకూరు	0.5	15
నిడమానూరు	2.9	56
సవరగూడెం	1.1	18
వెదురుపావలూరు	4.7	119
రామచంద్రపురం	0.1	0

★ మొదటి, రెండు భాగాల రహదారి నిర్మాణానికి మొత్తం 1428 ఎకరాల భూమి కావాలి. దీన్ని భూసేకరణ విధానంలో తీసుకుంటే 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.2,382 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అంచనా.



ఈ చిత్రంలో గులాబీ రంగులో ఉన్నది అంతర వలయ రహదారి ఆయా ప్రాంతాల మీదుగా ఈ రహదారి వెళ్తుంది

- ★ ప్రభుత్వానికి నికరంగా మిగిలే భూమి: 5363 ఎకరాలు.
- ★ ఎకరం రూ.5 కోట్లు వేసుకున్నా ఈ భూమిని విక్రయించడం వల్ల ప్రభుత్వానికి వచ్చే డబ్బు రూ.26,815 కోట్లు.
- ★ ఐఆర్ఆర్ నిర్మాణ వ్యయం రూ.7,624 కోట్లు.
- ★ రైతుల స్థలాల్లో మౌలిక వసతులకయ్యే ఖర్చు రూ.21,784 కోట్లు.

గ్రామసభలు అభివృద్ధి వేదికలే

- **రాజకీయ వేదికలు కాదు: సీఎం**

ఈనాడు, అమరావతి: "జన్మభూమి గ్రామసభలు అభివృద్ధి వేదికలే తప్ప రాజకీయ వేదికలు కాదు. రకరకాల వ్యక్తులు వేర్వేరు అజెండాలతో వస్తారు. ఎవరు ఏ ఉద్దేశంతో గ్రామసభలకు వచ్చినా మనం బాధ్యతతో వ్యవహరించి, సంయమనం పాటించాలి' అని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 'జన్మభూమి-మాఊరు' మూడో రోజు సందర్భంగా గురువారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. "ప్రజలకు సేవలు అందించడానికి జన్మభూమి కన్నా మెరుగైన వేదికలేదు. మొత్తం 2.46లక్షల రేషన్ కార్డులు ఈ జన్మభూమిలో పంపిణీ చేస్తున్నాం. నియోజకవర్గానికి 2వేలు చొప్పున 4లక్షలు పింఛన్లు కొత్తగా అందజేస్తున్నాం" అన్నారు. ఇళ్ల స్థలాల కొరత దృష్ట్యా ఆయా ప్రాంతాలలో 1ప్లస్ 3 గృహ సముదాయాలకు ప్రజలు మొగ్గు చూపాలని చంద్రబాబు సూచించారు. రెండో రోజు జన్మభూమిపై ప్రజాభిప్రాయ సేకరణ వివరాలు చంద్రబాబునాయుడు వివరించారు.

- ☛ **జన్మభూమిలో మీరు పాల్గొన్నారా?:** అవును-47 శాతం, లేదు-32 శాతం, జరగలేదు-21 శాతం.
- ☛ **అధికారులు హాజరయ్యారా?:** అవును-90 శాతం, లేదు-10 శాతం.
- ☛ **పింఛన్లు అందరికీ అందుతున్నాయా?:** అవును-64 శాతం, లేదు-36 శాతం.
- ☛ **జన్మభూమిలో జరిగిన చర్చ అర్థమైందా?:** అవును- 88శాతం, లేదు-12 శాతం.
- ☛ **రేషన్ కార్డులు అందరికి అందుతున్నాయా?:** అవును-65 శాతం, లేదు-35 శాతం.
- ☛ **అధికారుల స్పందన బాగుందా?:** బాగుంది-54, బాగోలేదు-36 శాతం. తెలియదు-10 శాతం.
- ☛ **చంద్రన్న బీమా ఎలా జరుగుతుంది?:** బాగుంది-63 శాతం, బాగోలేదు-37 శాతం.
- ☛ **అర్జీల పరిష్కారం బాగుందా?:** బాగుంది-48 బాగోలేదు-52 శాతం.

కోడి పందేలను కట్టడి చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తహశీల్దార్లు, 49 మంది స్టేషన్ హౌజ్ అధికారులపై (ఎస్‌హెచ్‌వో) ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అదనపు ప్రమాణ పత్రం దాఖలు చేయాలని ఆ జిల్లా కలెక్టరును ఆదేశించింది. ఆ 43 మంది తహశీల్దార్లను, 49 మంది ఎస్‌హెచ్‌వోలను కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చి వివరణ కోరతామని హెచ్చరించింది. ఈ సమయంలో ఏజీ జోక్యం చేసుకుంటూ ఇప్పటికే వారికి సంజాయిషీ నోటీసులిచ్చామని, వారిపై తీసుకున్న చర్యల వివరాలను కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. దీంతో కోర్టు ధిక్కార చర్యల హెచ్చరికను ధర్మాసనం ఉపసంహరించుకుంది. విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

సంక్రాంతి సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం వెంప, శ్రీరాంపురం గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ. కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలు కోర్టుకు నివేదికలు సమర్పించారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం.. గత సంక్రాంతికి తమ ఉత్తర్వులను అమలు చేయడంలో విఫలమైన తహశీల్దార్లకు, ఎస్‌హెచ్‌వోలకు సంజాయిషీ నోటీసులిచ్చాక వారిపై ఏ చర్యలు తీసుకున్నారని ప్రభుత్వ న్యాయవాదుల్ని ప్రశ్నించింది. కోడి పందేలపై అధికారులు కళ్లు మూసుకోవచ్చేమోగానీ న్యాయస్థానం కళ్లు మూసుకుని లేదనే విషయాన్ని అధికారులు గుర్తు పెట్టుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించింది. గత సంక్రాంతికి జరిగిన పందేల్లో రూ.9.72 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్న హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది (జీపీ) వాదనలపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. రూ.వందల కోట్లలో జరిగే పందేల్లో రూ.9.72 లక్షలు ఏమాత్రమని వ్యాఖ్యానించింది. బెట్టింగ్‌లను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టడం లేదని స్వాధీనం చేసుకున్న సొమ్మును బట్టి తెలుస్తోందని అభిప్రాయపడింది. ఈ పందేలకు ఎక్కడెక్కడి నుంచో జనం వస్తున్నారని, తిరుపతి నుంచి టూరిస్టు బస్సులు పెట్టుకొని మరీ వస్తున్న సంగతీ తనకు తెలుసని ఏసీజే వ్యాఖ్యానించారు. కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా గత సంక్రాంతికి జరిగిన పందేలను తాను టీవీలో చూశానని పేర్కొన్నారు. ఈ సారి సంక్రాంతికి ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. తమ ఉత్తర్వులపై అభ్యంతరముంటే సుప్రీం కోర్టులో సవాలు చేసుకోవచ్చని సూచించారు.

గ్రహం అనుగ్రహం

5-1-2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
చవితి: రా. 12-31 తదుపరి పంచమి
ఆశ్లేష నక్షత్రం: ఉ. 8-59 తదుపరి మఖ
అమృత ఘడియలు: ఉ. 7-28 నుంచి 8-59 వరకు తిరిగి తె. 5-36 నుంచి
వర్జ్యం: రా. 8-25 నుంచి 9-57 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-46 నుంచి 9-30 వరకు తిరిగి మ. 12-27 నుంచి 1-11 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-35

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.0	28.9
రామగుండం	12.0	29.6
హన్మకొండ	14.0	30.0
నిజామాబాద్	14.0	30.0
కరీంనగర్	14.0	31.0
హైదరాబాద్	14.3	29.3
గుంటూరు	15.0	31.0
విశాఖపట్నం	15.8	29.2
శ్రీకాకుళం	16.0	33.0
అనంతపురం	17.7	31.7
మహబూబ్‌నగర్	18.0	31.6
రాజమహేంద్రవరం	18.0	33.0
కడప	18.0	33.0
విజయవాడ	18.5	31.0
తిరుపతి	18.6	30.2
ఖమ్మం	19.0	32.0
సూర్యాపేట	19.0	33.0
తాడేపల్లిగూడెం	19.0	30.5
కర్నూలు	20.2	31.5
నరసాపురం	20.9	30.1
నెల్లూరు	21.0	30.0
ఒంగోలు	21.4	31.9

పిల్లల్ని చంపి భార్యాభర్తల ఆత్మహత్య

- **మృతులు ప్రకాశం జిల్లా కనిగిరి వాసులు**
- **ఆర్థిక సమస్యలే కారణం!**





మృతిచెందిన భార్యాభర్తలు (పాతచిత్రం) ★ విగతజీవులుగా పిల్లలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: విశాఖ ఆరిలోవ ముస్తఫానగర్‌లో గురువారం సాయంత్రం విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబంలో నలుగురు విగతజీవులుగా మారడం ఈ ప్రాంతంలో సంచలనమయ్యింది. ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన దేవిరెడ్డి రాజేష్‌రెడ్డి (35).. భార్య సౌమ్య, ఇద్దరు పిల్లలతో ఆరు నెలలుగా ఆరిలోవలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇరుగుపొరుగు వారితో పెద్దగా పరిచయాలు లేవు. సౌమ్య కుటుంబ సభ్యులు చెన్నై నుంచి ఆరిలోవ పోలీసులకు అందించిన సమాచారం మేరకు విషయం వెలుగులోకి వచ్చింది. గంటన్నర హైరానా తర్వాత పోలీసులు చిరునామా తెలుసుకొని వెళ్లారు. అప్పటికే నలుగురూ మృతిచెంది ఉన్నారు. ముందుగా పిల్లలిద్దర్ని చంపేసిన భార్యాభర్తలు తర్వాత ఎదురెదురుగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందారు. రాజేష్‌రెడ్డి తన అన్న కుమార్తెను కిడ్నాప్ చేసిన కేసులో జైలుకు వెళ్లివచ్చాడు. ఆస్తి గొడవల నేపథ్యంలో ఈ నేరం చోటు చేసుకున్నట్లు సమాచారం. బెయిల్‌పై వచ్చిన రాజేష్.. కుటుంబంతో కలిసి విశాఖ వచ్చి ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటున్నాడు. దగ్గరి బంధువులతో సంబంధాలు తెగిపోవడం, ఆర్థిక సమస్యల కారణంగా వీరు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వారి వద్ద లేఖ లభ్యమైంది. సౌమ్య రాసినట్లుగా ఉన్న లేఖలో తమకు చాలా చెడ్డపేరు వచ్చిందని, పిల్లల్ని చంపేశామని, తాము కూడా చచ్చిపోతున్నామంది. పిల్లల్ని చంపి, తాము చనిపోతున్నట్లు చెన్నైలో ఉన్న తన కన్నవారికి ఫోన్‌లో సౌమ్య సమాచారం ఇచ్చింది. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని... కాంక్రీటు పనుల వేగం పెంచేందుకు అవకాశం ఇచ్చి చూసి ఆ తర్వాత టెండర్లపై నిర్ణయం తీసుకుందామని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పోలవరం టెండర్ల గడువు జనవరి 5 వరకూ పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ గడువు శుక్రవారంతో ముగుస్తోంది. ఈ నేపథ్యంలోనే జలవనరులశాఖ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కేంద్ర జల వనరులశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. డిసెంబరు 15న గడ్కరీ ఇచ్చిన గడువు జనవరి 15తో ముగుస్తుందని, పోలవరం గుత్తేదారు కాంక్రీటు పనుల్లో ఏ మాత్రం వేగం పెంచలేకపోయారని కేంద్ర కార్యదర్శికి తెలియజేశారు.

టెండర్లకు కేంద్రం సరే!

కేంద్ర మంత్రి నిర్దేశించిన లక్ష్యం మేరకు జనవరి 15కు కాంక్రీటు పనులు పూర్తయ్యే అవకాశం లేదని ప్రస్తావిస్తూ... జనవరి 5న తమ టెండర్ల ప్రక్రియ గడువు ముగుస్తున్నందున వాటిని తెరుచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర కార్యదర్శి టెండర్ల ప్రక్రియకు సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేస్తూ పోలవరం అథారిటీ అనుమతి ద్వారా ప్రక్రియను ముందుకు కొనసాగించుకోవచ్చని సూచించారు.

ఈ మేరకు పోలవరం అథారిటీకి లేఖ రాయాలని సూచించారు. దీంతో జల వనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వచ్చే వారం పోలవరం అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, టెండర్ల ప్రక్రియ కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ లేఖ రాయనున్నారు. దీంతో సంక్రాంతి నాటికి టెండర్ల వ్యవహారం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.

ఎమ్మార్ కేసులో ఎల్వీ సుబ్రహ్మణ్యంపై కేసు కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: ఎమ్మార్ కేసులో 11వ నిందితుడిగా ఉన్న ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంకు ఊరట లభించింది. ఆయనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎమ్మార్ ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలను చూపలేదని పేర్కొంది. ఈమేరకు జస్టిస్ బి.శివశంకరరావు 169 పేజీల తీర్పు వెలువరించారు. ఎమ్మార్ కేసులో ఏపీఐఐసీ వైస్‌ఛైర్మన్, ఎండీగా ఉన్నపుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం ఉదాసీనంగా వ్యవహరించారని, దీనివల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. తనపై ఆధారాల్లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని, తనపై అభియోగాలను విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకుంటూ సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలంటూ ఎల్వీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.శివశంకరరావు గురువారం న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ ఎల్వీ పిటిషన్‌ను అనుమతించారు. ఎల్వీ ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రప్రభుత్వం 2012లో తిరస్కరించిందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రాసిక్యూషన్‌కు అనుమతించిందని ఇది సరైన పద్ధతిలో జరగలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్న అంశాలను కేంద్రం విస్మరించిందన్నారు. ఇది సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెల్లదన్నారు. అభియోగ పత్రంలోని అంశాలనే పేర్కొంటూ అనుమతిని మంజూరు చేసిందన్నారు. ప్రాజెక్టుకు భూమి ఎకరాకు రూ.29 లక్షలకు కేటాయించాలని సిఫారసు చేయడం కుట్రలో భాగమేనన్న సీబీఐ వాదనను తోసిపుచ్చారు. మంత్రిమండలి నిర్ణయాలను అమలు చేయడం తప్ప సొంతంగా నిర్ణయం తీసుకున్నట్లు లేదని, సీబీఐ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

రేపు ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారంలోపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అక్కడ హిందూ మహాసముద్రానికి అనుబంధంగా 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి ఏర్పడిందని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణమే ఉంటుందని వివరించింది. రాయలసీమ జిల్లాల్లో రాత్రిపూట సాధారణంకన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. కోస్తాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల సాధారణంకన్నా తక్కువ నమోదవుతున్నాయని తెలిపింది.

నేడో, రేపో విచారణ ప్రారంభం

● దుర్గమ్మ గుడిలో రాత్రి పూజల ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ

ఈనాడు-అమరావతి: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 26 రాత్రి ఆలయ వేళలు దాటిన తర్వాత పూజలు చేశారనే ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ శుక్రవారం లేదా శనివారం విచారణ ప్రారంభించనున్నది. ఈ అంశంలో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో దేవాదాయశాఖ ఇన్‌ఛార్జి అదనపు కమిషనర్ రఘునాథ్ (ఈయన పెనుగ్రంచిపోలు ఆలయ ఈవోగాను వ్యవహరిస్తున్నారు)తో పాటు ఆగమశాస్త్ర సలహాబోర్డు సభ్యుడు చిర్రావుల శ్రీరామశర్మ(రాజమహేంద్రవరం)లను సభ్యులుగా నియమించారు. డిసెంబర్ 26న రాత్రి అసలు ఆలయంలో ఏం జరిగింది? ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఏమైనా జరిగిందా? ఇందులోని లోటుపాట్లు ఏమిటి? అనే విషయాలను ఈ కమిటీ విచారించి నిజానిజాలు నిగ్గు తేల్చి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. పోలీసు అధికారులు సయితం దుర్గగుడి ఘటనలపై వారి పరిధి మేరకు విచారణ జరుపుతారు. ఈ రెండు నివేదికల సిద్ధమైన తర్వాత ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం గుర్తించిన వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పనుంది.

సెలవుపై బద్రీనాథ్

మరో వైపు దుర్గగుడి ఆలయ ప్రధాన పూజారి బద్రీనాథ్ సెలవుపై వెళ్లారు. ఈ వ్యవహారంపై ఆ రోజు విధుల్లో ఉన్న ఏఈవో తిరుమలరావు, సూపరింటెంట్ గోపీ, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహారావుకు కార్యనిర్వహణాధికారి సూర్యకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. క్యూలైన్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవరావును బదిలీ చేశారు.



ప్రభుత్వానికే ఇబ్బందులు తేవడమేంటి?

ఈ మొత్తం వ్యవహారంపై స్వయంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం చెందారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో విజయవాడ నగర తెదేపా అధ్యక్షుడు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న గురువారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నియమించిన పాలకమండలి ప్రభుత్వానికే ఇబ్బందులు తెచ్చిపెట్టడం ఏమిటంటూ సీఎం ప్రశ్నించినట్లు సమాచారం. ఏ ఆధారాలతో పూజలు జరిగాయని పాలకమండలి మాట్లాడుతోందంటూ ఆగ్రహించారు. ఇలా అయితే పాలకవర్గాన్ని రద్దు చేస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. వ్యవహారాన్ని చక్కదిద్దాల్సిన బాధ్యతను నగర అధ్యక్షుడిగా వెంకన్నకు గుర్తు చేశారు. దీంతో విజయవాడలోని కేశినేని భవన్‌లో పాలకవర్గ అధ్యక్షుడు గౌరంగబాబు సహా సభ్యులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. దుర్గగుడి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా పాలకవర్గం వ్యవహరిస్తే ప్రభుత్వం రద్దు చేయడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు.

సీఎస్‌కు దుర్గగుడి ఈవో వివరణ!

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్‌ను విజయవాడ దుర్గగుడి కార్యనిర్వహణాధికారి సూర్యకుమారి గురువారం మధ్యాహ్నం కలిసి ఆలయ ఘటనలపై వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల దుర్గగుడిలో నిబంధనలు విరుద్ధంగా కొన్ని వ్యవహారాలు చోటుచేసుకున్నట్లు వచ్చిన వార్తలపై దినేష్‌కుమార్ ఆమెకు పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది.

భారతీ తీర్థస్వామి సూచనలతో నిత్యపూజలు: మాణిక్యాలరావు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడ దుర్గమ్మ దేవాలయం వ్యవహారంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిజనిర్ధరణ కమిటీ వేశామని, 48 గంటల్లో నివేదిక వస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి గురువారం విలేకరులతో మాట్లాడారు. తనకు అందిన సమాచారం మేరకు కేవలం దేవాలయ పరిశుభ్రత, పూల అలంకరణ చేసేందుకు బయట అర్చకులు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఇకపై నిత్యపూజల నిర్వహణపై శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థస్వామివారి సూచనల మేరకు బ్లూ ప్రింట్ రూపొందిస్తామన్నారు.



గజల్ శ్రీనివాస్ వికృత చర్యలు బాధాకరం: గజల్ శ్రీనివాస్ అనే నాణేనికి ఒకవైపే చూశానని, రెండోవైపు చాలా జుగుప్సాకరంగా ఉందని మాణిక్యాలరావు వెల్లడించారు. ఆయన వికృత చర్యలు చాలా బాధించాయని అన్నారు. ఇటువంటి వ్యక్తుల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గజల్ శ్రీనివాస్‌ను పోలీసు కస్టడీకి నిరాకరించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్, న్యూస్‌టుడే: లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడిగా రిమాండ్‌లో ఉన్న ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వడానికి నాంపల్లి కోర్టు తిరస్కరించింది. పంజాగుట్ట పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి పోలీసు కస్టడీకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం గజల్ శ్రీనివాస్ తరపు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో బెయిల్ కోసం మరోసారి పిటిషన్ వేయడానికి సిద్ధమయ్యారు. బెయిలు ఇవ్వవద్దంటూ ప్రత్యేక పిటిషన్‌ను న్యాయస్థానంలో ప్రభుత్వ న్యాయవాదులు దాఖలు చేయనున్నారు.

17న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 17న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. అలాగే 18, 19వ తేదీల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది.



పోట్లాటలో ఎలుకదే పైచేయి!



కుక్క, ఎలుకల పోట్లాటలో చివరకు ఎలుకదే పైచేయి అయింది. ఎలుకే కదా అని సులువుగా నోట కరుచుకుపోదామనుకున్న శునకానికి మూషికం తన పంటి పదును రుచి చూపించింది. చివరకు దాన్ని ఏమీ చేయలేక వదిలేసింది. అంతే దర్జాగా తోక ఊపుకుంటూ అక్కడినుంచి ఎలుక తుర్రుమంది. తూర్పుగోదావరి జిల్లా పెదపూడి మండలం కరకుదురు వద్ద కనిపించింది ఈ దృశ్యం.

– ఈనాడు, రాజమహేంద్రవరం

9వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

● భోజన సమయంలో ఇంటికొచ్చి ఉరి
● పాఠశాల ఒత్తిడి వల్లేనని ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

అనంతపురం, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజనానికి ఇంటికొచ్చిన 9వ తరగతి విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. కోవూర్‌నగర్‌కు చెందిన రవీంద్ర, వెంకటేశ్వరమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జ్ఞానసాగర్(14) నగరంలోని నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఆయుర్వేద దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి ఇంటికొచ్చిన జ్ఞానసాగర్ వెంటనే ఉరివేసుకున్నాడు. ఆ సమయంలో తల్లిదండ్రులిద్దరూ దుకాణం వద్ద ఉన్నారు. తండ్రి రవీంద్ర 2 గంటలకు ఇంటికి వచ్చి చూడగా కుమారుడు తాడుకు వేలాడుతూ కనిపించాడు. నాలుగో పట్టణ ఎస్సై శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఒత్తిడే కారణం..: విద్యాసంస్థలో చదువుల భారం, ఒత్తిడి అధికం కావడంతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిత్యం పాఠ్యాంశాలను అంతర్జాలం నుంచి డౌన్‌లోడ్ చేసుకురావాలని చెప్పడంతో జ్ఞానసాగర్ ఇబ్బంది పడుతున్నాడన్నారు. పాఠశాల ఫీజులు మొత్తం చెల్లించినా.. సైన్స్‌ఫేర్ ఫీజు, పరీక్ష ఫీజు చెల్లించలేదని రెండు రోజుల కిందట బయట నిలబెట్టారని బాధపడ్డాడన్నారు. ఇలాంటి చర్యలతో మనస్తాపానికి గురై అఘాయిత్యానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సాంకేతికతతో ప్రజలకు చేరువగా సేవలు



కృష్ణాజిల్లా తిరువూరు ఏజేఎఫ్‌సీఎం కోర్టు హాలును సాంకేతిక విధానంలో ప్రారంభిస్తున్న జస్టిస్ రామసుబ్రమణియన్

● జస్టిస్ రామసుబ్రమణియన్ వెల్లడి

తిరువూరు, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు. కృష్ణా జిల్లా తిరువూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నూతన భవనం కోర్టు హాలును గురువారం సాయంత్రం ఆయన హైకోర్టు నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో ప్రారంభించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సందేశాన్నిచ్చారు. డిజిటల్ పద్ధతిలో దేశంలో రెండోది, దక్షిణాదిన మొదటిదైన ఈ కార్యక్రమం తన చేతుల మీదుగా ప్రారంభించటం సంతోషం కలిగించిందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు ప్రారంభోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తులు వెంకటేశ్వరప్రసాద్, టి.వేణుగోపాలరావు, స్థానిక జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి పి.రాజు, అవనిగడ్డ న్యాయమూర్తి అమర రంగేశ్వరరావు, ఏపీపీ పి.రాధిక, ఏజీపీ కె.అబ్రహం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినిమా టికెట్ల ధరల పెంపునకు థియేటర్లకు అనుమతి

మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రెండు రాష్ట్రాల్లో సినిమా టికెట్ల ధరలను పెంచుకోవడానికి థియేటర్లకు అనుమతినిస్తూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అన్ని తరగతుల ప్రతిపాదిత టికెట్ల ధరల సమాచారం సంబంధిత యంత్రాంగానికి ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసి మార్గదర్శకాలు రూపొందించేదాకా ఈ ధరలను పెంచుకోవచ్చని స్పష్టం చేసింది. పెంచుకున్న ధరలకు అనుగుణంగా తగిన నిష్పత్తిలో పన్ను చెల్లించాలని పేర్కొంది. పెంచిన మొత్తాలకు సంబంధించి ప్రత్యేక ఖాతాను ఏర్పాటు చేయాలంటూ గతంలో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ప్రత్యేక ఖాతాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు అమలవుతున్నాయో లేదో జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షించాలని, దీనిపై నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై కౌంటర్లు దాఖలు చేయాలంటూ తదుపరి విచారణను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేసింది. ఈమేరకు జస్టిస్ ఎస్.వి.భట్ ఉత్తర్వులు వెలువరించారు. తమ సినిమా హాళ్లలో టిక్కెట్ ధరల పెంపు నిమిత్తం పెట్టుకున్న దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలేదని, జీవో జారీ చేసేలోగా ధరలను పెంచుకోవడానికి అనుమతించాలంటూ పలు థియేటర్లు హైకోర్టును ఆశ్రయించటం తెలిసిందే.

అడ్డుకోవడానికే కేసు పెట్టారు!

హైకోర్టును ఆశ్రయించిన న్యాయవాది త్రినాథరావు

ఈనాడు, హైదరాబాద్: మాడుగుల పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 102 కింద తనపై కేసునమోదు చేయడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది పల్లా త్రినాథరావు హైకోర్టును ఆశ్రయించారు. విశాఖ జిల్లా వాకపల్లి గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారనే ఆరోపణలతో నమోదైన కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ)గా పల్లా త్రినాథరావును నియమించాలని గిరిజన మహిళలు కోరుతున్న విషయం తెలిసిందే. గత డిసెంబర్ 29న వాకపల్లి వెళ్తున్న సమయంలో పోలీసులు తన వద్ద ఉన్న వివరాల్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారన్నారు. ఆ గ్రామానికి వెళ్లడం చట్ట విరుద్ధమేమి కాదన్నారు. తనను ఎస్‌పీపీగా నియమించకుండా అడ్డుకునే చర్యల్లో భాగంగా పోలీసులు తనపై కేసు పెట్టారన్నారు. వ్యాజ్యంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి శుక్రవారం మరోసారి విచారణ జరపనున్నారు.

ఉచిత నివాస సదుపాయం కల్పించండి: అమరావతి పరిధిలో ఉచిత నివాస సదుపాయం కల్పించాలని 'ఏపీ హైకోర్టు అడ్వొకేట్స్ కర్న్స్' సంఘం కోరింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ సమర్పించినట్లు గురువారం తెలిపింది. ఏపీ హైకోర్టు ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నందున తమ ఆర్థిక ఇబ్బందుల్ని పరిగణనలోకి తీసుకొని అద్దె చెల్లింపు/ఉచిత నివాసం కల్పించాలని విన్నవించింది.



ఈనాడు

నవ భారతానికి కొత్త 'నీతి'

ఆరున్నర దశాబ్దాల పాటు ఉనికి చాటుకున్న ప్రణాళిక సంఘం స్థానే భారత పరివర్తన జాతీయ సంస్థ(నీతి ఆయోగ్) కొలువుతీరి మూడేళ్లయింది. వ్యూహ నిర్మాణం అట్టడుగునుంచి పైస్థాయికి సాగేందుకు దోహదపడుతుందంటూ మోదీ ప్రభుత్వం అంటుకట్టిన నూతన వ్యవస్థ పట్ల ఆదిలోనే అంచనాలు మిన్నంటాయి. రాష్ట్రాల అభివృద్ధి ఆకాంక్షలు, మధ్యతరగతి కోరికలు, యువత ఆశలు, అయిదుకోట్ల చిన్న వ్యాపారుల కలలు సహా అన్నింటినీ అందరినీ 'నీతి ఆయోగ్' పరిగణనలోకి తీసుకుంటుందని అప్పట్లో ప్రధానమంత్రి అభయమిచ్చారు. ముఖ్యమంత్రులకు సంబంధించినంతవరకు 'నీతి ఆయోగ్' ఆవిర్భావం అత్యంత సంతృప్తికర పరిణామం. గతంలో ప్రణాళిక సంఘం తీర్మానాలను జాతీయాభివృద్ధి మండలి సభ్యుల హోదాలో మొక్కుబడిగా ఆమోదించడానికే వారి పాత్ర పరిమితమయ్యేది. ప్రాథమిక దశనుంచీ ప్రణాళికల కూర్పులో ముఖ్యమంత్రులకు భాగస్వామ్యం కల్పించే సత్సంప్రదాయానికి తెర తీయడం ఎన్నదగిందే అయినా- ఇప్పటివరకు 'నీతి ఆయోగ్' ముమ్మార్లే సమావేశం కావడం, అదింకా సరిగ్గా కుదురుకోలేదని స్పష్టీకరిస్తోంది. ఆఖరిసారి గడచిన ఏప్రిల్‌లో అరవింద్ పనగడియా నేతృత్వాన సమావేశమైనప్పుడు, సంప్రతింపుల ప్రక్రియ కొరవడిందని ముఖ్యమంత్రులు ఆరోపించారు. దాంతో, మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికపై ముందడుగు పడలేదు. ఇటీవల సారథ్య బాధ్యతలు చేతులు మారి రాజీవ్ కుమార్‌కు దఖలుపడిన తరవాతి పరిణామాల నేపథ్యంలో, సలహాదారు స్థాయికి 'నీతి ఆయోగ్' భూమిక కుంచించుకుపోయిందన్న విమర్శలు వినవస్తున్నాయి. భారత్ దశను దిశను మార్చే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక అజెండాల రూపకల్పనతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తలలో నాలుకలా మెలగాల్సిన వ్యవస్థగా మూడు సంవత్సరాలనాడు 'నీతి ఆయోగ్'ను ఎందరో స్వాగతించారు. 'శ్రేష్ఠ భారత్'కు బాటలుపరచే కర్తవ్య నిర్వహణలో అది సమర్థంగా రాణిస్తేనే, స్థాపిత లక్ష్యం నెరవేరినట్లు.

సామ్యవాద భావజాలానికి పెద్దపీట వేసిన ప్రథమ ప్రధాని నెహ్రూ మానస పుత్రికగా 1950లో కన్ను తెరిచిన ప్రణాళిక సంఘం, అనంతర కాలంలో పరిధి మీరి విస్తరించుకుపోయింది. 'సూపర్ క్యాబినెట్'గా విమర్శలు వెల్లువెత్తినా దిద్దుబాటు చర్యలు కొరవడ్డాయి. సంస్కరణల పథ ప్రస్థానం ఆరంభమై భారత్ మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడంతోనే, ప్రణాళిక సంఘం వ్యవస్థాపక ఔచిత్యాన్ని కోల్పోయింది. అయినా యథాతథంగా కొనసాగించిన పర్యవసానం- పన్నెండు పంచవర్ష ప్రణాళికలు, ఆరు వార్షిక ప్రణాళికల కోసమంటూ వెచ్చించిన వందల లక్షల కోట్ల రూపాయలకు దీటైన ఫలితాలు దక్కకుండా పోయాయి. నేటికీ ఆకలి, అవిద్య, అనారోగ్యాలు జాతిని చెండుకుతింటున్న అవ్యవస్థ మూలాలు అక్కడున్నాయి. ఆ వివేచనతోనే నిరుడు ఏప్రిల్‌నాటి 'నీతి ఆయోగ్' దార్శనిక పత్రం నవభారత ఆవిష్కరణకు అయిదు ప్రధాన లక్ష్యాలను నిర్దేశించింది. నూరుశాతం అక్షరాస్యత, అందరికీ ఆరోగ్య సేవలు, విస్తృత రవాణా వసతులు, పరిశుభ్ర పరిసరాలు, సమున్నత జీవన ప్రమాణాలతో మెట్టు ఎక్కితేనే 2031-32 నాటికి సౌభాగ్యవంతమైన దేశంగా భారత్ చైనాకు సాటి, పోటీ కాగలదని స్పష్టీకరించింది. కీలక రంగాల్లో రాష్ట్రాల మధ్య ప్రగతి స్పర్ధ రగిలించడంలో స్వీయ పాత్ర నిర్ధారించుకున్నామని 'నీతి ఆయోగ్' సంబరపడుతున్నా- అది ఇప్పటికి చేసింది తక్కువ, చేయాల్సింది ఎంతో ఎక్కువ! ప్రపంచ మానవాభివృద్ధి సూచీల్లో ఇండియా మందభాగ్యాన్ని చెదరగొట్టడంలో ఘోర వైఫల్యం, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వ్యూహ రచనా కౌశలం తరుగుపడుతున్న ప్రణాళిక సంఘాన్ని ఖర్చు రాసేశాయి. తాను దానికి భిన్నమని చేతల్లో చాటుకుంటేనే 'నీతి ఆయోగ్' నిలదొక్కుకోగలుగుతుంది!

చమురింకి ఆరిపోయే దశలో దీపం ఒక్కసారిగా గప్పున వెలిగినట్లు, కాలగర్భంలో కలిసిపోవడానికి రెండేళ్ల ముందు- ఎనిమిది శాతం వృద్ధి లక్ష్యంగా కార్యాచరణతో ప్రణాళిక సంఘం యథార్థాలు క్రోడీకరించింది. నాణ్యమైన విద్య, నిపుణ కార్మికులపై దృష్టి పెట్టాలంటూనే- ఒక రంగానికి మించి వేసినంత మాత్రాన తక్కిన రంగాలన్నీ వాటంతటవే కుదుటపడే అవకాశం లేదని కుండబద్దలుకొట్టింది. సమ్మిళిత ఆర్థికాభివృద్ధిని లక్ష్యించే తప్ప ఏ దశలోనూ విద్య, పర్యావరణం, ఆరోగ్యం తదితర అంశాల్లో పణం పెట్టకూడదన్న 'నీతి ఆయోగ్' సభ్యుల వీకే సారస్వత్ వ్యాఖ్యల్లోనూ అదే స్ఫూర్తి పొంగులు వారింది. దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల పరిరక్షణకు నిబద్ధత చాటే ఏ నేత అయినా సంస్థ అయినా విస్మరించరాని ఒరవడి అది! కృత్రిమ మేధపై లోతైన పరిశోధనకు, పాలనలో సాంకేతికతకు విశేష ప్రాధాన్యం ఇవ్వాలన్నది 'నీతి ఆయోగ్' నవసంకల్ప దీక్ష. బడాయి లక్ష్యాల వల్లెవేతపై కాదు- ప్రాథమిక లోటుపాట్ల పరిహరణ, కంతలు పూడ్చటం మీద తదేక దృష్టి లగ్నం కావాల్సిన సంక్లిష్ట తరుణమిది. నివారించదగ్గ రోగాలు, సాంక్రామికేతర వ్యాధులు, ప్రమాదాల్లో జనసమ్మర్దం రూపేణా ఏటా స్థూల దేశీయోత్పత్తిలో ఆరు శాతం మేర ఇండియా నష్టపోతోంది. తలకు మించిన వైద్య ఖర్చులతో ప్రతి సంవత్సరం నాలుగు కోట్లమందికి పైగా దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు. నేటికీ కోట్లాది భారతీయులు స్వచ్ఛమైన తాగునీటికి నోచుకోవడం లేదు. అవినీతి, అస్తవ్యస్త రవాణా- భారత అభివృద్ధి ప్రస్థానాన్ని దిగలాగుతున్నట్లు అధ్యయనాలు మొత్తుకుంటున్నాయి. మానవ వనరుల్ని నిపుణ శక్తులుగా మలచుకొని పురోగామి దేశాలు అద్భుతాలు సృష్టిస్తుండగా, ఆ దిశగా ఎన్నదగ్గ కృషి కరవై భారతీయ యువత నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతోంది. ఈ సవాళ్లన్నింటినీ సాకల్యంగా ఆకళించుకొని సృజనాత్మక పరిష్కారాలు అన్వేషించేలా 'నీతి ఆయోగ్'ను పరిపుష్టీకరించడం ప్రాణావసరం. ఆ బృహత్తర కర్తవ్యాన్ని పాలక శ్రేణి సమర్థంగా నిర్వర్తిస్తేనే- భారత్‌కు మహోదయం!

భూమి హక్కుపై హామీ లేకే చిక్కు

భూమి ఉండి, రికార్డుల్లో వివరాలు సరిగ్గా నమోదుకాక ఆ భూమి నుంచి దక్కాల్సిన ప్రయోజనం పొందలేకపోతున్న రైతులు దేశంలో ఎందరో ఉన్నారు. సాగు చేసుకుంటున్న భూమిపై పంట రుణం, ఇతర రుణాలు, పంట నష్టపరిహారం, పంటబీమా పొందాలన్నా, సబ్సిడీలకైనా ఇతర ఏ సాగు సహాయాలకైనా భూమి సాగులో ఉంటే సరిపోదు. ఆ భూమికి తానే యజమాని అని నిరూపించే తగిన పత్రాలు ఉండాలి. వివిధ శాఖలు నిర్వహించే భూమి రికార్డుల్లో వివరాలు నమోదై ఉండాలి. అంటే, స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, భూమి రికార్డుల్లో పేరు ఉంటేనే- ఆ భూమిపై ఎలాంటి లబ్ధి అయినా చేకూరేది. ఆ భూమిపై హక్కుకు భద్రత ఉండేది. కానీ, ప్రస్తుతం ఈ భూమి రికార్డులేవీ వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదు. భూమి వాస్తవంగా, చట్టబద్ధంగా కలిగి ఉన్న వ్యక్తికి పట్టా ఉండాలి. ఆ వ్యక్తి పేరే భూమి రికార్డుల్లో నమోదు కావాలి. కానీ ఎక్కువ సందర్భాల్లో భూమి ఉన్నా పట్టా ఉండదు. పట్టా ఉన్నా రికార్డుల్లో పేరు నమోదు కాదు. పేరు నమోదైనా, వివిధ రికార్డుల్లో ఉన్న వివరాల మధ్య పొంతన కుదరదు. దీనివల్ల రైతులు లబ్ధి పొందలేకపోవడమే కాకుండా, ఎన్నో ఇతర సమస్యల్లో చిక్కుకొంటున్నారు.

దేశవ్యాప్తంగా సివిల్ కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న వివాదాల్లో మూడింట రెండువంతులు భూమి తగాదాలే. అధిక శాతం నేరాలకు భూ వివాదాలే ముఖ్యకారణం. భూమిపై హక్కులు సరిగ్గా లేకపోవడం, భూమి రికార్డులు ఎప్పటికప్పుడు తాజాపరచకపోవడం వల్ల లావాదేవీలు గోప్యంగా జరగడానికి, బినామీ కొనుగోళ్లు పెరగడానికి దారి ఏర్పడుతోందని నల్లధనంపై విడుదల చేసిన శ్వేతపత్రంలో వెల్లడించారు. రాబోయే అయిదేళ్లలో దేశం మొత్తంమీద రెండు కోట్ల ఇళ్లు అవసరమవుతాయి. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులు పెంచాలన్నా, పెట్టుబడులు పెరగాలన్నా, భూముల అవసరం ఎంతో ఉంటుంది. కానీ భూ వివాదాలు, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించని రికార్డులు అడ్డంకిగా మారాయి. రైతు ఆదాయం పెరగాలన్నా, దేశం అభివృద్ధి చెందలన్నా వివాదాలు, నేరాల సంఖ్య తగ్గాలన్నా భద్రమైన భూమి హక్కులు, తాజా పరిచిన తప్పులు లేని రికార్డులే కీలకం. అసంపూర్తిగా మిగిలిపోయిన భూ సంస్కరణలు పూర్తికావాలన్నా రికార్డులే ఆవశ్యకం.

తప్పుల తడకలకు కారణాలెన్నో

భూమిపై హక్కులు, సాగు, వాస్తవ పరిస్థితులు కచ్చితంగా ప్రతిబింబించే భూమి రికార్డులు, మెరుగైన భూ పరిపాలన ఉన్నట్లయితే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 1.3 శాతం పెరుగుతుందని, ప్రతి భూమి యజమానీ సంవత్సరానికి కనీసం లక్ష రూపాయల వరకు మేలు పొందగలడని వివిధ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రైతులకు చేకూర్చే ఏ మేలైనా అర్హులకు అందాలంటే రికార్డుల్లోని వివరాలే కీలకం. ఇంత ముఖ్యమైన భూమి రికార్డులు శిథిలావస్థలో, వాస్తవ పరిస్థితులకు ఆమడదూరంలో ఉంటున్నాయి. ప్రతి సంవత్సరం భూమి రికార్డులను పరిశీలించి, వాటిని తాజాపరచే ప్రక్రియ ఎక్కడా సరిగ్గా జరగడం లేదు. కనీసం 30ఏళ్లకు ఒకసారైనా చేపట్టాల్సిన భూముల సర్వే దశాబ్దాలు గడిచినా చోటుచేసుకోవడం లేదు. అస్తవ్యస్త భూ పరిపాలన, భూమి రికార్డుల గత చరిత్ర, స్వాతంత్ర్యానంతరం ఆశించిన మేరకు ప్రయత్నాలు జరగకపోవడం, రికార్డుల్ని ఒకటి కంటే ఎక్కువ శాఖలు నిర్వహించడం ప్రస్తుత దుస్థితికి కారణాలు. భూమి చట్టాలు, వాటిలో ఉన్న లోపాలు పరిస్థితిని దిగజారుస్తున్నాయి. ఒక వ్యక్తి పేరు భూ రికార్డుల్లో నమోదై ఉంటే, వేరే ఎవరైనా ఆ భూమి తనది అని నిరూపించుకోగలిగితే రికార్డుల్లో మొదటి వ్యక్తిపేరు తొలగించి ఆ నిరూపించుకున్న వ్యక్తి పేరు నమోదు చేస్తున్నారు. ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్, కెనడా, సింగపూర్, మలేసియా, స్విట్జర్లాండ్ లాంటి దేశాల్లో ఒకసారి భూమికి యాజమాన్య హక్కు పత్రం పొందితే, ఇక అదే అంతిమం. భూమిపై హక్కుకు ఆ పత్రం పూర్తి భద్రత ఇస్తుంది. భూమిపై హక్కులు కోల్పోవలసి వస్తే, బీమా సంస్థలు డబ్బులు చెల్లిస్తాయి. ఇలాంటి ఏర్పాటును టైటిల్ గ్యారంటీ వ్యవస్థ అంటారు. ఈ వ్యవస్థను మన దేశంలో కూడా తీసుకురావడానికి దశాబ్ద కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆధునికీకరణ వైపు...

ఎనిమిదో దశకం నుంచి కేంద్ర ప్రభుత్వం భూమి రికార్డుల ఆధునికీకరణకు, భూపరిపాలన పటిష్ఠీకరణకు వివిధ పథకాల ద్వారా కృషి చేస్తూనే ఉంది. ఈ పథకాలన్నింటినీ ఏకీకృతం చేసి, 2008లో జాతీయ భూమి రికార్డుల ఆధునికీకరణ పథకాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా భూమి రికార్డుల ఆధునికీకరణ వైపు ముందడుగు వేసింది. 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని సమూలంగా సమీక్షించి, 100 శాతం కేంద్ర నిధులతో నాలుగు సంవత్సరాల్లో



ఏ వివరమైనా కంప్యూటర్‌లోనే...




నూతన రీతిలో భూముల సర్వే

రికార్డుల నవీకరణ ఆవశ్యకం

ఆశించిన లక్ష్యాలను చేరుకోవడానికి డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునికీకరణ పథకం ప్రారంభించింది. భూమి రికార్డులను తాజాపరచడం, కంప్యూటర్ల ద్వారా భూమిపై లావాదేవీలను వెనువెంటనే రికార్డుల్లో నమోదు చేయడం, సర్వే రికార్డులను ఇతర భూమి రికార్డులతో అనుసంధానించడం, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం నెలకొల్పడం, అంతిమంగా టైటిల్ గ్యారంటీ వ్యవస్థను ప్రవేశపెట్టడం- పథకం లక్ష్యాలు. ఈ పథకం ఇప్పుడు వివిధ రాష్ట్రాల్లో వేగంగా అమలవుతోంది. ఈ పథకం రాబోయే నాలుగు సంవత్సరాల్లో దాదాపు రూ.11,000 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో దేశంలోని అన్ని గ్రామాల్లో భూమి రికార్డులను ఆధునికీకరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. టైటిల్ గ్యారంటీ వ్యవస్థను ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటోంది. 2008 నుంచి 2017 సెప్టెంబరు వరకు కేంద్ర ప్రభుత్వం రూ.1926 కోట్లు మంజూరు చేసి రూ.1157 కోట్లు

భూమి వివరాలు - కంప్యూటరీకరణ



విడుదల చేసింది. ఇందులో రూ.745 కోట్లు ఖర్చయ్యాయి. ఈ నిధులతో ఇప్పటి వరకు 86శాతం భూమి రికార్డుల కంప్యూటరీకరణ, 46శాతం భూమి పట్టాల కంప్యూటరీకరణ, తొమ్మిది శాతం గ్రామాల్లో సర్వే పూర్తయ్యాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఒక వినూత్న పథకాన్ని ప్రారంభించి, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవిన్యూ గ్రామాల్లో భూమి రికార్డుల ఆధునికీకరణను ఉద్యమ స్ఫూర్తితో కొనసాగిస్తోంది. ప్రతీ భూయజమానికి పాస్‌పోర్ట్ లాంటి యాజమాన్య హక్కు పత్రాన్ని అందించనున్నారు. రిజిస్ట్రేషన్-రెవిన్యూ శాఖలను అనుసంధానించనున్నారు. ఇలాంటి ఎన్నో కీలక మార్పులకు సన్నాహాలు చేస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ మూడు సంవత్సరాలుగా భూమి రికార్డుల సవరణ కృషి జరుగుతోంది. భూ కమతాలను జియోటాగింగ్ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని, ట్యాబ్‌ల ద్వారా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. అంతేగాక నూతనంగా వస్తున్న బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించుకుని భూమి రికార్డుల నిర్వహణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గుజరాత్ రాష్ట్రం భూముల సర్వేకి విశేషంగా కృషిచేసి దాదాపుగా 98 శాతం భూముల సర్వేని పూర్తిచేసి రికార్డు సృష్టించింది.

రూపుదిద్దుకుంటున్న చట్టాలు

ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్ఓఆర్ చట్టాల స్థానంలో టైటిల్ గ్యారంటీ చట్టాలను తీసుకురావాలని 1986 నుంచి వివిధ కమిటీలు సిఫార్సు చేశాయి. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టైటిల్ గ్యారంటీ వ్యవస్థను తీసుకువచ్చే ప్రయత్నం జరిగింది. నిజామాబాద్ జిల్లాలో అమలుచేసిన భూభారతి పథకంలో భాగంగా టైటిల్ గ్యారంటీ చట్టం ముసాయిదాను తయారుచేశారు. కేంద్ర ప్రభుత్వం 2008లో తీసుకువచ్చిన జాతీయ భూమి రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమం, దాని స్థానంలో 2016లో రూపొందించిన డిజిటల్ ఇండియా భూమి రికార్డుల నవీకరణల అంతిమ లక్ష్యం టైటిల్ గ్యారంటీ వ్యవస్థే. టైటిల్ గ్యారంటీ వ్యవస్థ అమలులోకి వస్తే భూమి యాజమాన్య హక్కుకు పూర్తి భద్రత ఉంటుంది. రికార్డుల్లో నమోదుచేసిన వివరాలే అంతిమం. ఒకసారి రికార్డుల్లో నమోదైన వివరాల్లో నిర్ణీత కాలవ్యవధి తరవాత ఎలాంటి మార్పులు చేయడానికీ వీలుండదు. భూమి యాజమాన్య హక్కులు నిరూపించుకోవడానికి టైటిల్ రిజిస్టర్‌లో నమోదుచేసిన వివరాలపైనే ఆధారపడాలి. ఇంతకుముందు ఉన్న రికార్డుల్లోని వివరాలతో సంబంధం ఉండదు. దీనినే కర్టెన్ ప్రిన్సిపుల్ అంటారు. భూమిపైన ఉన్న వాస్తవ వివరాలే రికార్డుల్లో ఉంటాయి. భూమిపై ఉండే లావాదేవీలు వెనువెంటనే రికార్డుల్లో నమోదు అవుతాయి. దీనినే మిర్రర్ ప్రిన్సిపుల్ అంటారు. ఒకవేళ టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేసిన తరవాత కూడా భూమి హక్కుకు భంగం కలిగితే బీమా డబ్బులు అందుతాయి.

హక్కులకు తగినంత రక్షణ

భూమిపై యజమానికి భద్రమైన హక్కు ఉండి రికార్డుల్లో వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించిన నాడే ఆ భూమి నుంచి యజమాని పూర్తి ఫలాలు పొందగలుగుతాడు. అభివృద్ధి సాధ్యపడుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునికీకరణ పథకం, టైటిల్ గ్యారంటీ వ్యవస్థలతోనే అది సఫలమవుతుంది. అందుకు ప్రజల భాగస్వామ్యం, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ తప్పనిసరి. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఎంతైనా అవసరం. భూ రికార్డుల ఆధునికీకరణలో, టైటిల్ గ్యారంటీ వ్యవస్థ రూపకల్పనలో దేశం విజయం సాధిస్తే కోర్టుల్లో కేసుల సంఖ్య, దేశంలో నేరాలు తగ్గుతాయి. రైతులకు రుణాలు, పంటల బీమా, సబ్సిడీలు పొందే అవకాశాలు మెరుగవుతాయి. రైతుల ఆదాయం రెండింతలు కావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మరింత చేరువ అవుతాం. నల్లధనాన్ని, భూమి లావాదేవీలను నియంత్రించవచ్చు. ప్రజల ఇళ్ల స్థలాల అవసరాలు తీర్చడానికి వీలు ఏర్పడుతుంది. భూముల విలువలు పెరుగుతాయి. భూమి హక్కుపై భద్రత పెరుగుతుంది. భూ రికార్డుల ఆధునికీకరణలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ముందుండటం హర్షించదగ్గ విషయం. గుజరాత్ రాష్ట్రం భూముల సర్వేలో, రాజస్థాన్ టైటిల్ గ్యారంటీ చట్టం చేయడంలో దేశానికే ఆదర్శప్రాయంగా ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అమలవుతున్న కార్యక్రమాలను తెలుగు ప్రభుత్వాలు అధ్యయనం చేసి, అనువైన పథకాలను రూపొందించుకొని గట్టిగా అమలు చేయాలి. కోట్ల మంది రైతులకు మేలు చేకూరేది అప్పుడే!

- డాక్టర్ ఎం.సునీల్ కుమార్

(రచయిత- నల్సార్ యూనివర్సిటీలో అనుబంధ ఆచార్యులు, భూ చట్టాల నిపుణులు)

పసినలుసులపై కసి

'పసికందుల్ని ఉన్నపళంగా చిదిమేస్తున్నారు. పుట్టేది ఆడపిల్ల అని ముందే తెలిస్తే, మరీ కర్కశంగా వ్యవహరిస్తున్నారు. కడుపులోని ఆ పిండాన్ని అక్కడికక్కడే కరిగించేస్తున్నారు. అలా భ్రూణ హత్యలు ఇంకా ఎంతకాలం, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి' అని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాల్లో ప్రశ్నించింది. దేశంలో ఆడ శిశువుల సంఖ్య తగ్గిపోతోంది. దానికి కారణం లింగ విచక్షణ! మరికొన్ని సామాజిక కారణాలతోనూ ఎన్నో చిరు ప్రాణాలు తల్లిగర్భంలోనే అంతరిస్తున్నాయని అఖిల భారత వైద్యవిజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్) వివిధ అధ్యయనాల ద్వారా తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కులతో పాటు చెత్తకుప్పలు, మురుగు కాల్వల్లో బయటపడుతున్న మృతపిండాలు గర్భవిచ్ఛిత్తి పర్యవసానాల్ని కళ్లకు కడుతున్నాయి. ఎన్నో ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్న అలాంటి హత్యోదంతాలు మానవతనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రభుత్వాల పని వాటన్నింటినీ చేష్టలుడిగి చూస్తుండటమేనా- అన్నదే న్యాయస్థానాలు, వైద్య పరిశోధన కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల నిలదీతలోని అంతరార్థం. ఆఖరికి 'గర్భస్థ లింగ నిర్ధరణ పరీక్షలకు సంబంధించిన మాయదారి ప్రకటనల నియంత్రణ' లోనూ ప్రభుత్వాలది ఘోర వైఫల్యమే! కమ్ముకున్న ఇన్ని చిమ్మచీకట్ల మధ్య, ఇప్పుడిప్పుడే గోచరిస్తున్న కదలికలు కొత్త ఆశల్ని మొలకెత్తిస్తున్నాయి.

అరక్షిత పద్ధతులతో ముప్పు

దేశంలో ఒక్క ఏడాదిలోనే 1.56 కోట్లకు పైగా గర్భస్రావాలు చోటుచేసుకున్నాయని 'లాన్సెట్ గ్లోబల్ హెల్త్ మెడికల్ జర్నల్' నిర్వహించిన సర్వే నిగ్గుతేల్చింది. భూమిమీదకు రాకుండానే పసి నలుసులు అలా అంతరిస్తుండటానికి మూలమైన వైద్య, సామాజిక అంశాల్ని విశ్లేషించింది. కారణాలేవైనా, ప్రతి ముగ్గురు గర్భవతుల్లోనూ ఒకరికి గర్భవిచ్ఛిత్తి జరుగుతోంది. సురక్షితం కాని పద్ధతుల్ని అనుసరించడం వల్ల దేశంలో అటువంటి పరిస్థితి ఎదురవుతోంది. ఆ కారణంగా ఏటా వేలాది మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. శిశువులకు సంబంధించి, ఆ సంఖ్య ప్రతి సంవత్సరం లక్షలు దాటుతోంది. తల్లి అనారోగ్యానికి గురికావడం, గాయాలు బాధించడం, గర్భాశయ సమస్యలు- ఇలా అబార్షన్లకు ఎన్నో కారణాలుంటాయి. వయసు మీరడంతో కలిగే శారీరక ఇబ్బందులు, ఇన్‌ఫెక్షన్ల వంటివీ అందుకు మూలమవుతాయి. ఎటువంటి స్థితిలో, ఏ విధమైన కారణాలతో గర్భవిచ్ఛిత్తి నిర్వహించవచ్చునేది 46 ఏళ్ల నాటి చట్టంలో స్పష్టంగా ఉంది. సమయ సందర్భాలకు అనుగుణంగా పాటించాలంటూ, విధానాల్ని అందులో పొందుపరచారు. ఆ నిబంధనల ప్రకారం- 20 వారాలు నిండిన పిండాన్ని తొలగించడం చట్టవిరుద్ధం. అలాగే తల్లి జీవితం ప్రమాదంలో పడుతుందనే ఒక్క కారణంతో తప్ప, మరేవిధంగానూ గర్భస్రావాన్ని అనుమతించరు. అయినా, దేశంలో అబార్షన్ల సంఖ్య పెరుగుతుండటమే విషమ సమస్య!

ఇండియాలో గర్భస్రావాలు పలు రెట్లు పెరిగాయి. ఆ వివరాల్ని న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా గల గట్‌మాఛెర్ వైద్య పరిశోధన సంస్థ ఇటీవలి అధ్యయన నివేదిక బయటపెట్టింది. భారత ప్రభుత్వ లెక్కల్లో వార్షిక అబార్షన్ల సంఖ్య ఏడు లక్షలకు మించకున్నా, వాస్తవాలు వేరుగా ఉన్నాయి. గర్భవిచ్ఛిత్తి నిర్వహించే వైద్యశాలల్లో పలుచోట్ల ప్రాథమిక సౌకర్యాలకూ కొరతే! పలువురు వైద్యులకు, సహాయ సిబ్బందికి అర్హత, అనుభవం లోపించిన స్థితి అనూహ్య పరిణామాలకు దారితీస్తోంది. మహిళల్లో ఎటువంటి పరిజ్ఞానం లేకుండా, ఏ విధమైన వైద్య సలహాలూ పాటించకుండా తోచిన రీతిలో గర్భనిరోధక ఔషధాలు, సాధనాలు వాడేవారున్నారు. అందుకే వారితో పాటు,



ఆగాలిక భ్రూణ హత్యలు

లోపలి పసిప్రాణాలకూ ముప్పు కలుగుతోంది. ఆరోగ్య కార్యకర్తలు, నర్సులు, 'ఆయుష్' వైద్యసిబ్బంది సేవలు పూర్తిస్థాయిలో ఉపయోగపడాలి. సమస్యను అరికట్టే చర్యల్లో భాగంగానే, ఇకముందు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే పేద మహిళలకు సమగ్ర పద్ధతిలో గర్భస్థ శిశు పరీక్షలు నిర్వహిస్తారు. అందుకోసం వైద్యులకు పూర్తిస్థాయి శిక్షణనివ్వాలని తెలంగాణలో సరికొత్తగా నిర్ణయించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ సంబంధిత వైద్య పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటారు. అంటే, గర్భస్థ దశలోనే పిండం ఎదుగుదలను పరీక్షించేలా వైద్య వసతులు సమకూరుస్తారు. తల్లి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడే గమనించి, ముందు జాగ్రత్తలు చేపడతారు. దీనివల్ల ప్రభుత్వ వైద్యశాలల సేవల్ని వినియోగించుకొనే గర్భిణులకు మేలు కలిగించినట్లవుతుంది. పలు ప్రైవేటు కేంద్రాల్లో కొనసాగుతున్న లింగ నిర్ధరణ పరీక్షల అక్రమాల్ని అడ్డుకున్నట్లూ అవుతుంది. గప్‌చుప్‌గా సాగే 'ప్రైవేట్ స్కానింగ్' వ్యవహారాల నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమూ నడుంకట్టింది. అక్రమాలకు పాల్పడే ఆయా కేంద్రాలకు, ప్రయోగశాలలకు విధించే జరిమానాల మొత్తాల్ని పెంచుతూ ఇప్పటికే నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వైద్యశాలల, అనుబంధ విభాగాల రిజిస్ట్రేషన్లను శాశ్వతంగా రద్దుచేస్తామనీ హెచ్చరించింది. వైద్యపరంగా అవసరం లేకపోయినా, సంబంధిత నిపుణులు సూచించకున్నా- పరీక్షలు జరిపి అందిన కాడికి దండుకొనే కేంద్రాల ఆటలు కట్టిస్తామని ఏపీ ప్రభుత్వం ఇదివరకే ప్రకటనలిచ్చింది. ఇవన్నీ నియంత్రణ చర్యలే అయినా, వీటన్నింటికీ మించి ఉభయ తెలుగు రాష్ట్రాలూ దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రధానాంశం మరొకటి ఉంది. అది- గర్భవిచ్ఛిత్తి ఔషధ మాయల గుట్టును రట్టు చేయడం!

అక్రమాల పనిపట్టాలి

అది అవాంఛనీయమైతేనో, పొట్టలోని శిశువుకు ఇబ్బందికర పరిస్థితి ఉంటేనో గర్భస్రావాన్ని అనుమతిస్తారు. అంతే తప్ప, లోపలి శిశువు 'ఆడ' అని తెలియగానే గర్భవిచ్ఛిత్తికి ఎక్కడా అనుమతించరు. పలు నిర్ధారణ/పరీక్ష కేంద్రాల తీరుతెన్నులపై ప్రభుత్వాలకు ఎటువంటి నియంత్రణా లేకపోవడం వల్లనే, విచ్ఛిన్నకర పోకడలు ప్రబలుతున్నాయి. ఆయా కేంద్రాల్లో సంబంధిత ఔషధాల అక్రమ విక్రయాలు సాగిపోతున్నా, నిలువరించేవారు కరవవుతున్నారు. స్కానింగ్ ద్వారా లింగ నిర్ధారణ చేస్తే, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారని చట్టంలో ఉన్నా, శిక్ష పడిన అటువంటి సందర్భాల్ని రెండు రాష్ట్రాల్లోనూ వేళ్ల మీద లెక్కించవచ్చు. అక్రమాలకు పాల్పడిన కేంద్రాల్లో అధికార బృందాలు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు, మెరుపు దాడులు అతి తక్కువ. కాసుల కక్కుర్తితో కొంతమంది వైద్యులు గర్భవిచ్ఛిత్తి చికిత్సలు కొనసాగిస్తున్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయ సహకారాలతో, అటువంటి అక్రమార్కుల ఆటలు కట్టించాలి. ముఖ్యంగా వైద్య-ఆరోగ్య, శిశు సంక్షేమ, పోలీసు శాఖలు ఏం చేస్తున్నాయన్న సమీక్ష విస్తృతస్థాయిలో సాగాలి. యుద్ధప్రాతిపదికన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుడితేనే- పసి నలుసుల ప్రాణాలు నిలబడతాయి. ఒక్క ఏడాదిలో 350 వరకు అబార్షన్లకు పాల్పడినట్లు నిరుడు తనంత తానుగా పోలీసుల ఎదుట అంగీకరించాడో వైద్యప్రబుద్ధుడు! లింగ నిర్ధారణ 'కిట్'ల విక్రయాలు ఏపీ, తెలంగాణతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. ఆ వ్యవహారాలపై ఆయా ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. 'పుట్టే ప్రతి బిడ్డకూ బతికే హక్కు' ఉంది. దాని పరిరక్షణ బాధ్యత ముమ్మాటికీ ప్రభుత్వాలదే!

- శరత్

జ్ఞాన పథం

మానవుడు రాయిని చెక్కి, దాన్ని అందమైన శిల్పంగా మారుస్తాడు. సరిగమల్ని కూర్చి వినసొంపైన రాగం ఆలపిస్తాడు. రంగుల్ని కళ్లకు ఇంపుగా రంగరించి, సుందర చిత్రాన్ని ఆవిష్కరిస్తాడు. అబ్బురపరచేలా పూలతోటను తీర్చిదిద్దుతాడు. ప్రకృతిలోని అణువణువునూ నేత్రపర్వంగా మలచాలని ఆరాటపడతాడు.

ప్రకృతి అంటే చెట్టుచేమలు, జీవ జంతుజాలం అనుకుంటాడు మనిషి. తానూ ప్రకృతిలో ఓ భాగం అనుకోడు. తనను తాను తీర్చిదిద్దుకోవడం, ఉన్నత వ్యక్తిత్వంతో వెలిగిపోవడం మనిషితనానికి ముఖ్యం. వేద, పురాణ, ఇతిహాసాలు ఎన్నో ఏళ్ల కిందట అతడి వ్యక్తిత్వానికి నగిషీలు చెక్కాయి. మానవుడు వాటిలోని సారం గ్రహించి, ఆచరణీయం చేసుకుంటే విజయావకాశాలు మెరుగుపడతాయి.

శ్రీరాముడు సకల సుగుణాభిరాముడు. మహోన్నతమైన సుగుణాలు ఆరు. మనిషికి గుర్తింపు ఇచ్చేది జ్ఞానం. అదే తేజస్సు. నిరంతరం జ్ఞాన సముపార్జన కోసం అతడు తపించిపోవాలి. ఆలోచనలకు రూపమివ్వాలి. పరాక్రమం లేకపోతే మనిషి మనలేడు. దానవుల దుర్మార్గాన్ని విష్ణుమూర్తి అవతార పరాక్రమం దునుమాడింది. మానసిక, శారీరక బలాలతో కూడిన ఆత్మబలం ప్రతి వ్యక్తికీ ఉండి తీరాలి. మనిషికి ఆత్మబలం వల్ల తన మీద తనకు నమ్మకం కలుగుతుంది. కొండను పిండి చేయాలన్నా, ఎత్తైన కొండను ఎక్కి ఆకాశాన్ని చుంబించాలన్నా, అనితర సాధ్యాలు తన పేరిట నమోదు చేసుకోవాలనుకున్నా ఆత్మబలమే ప్రధానం.

ఏ అంశమైనా, మానవుడు అందులో రాణించాలంటే తగిన సామర్థ్యం ఉండాలి. నిరంతర సాధన, అభ్యాసంతోనే అది సాధ్యమవుతుంది. మనిషికి కొన్ని కారణాల వల్ల కోపం రావడం సహజం. అది తాటాకు మంటలా చప్పున చల్లారిపోవాలి. మితిమీరకూడదు. సహనం అతడికి ఆభరణం. సహనశీలిని లోకం ప్రత్యేకంగా చూస్తుంది. కలిసి నడుద్దాం, మాట్లాడదాం; చక్కటి మార్గంలో ప్రయాణిద్దాం, నలుగురితో పాటు మనుగడ సాగిద్దామని రుగ్వేదం బోధిస్తుంది. దోషం లేని కర్మ ఆచరణీయమని యజుర్వేదం తెలియజేస్తుంది. ఈర్ష్యగలవాడు మరణించినవాడితో సమానం- అంటుంది అథర్వణ వేదం. అసూయ, ద్వేషం విడనాడిన మనిషి సాక్షాత్తు దైవ సమానుడే అంటాయి శాస్త్రాలు. ప్రతి మనిషీ కృతజ్ఞత



కలిగి ఉండాలి. ఇతరులు తనకు చేసిన మేలును మరవకపోవడం కృతజ్ఞత. జీవితంలో ఎంతోమంది తారసపడతారు. ఎన్నో సహాయాలు చేస్తారు. వారిని గుర్తుంచుకోవడమే కాదు, అవసరం కలిగినప్పుడు సహాయం చేయడంలోనూ మానవుడు ముందుండాలి.

కృతజ్ఞతను ధర్మశాస్త్రాలు యజ్ఞ సమానంగా

అంతర్యామి

భావిస్తాయి ఇది అయిదు విధాలు. జన్మనిచ్చి, ఉదర పోషణార్థం అనేక వనరులు ప్రసాదించిన భగవంతుడి పట్ల కనబరచే మొదటి కృతజ్ఞత దేవయజ్ఞం. కని, పెంచిన తల్లిదండ్రులిద్దరిపట్ల చూపించే కృతజ్ఞత పితృయజ్ఞం. మానవ మనుగడకు అవసరమైన వాటిని వేద పురాణేతిహాసాల ద్వారా అందించారు రుషులు. సత్యం, ధర్మం, న్యాయం వంటి కట్టుబాట్లతో ఒక చక్కటి వ్యవస్థ ఏర్పడటానికి రుషులే కారణం. ఆ కృతజ్ఞతే రుషియజ్ఞం. సాటివారి పట్ల మానవతా దృక్పథంతో మెలగడం, సహాయ సహకారాలు అందించడం మనుష్య యజ్ఞం కిందకు వస్తాయి. ప్రకృతిలోని సమస్త జీవరాశినీ కనిపెట్టుకుని ఉండి, ప్రేమభావంతో ఆదరించే కృతజ్ఞతను భూతయజ్ఞంగా చెబుతారు.

మానవీయ విలువలకు పట్టం కడుతూ; పురాణ వాఙ్మయం, ఆచారాలు, కట్టుబాటు వ్యవహారాలతో మన పూర్వీకులు జ్ఞానపథం చూపించారు. దాన్ని అనుసరిస్తే, మానవుడికి గమ్యం స్పష్టంగా గోచరిస్తుంది!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఎస్ఎస్ఎల్వీలకు ఇస్రో పెద్దపీట

ఈనాడు, బెంగళూరు: చిన్న ఉపగ్రహ వాహకనౌక (ఎస్ఎస్ఎల్వీ)ల తయారీపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దృష్టి పెట్టింది. ఇక స్థిర కక్ష్యలో భారీ ఉపగ్రహాల ప్రయోగానికి జీఎస్ఎల్వీ, ధ్రువ కక్ష్యలోకి ఉపగ్రహాల ప్రయోగానికి పీఎస్ఎల్వీలను ఇస్రో ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. మూడు నాలుగేళ్లుగా చిరు, సూక్ష్మ ఉపగ్రహాల ప్రయోగాలు అధికమయ్యాయి. భూమికి 2 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్య (లియో)లో ప్రవేశ పెట్టే ఈ ఉపగ్రహాలకూ ఇప్పటివరకూ పీఎస్ఎల్వీ రాకెట్లనే వినియోగిస్తున్నారు. లియో ప్రయోగానికి పీఎస్ఎల్వీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ఎస్ఎస్ఎల్వీ రాకెట్లు సరిపోతాయి. ఈ రాకెట్లతో చిరు ఉపగ్రహాల ప్రయోగ వ్యయం తగ్గనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఎల్వీల తయారీపై దృష్టి పెట్టినట్లు ఇస్రో అధికారులు గురువారం బెంగళూరులో వెల్లడించారు. పీఎస్ఎల్వీ పొడవు 44 మీటర్లు, బరువు 350 టన్నుల వరకూ ఉంటుండగా. . ప్రతిపాదిత ఎస్ఎస్ఎల్వీ బరువు వంద టన్నులు, ఎత్తు 25 మీటర్ల వరకూ ఉంటుందని అధికారులు చెప్పారు. అన్నీ సవ్యంగా జరిగితే వచ్చే ఏడాదే ఎస్ఎస్ఎల్వీ నింగిలోకి దూసుకు పోతుందని తెలిపారు.

సమీకరణ కష్టమే... సేకరణే మార్గం

- వ్యయ భారం తగ్గించే ప్రత్యామ్నాయాలపై దృష్టి
- అమరావతి ఎక్స్‌ప్రెస్ రహదారిపై సర్కార్ కసరత్తు

ఈనాడు – అమరావతి

రాయలసీమను రాజధానితో అనుసంధానం చేసే ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణంలో కీలకమైన భూసేకరణపై సర్కారు ముందుకు వెళ్లింది. భూసేకరణకే సుమారు రూ.2,600 కోట్లు వ్యయం కానుంది. ఈ మొత్తాన్ని భరించాలని కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖను కోరితే సానుకూల స్పందన రాలేదు. ఈ క్రమంలో భూసేకరణ చేసి కేంద్ర జాతీయ రహదారుల సంస్థకు అప్పగించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో భూసమీకరణ సాధ్యం కాదని అధికార వర్గాలు ఇప్పటికే తేల్చి చెప్పాయి.

వ్యయం తగ్గించడం ఎలా?: ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణాన్ని కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ చేపడుతుంది. అయితే భూసేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని తేల్చింది. భారత్‌మాల (గ్రీన్ ఛాలెంజ్)లో భాగంగా తీసుకొంటామని స్పష్టం చేసినట్లు అధికార వర్గాల సమాచారం. ఈ క్రమంలో రూ.2,600 కోట్ల మేర అయ్యే వ్యయాన్ని ఏ మేరకు తగ్గించవచ్చనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. అనంతపురం నుంచి వచ్చే మార్గానికి కర్నూలు వైపు నుంచి ఓ రోడ్డు, కడప నుంచి మరో రోడ్డు కలుస్తుంది. ఇందులో కడప - కర్నూలు మధ్య ఉన్న జాతీయ రహదారి - 40ని ఈ ప్రాజెక్టుకు అనుసంధానించడంపై చర్చించారు. ఇప్పటికే ఈ మార్గం నాలుగు వరుసలతో ఉంది. ఈ మార్గాన్నే ఎక్స్‌ప్రెస్ మార్గంగా అభివృద్ధి చేసుకొంటే ఏ మేరకు భూసేకరణ తగ్గుతుందనే అంశంపై ఆర్ అండ్ బీ శాఖ కసరత్తు చేస్తోంది. కర్నూలు వైపు కూడా ఏ మేరకు వ్యయం తగ్గించవచ్చు? ప్రత్యామ్నాయాలు ఏమిటి? అనే అంశాలపై దృష్టి సారించారు.

అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో సమీకరణకు రైతులు మొగ్గు చూపరని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ మార్గం వెంబడి టౌన్‌షిప్‌లు, పారిశ్రామికవాడలు అభివృద్ధి చేయగలిగితే భూముల విలువను పెంచవచ్చని సూచనలు వచ్చాయి. గుంటూరు జిల్లా పరిధిలో భూముల విలువ కూడా ఎక్కువ ఉండటం, రాజధానికి చేరువకావడం, బాహ్యవలయ రహదారితో అనుసంధానమైన క్రమంలో సమీకరణ సాధ్యమేనని అధికారులు చెబుతున్నారు. ఈ జిల్లా పరిధిలో 91 కి.మీ. రోడ్డు ఉంటుంది. 1,844 హెక్టార్లు అవసరం.

200మీటర్ల వెడల్పుతో ప్రణాళిక: అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లో భూసేకరణకు సంబంధించి 100 శాతం పెగ్ మార్కింగ్‌ను పూర్తి చేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌ప్రెస్ మార్గాన్ని 200 మీటర్ల వెడల్పుతో ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. నాలుగు, ఆరు వరుసలతో ఈ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు వెంబడి రైల్వే ట్రాక్, తరలింపు అవసరాలకు తగిన విధంగా ఈ ప్రణాళిక ఉంటుంది. ఇటీవల ముఖ్యమంత్రి దగ్గర జరిగిన చర్చల్లో ఏర్పేడు - వెంకటాచలం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్ 564ను కూడా అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు అనుసంధానించే అవకాశం ఉందా? అనే అంశంపైనా చర్చించారు.

అక్రమ లేఅవుట్లపై విజిలెన్స్ విచారణ

పెడన, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెడన పురపాలికలో అక్రమ లేఅవుట్ల వ్యవహారానికి సంబంధించి ఇద్దరు కమిషనర్లతోపాటు నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2012 నుంచి ఏర్పాటుచేసిన 12 లేఅవుట్లకు అనుమతులు లేవని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో దాదాపు రూ.2కోట్ల ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న అప్పటి కమిషనర్లు బీహెచ్ సంగీతరావు, మస్నం గోపాలరావులతోపాటు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు గల్లా గోవింద కుమారి, పడమట వెంకటేశ్వరరావు, కె.హరిప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ఎ.వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సంగీతరావు ప్రస్తుతం తాడేపల్లిగూడెం ఉపకమిషనర్‌గా, గోపాలరావు గుడివాడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఐఐటీ ప్రాంగణ నియామకాల్లో హెచ్చుతగ్గులు

ఈనాడు, దిల్లీ: ఐఐటీ ప్రాంగణ నియామకాల్లో హెచ్చుతగ్గులున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ తెలిపారు. గురువారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు సీఎం రమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఐఐటీల్లో 2014-15లో 72.82% ఉన్న నియామకాలు 2015-16లో 75.79%కి పెరిగాయని చెప్పారు. 2016-17లో 70.85%కి తగ్గినట్లు వివరించారు. ఇందుకు ఎన్నో కారణాలున్నట్లు చెప్పారు. మార్కెట్ పరిస్థితులు, విద్యార్థులు ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం, స్టార్టప్స్, పరిశ్రమల వైపు మళ్లడం లాంటి కారణాలు ప్రాంగణ నియామకాలపై ప్రభావం చూపుతున్నట్లు వివరించారు.

పౌరుల జాతీయ పట్టికపై ఆందోళనలు అనవసరం: రాజ్‌నాథ్

దిల్లీ: పౌరుల జాతీయ పట్టిక (ఎన్‌సీఆర్)లో ఎవరి పేర్లయినా చోటు చేసుకోకపోతే వారు ప్రత్యేక ధర్మాసనాన్ని (ట్రైబ్యునల్‌ను) ఆశ్రయించవచ్చునీ, కొందరి పేర్లను ఉద్దేశపూర్వకంగా దీనిలో నమోదు కాకుండా చూస్తున్నామనే ఆరోపణలు నిరాధారమైనవని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అసోంలో బెంగాలీ మాట్లాడే ప్రజల్ని ఈ పట్టిక నుంచి తొలగించేందుకు కుట్ర జరుగుతోందని గురువారం లోక్‌సభ శూన్యగంటలో విపక్ష సభ్యులు చేసిన ఆరోపణల్ని ఆయన తోసిపుచ్చారు. అసోంలోని 3.29 కోట్ల జనాభాలో 1.3 కోట్ల మంది పేర్లు ముసాయిదా జాబితాలో లేవని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, వామపక్ష సభ్యులూ వారికి బాసటగా నిలిచారు. ఎన్‌సీఆర్ రూపకల్పన పని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోందనీ, అందువల్ల ఎవరూ ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదనీ హోంమంత్రి చెప్పారు.

ఈసారి పులివెందులలో తెదేపాదే విజయం: దేవినేని

విజయవాడ, న్యూస్‌టుడే: పులివెందుల నియోజకవర్గానికి కాంగ్రెస్ హయాంలో నీళ్లు తెచ్చుకోలేక పోగా, నేడు తెదేపా పాలనలో నీరందిస్తే హేళనగా మాట్లాడడం జగన్‌మోహన్‌రెడ్డికి తగదని జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పులివెందులలోనూ తెదేపా గెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవసాయ సీజనులో రాయలసీమకు 123 టీఎంసీల నీరు ఇచ్చినట్లు తెలిపారు. లాకుల గేట్లు ఎత్తే కళాసీలు నీటిపారుదల రంగంలో దేవుళ్లు వంటి వారని మంత్రి అభివర్ణించారు.

పాక్‌పై నిర్దిష్ట చర్యల్ని ప్రకటించనున్న అమెరికా

వాషింగ్టన్: ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న విషయంలో కొరడా ఝళిపించాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్న పాకిస్థాన్‌పై నిర్దిష్ట చర్యల్ని అమెరికా ఒకటిరెండ్రోజుల్లోనే ప్రకటించే అవకాశాలున్నాయి. పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేసి, తీసుకున్న కఠిన వైఖరికి అనుగుణంగా ఈ వారంలోనే నిర్ణయం వెలువడుతుందని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. గురువారమే ఈ నిర్ణయం రావచ్చని తొలుత భావించినా అలాంటిదేమీ జరగలేదు.

రజత్ భార్గవ బదిలీ

ఈనాడు, అమరావతి: దిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రత్యేక కమిషనర్ రజత్ భార్గవను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. తదుపరి పోస్టింగు కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఆయనకు సూచించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం

- అమరావతికి విచ్చేస్తున్న 22 దేశాల ప్రతినిధులు
- దేశం నలుమూలల నుంచి మరో 2 లక్షల మంది వస్తారని అంచనా
- ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రికి ఆహ్వానాలు

మంగళగిరి – న్యూస్‌టుడే



అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ ముఖద్వారం

రాజధాని అమరావతిలో లోకకల్యాణార్థం అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి, దేశప్రజల సంక్షేమం, శాంతి చేకూరాలని కాంక్షిస్తూ అఖిల విశ్వ గాయత్రీ పరివార్ దక్షిణ భారత విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉత్తరాఖండ్ గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్ పర్యవేక్షణలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ఆవరణలో నాలుగు రోజుల పాటు జరిగే మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 22 దేశాల నుంచి 2వేల మంది ప్రతినిధులు, దేశం నలుమూలల నుంచి 2 లక్షల మంది హాజరవుతారని అంచనాతో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 501 హోమగుండాలు నిర్మించారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో దేశ నలుమూల నుంచి వచ్చే వారి కోసం వసతి, భోజనం, అల్పాహారం ఏర్పాట్లు చేశారు. అఖిల విశ్వగాయత్రీ పరివార్, దక్షిణభారత విభాగం, గాయత్రీ పరివార్ మంగళగిరిశాఖ పర్యవేక్షణలో జరిగే మహాయజ్ఞంలో పాల్గొనేందుకు వేల మంది స్వచ్ఛంద సేవకులు తరలివచ్చారు. 2001లో తిరుపతిలో ఈ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞంలో పాల్గొనాలని కోరుతూ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవాదాయ శాఖ మంత్రి పి.మాణిక్యాలరావును ఆహ్వానించామని నిర్వాహకులు తెలిపారు.

సామాజిక మాధ్యమాల్లో పోలీసు అంతర్గత అంశాలపై చర్చ తగదు

ఎస్పీలు, కమిషనర్లకు డీజీపీ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల వేదికగా పోలీసు శాఖకు సంబంధించిన అంతర్గత పరిపాలన అంశాలపైన చర్చిస్తే సహించేది లేదని డీజీపీ డా.ఎం.మాలకొండయ్య హెచ్చరించారు. "కొన్ని జిల్లాల పోలీసు అసోసియేషన్ల ప్రతినిధులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో మీడియా ప్రతినిధులు, ఇతర వ్యక్తులను సభ్యులుగా చేర్చుకున్నారు. వాటిల్లో పోలీసు శాఖకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలు, విధాన నిర్ణయాలు, పరిపాలన ఆదేశాలు తదితర అంతర్గత అంశాలపై చర్చిస్తున్నారు. ఈ విషయం నా దృష్టికి వచ్చింది. అలాంటి గ్రూపులన్నింటినీ తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలి" అని రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు తాజాగా జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. డీజీపీల వార్షిక సదస్సుకు రాష్ట్ర డీజీపీ ఎం.మాలకొండయ్య, సీఐడీ విభాగాధిపతి సీహెచ్ ద్వారకాతిరుమలరావు హాజరుకానున్నారు. మధ్యప్రదేశ్ టేకన్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ అకాడమీలో ఈ నెల 6 నుంచి 8 వరకూ ఈ సదస్సు జరగనుంది.

11 మంది డీఎస్పీల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 11 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఎం.మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరంతా ప్రస్తుతం పోస్టింగుల కోసం నిరీక్షిస్తున్న వారే. టి.మోహన్‌రావును విజయనగరం ఏపీఎస్పీ పటాలం అసిస్టెంట్ కమాండెంట్‌గా, విమలకుమారిని చిత్తూరులోని శ్రీసిటీ డీఎస్పీగా బదిలీ చేశారు. ఎస్.వెంకటరావు, జి.ఉదయ్‌కుమార్, షేక్ ముకుబుల్, లాల్‌అహ్మద్ షేక్‌లను విజయవాడ నగర కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో ఏసీపీలుగా నియమించారు. పి.ఉమాపతివర్మ, కె.వి.ఎన్.వి.ప్రసాద్‌లను నిఘా విభాగానికి బదిలీ చేశారు. ఈ.శ్రీనివాసులును అనంతపురం సీసీఎస్ డీఎస్పీగా, ఎస్.విజయభాస్కర్‌ను గుంటూరు గ్రామీణ ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా, టి.కృష్ణను ఎస్పీఎఫ్ డీఎస్పీగా బదిలీ చేశారు.

ఆర్కేనగర్‌లో ఓటుకు నోటుతోనే విజయం

టీటీవీపై కమల్‌హాసన్ ఆరోపణ

ఈనాడు డిజిటల్, చెన్నై: ఆర్కేనగర్ ఉప ఎన్నికలో ఓటుకు నోటుతోనే టీటీవీ దినకరన్ విజయం సాధించారని విశ్వనటుడు కమల్‌హాసన్ ఆరోపించారు. గురువారం ఆయన చెన్నైలో విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 21న జరిగిన ఈ ఎన్నికలో అధికార అన్నాడీఎంకేతో పాటు గెలుపొందిన టీటీవీ దినకరన్ వర్గాలు విచ్చలవిడిగా ఓటర్లకు నగదు పంపిణీ చేశాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి ఆయన విజయం ఒక మచ్చని అభిప్రాయపడ్డారు. కమల్‌హాసన్ వ్యాఖ్యలను దినకరన్ ఖండించారు. ఆర్కేనగర్ ప్రజలను కమల్ అవమానించారని పేర్కొన్నారు.

తిరుపతిలో 'స్మార్ట్ రైల్వేస్టేషన్'

- రూ.400 కోట్లతో ఆధునికీకరణ
- చైనా తరహాలో ప్లాట్‌ఫారాలు

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి రైల్వేస్టేషన్‌ను రూ.400 కోట్లతో స్మార్ట్ రైల్వేస్టేషన్‌గా ఆధునికీకరించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు వినోద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. వివిధ సంస్థలు, ప్రభుత్వశాఖల అధికారులు, నాయకులతో గురువారమిక్కడ ఆయన రైల్వే ప్రణాళికలపై చర్చించారు. చైనా వంటి దేశాల తరహాలో రైల్వేస్టేషన్‌లో రైళ్లు బయటకు కనిపించకుండా అండర్‌గ్రౌండ్‌లో ప్లాట్‌ఫాం నిర్మిస్తామని, మొదటి అంతస్తులో ప్రయాణికుల విశ్రాంతికి ఏర్పాట్లు ఉంటాయని ఈ సందర్భంగా తెలిపారు. రైలు వచ్చే సమయానికి ప్రయాణికులు కింది భాగంలోకి వచ్చేలా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని చెప్పారు. విమానాశ్రయం తరహాలో బాహ్య, అంతర్గత మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నామని తెలిపారు. స్టేషన్‌కు దక్షిణం వైపున 8 అంతస్తుల భవనం నిర్మిస్తున్నామని, గ్రౌండ్, మొదటి అంతస్తులను రైల్వే అవసరాలకు వినియోగించుకుని మిగిలిన అంతస్తులను వివిధ వ్యాపార, వాణిజ్య అవసరాలకు కేటాయించనున్నట్లు వివరించారు. స్టేషన్ ముందుభాగంలో వాటర్ ఫౌంటెయిన్లు, రూఫింగ్, గార్డెన్స్ తదితర సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తిరుపతి నగరపాలకకమిషనరు హరికిరణ్ పాల్గొన్నారు.

నీ విముక్తి సంతోషకరం

రాజాకు మన్మోహన్ లేఖ

చెన్నై: 2జీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే నాయకుడు ఎ.రాజా విముక్తి పొందడం.. ఆయన వైఖరికి దక్కిన సమర్థన అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. ఇది తనకు సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ మేరకు ఆయన రాజాకు రాసిన లేఖను.. డీఎంకే గురువారం మీడియాకు విడుదల చేసింది. ఈ కేసు వల్ల రాజా, ఆయన కుటుంబ సభ్యులు చాలా ఇబ్బందులు పడ్డారని మన్మోహన్ పేర్కొన్నారు. నిజం నిరూపితమవడంతో వారంతా ఊరట చెందారని తెలిపారు. అంతకుముందు మన్మోహన్‌కు రాజా లేఖ రాస్తూ తనను పూర్తిగా విశ్వసించినట్టు కనిపించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం వాస్తవమేమిటో తేలినందున తనకు మద్దతు తెలుపుతారని ఆశిస్తున్నట్టు తెలిపారు. గతంలో పలు పరిమితుల కారణంగా మద్దతు ఇవ్వలేదని పేర్కొన్నారు. కోర్టు విచారణ కారణంగా మన్మోహన్‌కు వ్యక్తిగతంగా ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు.

ఒకేరోజు 200 మందిని తొలగించారు!

పోలీసులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఫిర్యాదు

మాదాపూర్, న్యూస్‌టుడే: ఒకేరోజుదాదాపు 200 మందిని ఉద్యోగాలనుంచి తొలగించారని, తమతో బలవంతంగా రాజీనామా చేయించారని పలువురు గురువారం మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. సదరు ఐటీ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మాదాపూర్ ఐటీ కారిడార్‌లో ఉన్న వెరిజాన్ డేటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (వీడీఎస్ఐ)లో గతనెల 12న పలువురు ఉద్యోగులతో రాజీనామా చేయించారు. చాలా కాలంగా కంపెనీలో పనిచేస్తున్న తమను హెచ్‌ఆర్ మేనేజర్ గదికిపిలిపించి రాజీనామా పత్రాలపై సంతకాలు చేయాల్సిందిగా ఒత్తిడిచేసినట్లు ఎ.రాహుల్, రఘురాంలు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజీనామాకు నిరాకరించగా గదిలోపలు వురు బౌన్సర్లను కాపలాఉంచి శారీరకంగా,మానసికంగా తమపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఈ వ్యవహారంపై విచారణ చేయనున్నట్లు చెప్పారు.

మమత బెనర్జీపై అసోంలో ఎఫ్ఐఆర్

గువాహటి: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీపై అసోంలో ఎఫ్ఐఆర్ (ప్రాథమిక దర్యాప్తు నివేదిక) నమోదయ్యింది. అక్రమ వలసదారులను గుర్తించేందుకు అసోంలో సుప్రీం కోర్టు పర్యవేక్షణలో జాతీయ పౌర నమోదు (ఎన్ఆర్‌సీ) నవీకరణను చేపట్టారు. అయితే ఎన్ఆర్‌సీతో అసోం నుంచి 1.8కోట్ల బెంగాలీలను బయటకు పంపేందుకు భాజపా ప్రభుత్వం కుట్ర పన్నుతోందంటూ మమత ఆరోపించారు. మమత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అసోంవ్యాప్తంగా పలు సంఘాలు నిరసనలు చేపట్టాయి. మమత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని.. సుప్రీం కోర్టును ధిక్కరించారని ఆరోపిస్తూ కొందరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.



ప్రజలతో కలిసి పాదయాత్ర చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి

కుప్పంను మెరుగ్గా అభివృద్ధి చేస్తా

- వైకాపా అధ్యక్షుడు జగన్

సదుం, న్యూస్‌టుడే: రానున్న ఎన్నికల్లో కుప్పంలో వైకాపా అభ్యర్థిని గెలిపిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తానని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా సదుం మండలంలో పర్యటించారు. పాలమంద పంచాయతీ పెద్దూరులో కాసేపు ఆగారు. కుప్పం నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త చంద్రమౌళి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు 270 వాహనాల్లో వచ్చి పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ మాట్లాడారు. వైకాపా గెలుపు కుప్పం నియోజకవర్గం నుంచే మొదలు కావాలన్నారు. బీసీలను సులభంగా మోసం చేయవచ్చనే దురుద్దేశంతోనే చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారన్నారు. అక్కడ బీసీలకు ఆయన చేసిందేమీ లేదని ఆరోపించారు. వైకాపా ప్రకటించిన నవరత్నాలుతో పేదలు, బీసీలకు మేలు జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా వైకాపా అభ్యర్థి చంద్రమౌళిని గెలిపిస్తే ఆ ప్రాంతాన్ని చంద్రబాబు కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తానన్నారు. పాదయాత్ర ముగిశాక చేపట్టే బస్సు యాత్రలో కుప్పం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ పర్యటిస్తానన్నారు. పాదయాత్రలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసిన మంత్రి సునీత

విజయవాడ, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. లూయీ బ్రెయిలీ జయంతి సందర్భంగా విజయవాడ గవర్నర్‌పేట ఎం.బి.భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి సునీత మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసేవారికి ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు అందజేస్తోందని.. ఇక ముందు డిగ్రీ విద్యార్థులకు కూడా ఇప్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500 ఉన్న పింఛను రూ.1500 చేశారని గుర్తుచేశారు. 26 మంది ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటారు వాహనాలు ఇవ్వాలని కోరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. సంక్షేమ శాఖ కమిషనర్, ఎండీ కర్రి రాజభౌమ హరి నారాయణ చక్రవర్తి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.రవీంద్రబాబు, కార్యదర్శి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న మంత్రి సునీత

జాతీయ సంస్థకు స్థలమేదీ?

- అఖిల భారత ఆయుర్వేద వైద్య సంస్థ ఏర్పాటుకు అవరోధాలు
- కేంద్రం సిద్ధంగా ఉన్నా స్పందించని యంత్రాంగం

ఈనాడు, అమరావతి: ఎయిమ్స్ తరహాలో అఖిల భారత ఆయుర్వేద వైద్య సంస్థను ఇక్కడ ఏర్పాటుచేయాలని కేంద్రం తలపోస్తున్నప్పటికీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. స్థలం కేటాయిస్తే పనులను ప్రారంభిస్తామని చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం లేదని దిల్లీలోని కేంద్ర వర్గాలు తెలిపాయి. జాప్యం కొనసాగితే సంస్థను మరో రాష్ట్రంలో ప్రారంభించేందుకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నాయి. కృష్ణా జిల్లా కొండపావులూరులో సెంట్రల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి, విశాఖ జిల్లా సబ్బవరంలో అఖిలభారత యోగా అండ్ నేచురోపతి సంస్థల ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉంది. స్థలాలు కేటాయించనందున జాప్యం కొనసాగుతోంది.

అఖిల భారత ఆయుర్వేద వైద్య సంస్థను తొలుత విశాఖలో ఏర్పాటుచేయాలని కేంద్రం భావించింది. అక్కడ స్థలం లేదని, అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనిపైనా కేంద్రం సుముఖంగానే ఉన్నప్పటికీ స్థలం సమస్య కొనసాగుతూనే ఉంది. సంస్థ ఏర్పాటుకు కనీసం 30 ఎకరాల నుంచి 50 ఎకరాలను రాష్ట్రం కేంద్రానికి అప్పగించాల్సి ఉంది. ఇక్కడ కేటాయించిన 25 ఎకరాల స్థలంపై పూర్తి సమాచారం కేంద్రానికి వెళ్లలేదు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది ఆమోదం లభించనందున తదుపరి చర్యలు లేవు. మరోవైపు అంత స్థలం ఎందుకంటూ కొన్ని శాఖలు కొర్రీలు వేస్తున్నట్లు సమాచారం.

రూ.వంద కోట్ల సంస్థ: అఖిలభారత ఆయుర్వేద వైద్య సంస్థను దిల్లీలో రూ.157కోట్ల వ్యయంతో ఏర్పాటుచేశారు. అమరావతి ప్రాంతంలో ఇలాంటిదే మరో సంస్థ ఏర్పాటుకు కనీసం రూ.వంద కోట్లు వెచ్చించనున్నారు. సంస్థ ఏర్పాటైతే రాష్ట్రంలో ఆయుర్వేద వైద్య సేవలు మెరుగుపడతాయి. పరిశోధనలు విస్తృతమవుతాయి. వైద్యసీట్లూ పెరుగుతాయి. వ్యాధులకు సంబంధించి సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయి.

విశాఖలో మరో సంస్థ: అఖిలభారత యోగా అండ్ నేచురోపతి సంస్థను విశాఖలో ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సంస్థ ఏర్పాటుకు 25 ఎకరాలు అవసరమని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సబ్బవరం వద్ద స్థలాన్ని కేటాయించేందుకు అక్కడి యంత్రాంగం సిద్ధమైంది. అధికారిక సమాచారం కేంద్రానికి చేరితే తదుపరి చర్యలు ప్రారంభమవుతాయి.

సెలవులు...అసంతృప్తులు

దేవాదాయశాఖలో బదిలీలలు

ఈనాడు–అమరావతి: దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆరేడు సంవత్సరాలకు పైగా ఒకే స్థానంలో ఉన్న వారిని ఇటీవల బదిలీ చేయగా సెలవులు... అసంతృప్తులు రాజ్యమేలుతున్నాయి. తాము ఆ స్థానాల్లో పని చేయబోమంటూ, ఆ సీటుకు సంబంధించిన పనులు నిర్వర్తించలేమంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ మార్పులు కోరుతున్నారు. ఒక అధికారి నెల రోజులకు పైగా సెలవు పెట్టి వెళ్లారు. దీంతో కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు ఎవరికన్నా అదనపు బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. మరో అధికారి తనకు రూటింగు బాధ్యతలు అప్పచెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిమితులతోనే సమస్యలు...: దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో వివిధ సెక్షన్లు ఉన్నాయి. వాటి ప్రాధాన్యాన్ని బట్టి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షిస్తుంటారు. రాష్ట్ర విభజన తర్వాత ఉద్యోగుల సంఖ్య తగ్గింది, సెక్షన్లు అలాగే ఉన్నాయి. పునర్‌వ్యవస్థీకరణ అవసరం ఉన్నా కొన్ని కారణాల వల్ల ఆ ప్రక్రియ చేపట్టలేకపోయారని చెబుతున్నారు. కమిషనర్ కార్యాలయంలో పని చేసే అధికారులను జిల్లాలకు బదిలీ చేసే ఆస్కారం లేదు. ఉన్న 10, 12 మందిని అక్కడక్కడే సర్దుబాటు చేయాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. అందుకే ఇక్కడ ఆరోపణలున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నా, సుదీర్ఘకాలం ఒకే చోట ఉన్న వారిని మార్చాలన్నా సమస్య తప్పడం లేదని చెబుతున్నారు. కొందరు అధికారులను రెవెన్యూశాఖ నుంచి తమకు పంపాలని కోరుతున్నామని వివరిస్తున్నారు. ఉన్న వారు తక్కువ కావడం.. వారిలో కొందరి సహాయ నిరాకరణతో ఇబ్బందులు తప్పడం లేదు. దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో రెండు అదనపు కమిషనర్ల పోస్టులు ఉన్నాయి. ఒక పోస్టు పదోన్నతి ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. మరో అదనపు కమిషనర్ ఆరోగ్య కారణాల వల్ల దీర్ఘకాలం సెలవులో ఉన్నారు. దీంతో పెనుగ్రంచిపోలు కార్యనిర్వహణాధికారికి ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఒంగోలులో బాలుడి అపహరణ!

రూ.70 లక్షలు డిమాండ్ చేస్తున్న కిడ్నాపర్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా ఒంగోలులో అయిదో తరగతి విద్యార్థి అపహరణకు గురయ్యాడు. నగర సమీప పెళ్లూరులోని సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో చదువుతున్న ప్రణవ్ అనే విద్యార్థి గురువారం సాయంత్రం 4.30గంటల సమయంలో లాయర్‌పేట సాయిబాబా గుడి వద్ద తన ఇంటి సమీపంలో పాఠశాల బస్సు దిగాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రణవ్‌ను అపహరించాడు. సాయంత్రం అయిదున్నర సమయంలో అతడి తండ్రికి అగంతకుడి నుంచి ఫోన్ వచ్చింది. ప్రణవ్‌ను అపహరించానని, రూ.70లక్షలు చెల్లిస్తే విడిచిపెడతానని బెదిరించాడు. దీంతో ప్రణవ్ కుటుంబం తీవ్ర ఆందోళనతో వెంటనే ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. జిల్లా ఎస్పీ సత్య ఏసుబాబు కేసు దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. నగరంలోకి వచ్చే మార్గాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. పొరుగు జిల్లాల పోలీసులనూ అప్రమత్తం చేశారు. ప్రణవ్ తండ్రి తాళ్లూరు మండలంలో పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో భాగస్వాముల మధ్య విభేదాలే కిడ్నాప్‌కి కారణం కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

తిరుపతిలో ఎస్టీయూ మహాసభలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 70వ మహాసభలను 19, 20, 21 తేదీలలో తిరుపతిలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.షణ్ముర్తి, సి.హెచ్. జోసఫ్ సుధీర్ బాబు తెలిపారు. ఈ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆవిష్కరించారు.

ఉపాధ్యాయుల నియామకాల్లో అక్రమాలకు పాల్పడినందుకు మేఘాలయ పీడబ్ల్యూడీ మంత్రి అంపరీన్ లింగ్డో, అదనపు ప్రధాన కార్యదర్శి పి.ఎస్.థంగ్‌క్యులపై సీబీఐ కేసులు నమోదు చేసింది.

పేల్చేదెవరు?



● కిమ్, ట్రంప్ 'అణు బటన్'పై సర్వత్రా చర్చ ● అధ్యక్షులు నేరుగా బటన్ నొక్కరు ● ఆదేశాలు మాత్రమే ఇస్తారు!

అణుబాంబుల్ని పేల్చే మీట తన టేబుల్‌పై ఉందంటే.. తన టేబుల్‌పై ఉందంటూ.. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం హెచ్చరికలు చేసుకుంటున్నారు. ఇంతకీ అణ్వాయుధ బటన్ వీరి చేతుల్లో ఉంటుందా? కేవలం ఆదేశిస్తే అణ్వాయుధాల్ని ప్రయోగించేంతటి అతిపెద్ద నిర్ణయాన్ని తీసుకుంటారా? ఆ పని చేయాలంటే ఏమేం చేయాల్సి ఉంటుంది? అనేవి ఆసక్తికర అంశాలు.

అమెరికాలో ఇలా...

అమెరికా అధ్యక్షుడు తనంతట తానుగా అణు మీట నొక్కి.. క్షిపణుల్ని ప్రయోగించాలన్నది ఊహా మాత్రమే. ఆ పని చేయడానికి ముందు వ్యూహాత్మక కమాండ్‌తో, సైనిక, పౌర సహాయకులతో అధ్యక్షుడు చర్చించాల్సి ఉంటుంది. అణు దాడి అవసరమైతే 'న్యూక్లియర్ ఫుట్‌బాల్' అధ్యక్షుడి వద్ద ఉంటుంది. నల్లటి 'అత్యవసర తోలు సంచి'లో ఉండే నల్లటి లోహపు బ్రీఫ్‌కేసును 'ఫుట్‌బాల్' అని పిలుస్తారు. ఇది 20 కేజీల బరువుంటుంది. సంచి హ్యాండిల్ వద్ద చిన్న యాంటెన్నా ఉంటుంది. అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్ లాంటి నిర్దేశిత కమాండ్ సెంటర్లలో కాకుండా.. ఎయిర్‌ఫోర్స్‌వన్, మెరైన్ వన్, అధ్యక్షుడి వాహనశ్రేణి.. ఇలా వేరే చోట ఉన్నప్పుడు అణు దాడికి అవసరమైన ఆదేశాలు ఇవ్వడానికి ఈ ఫుట్‌బాల్‌ను వినియోగిస్తారు. అణ్వాయుధ సంకేతాలు ఈ ఫుట్‌బాల్‌లో ఉంటాయి. ఈ ఫుట్‌బాల్‌ను మోసుకుని ఓ సైనిక సహాయకుడు ఎల్లప్పుడూ అధ్యక్షుడి వెంట ఉంటారు. సహాయకుడి విధుల్ని అత్యంత రహస్యంగా ఉంచుతారు. అతన్ని రొటేషన్ పద్ధతిలో మారుస్తుంటారు. ఐషన్‌హోవర్ అధ్యక్షుడిగా ఉన్న సమయం నుంచే ఈ ఫుట్‌బాల్ విధానం అమల్లో ఉంది.



న్యూక్లియర్ ఫుట్‌బాల్

ఫుట్‌బాల్‌లో ఏమేం ఉంటాయి?

- దాడి, ప్రతిదాడి అవకాశాలను సూచించే నల్లటి పుస్తకం ఉంటుంది.
- రహస్య ప్రదేశాల వివరాలు తెలిపే పుస్తకం మరొకటి ఉంటుంది.
- 'హెచ్చరిక వ్యవస్థల్ని అప్రమత్తం చేసే 8 నుంచి 10 పేజీల ఫోల్డర్ ఉంటుంది. ఇది కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞానం.
- దాడికి ఆదేశాలిచ్చే సంకేతాలతో కూడిన మూడు నుంచి 5 అంగుళాల పొడవైన ప్లాస్టిక్ కార్డు ఉంటుంది. దీనిని బిస్కెట్ అని పిలుస్తారు.

ఎలా ఆపరేట్ చేస్తారు?..

సైనిక బలగాల కమాండర్ ఇన్ చీఫ్ అయిన అధ్యక్షుడు అణ్వాయుధ దాడికి ఆదేశాలు ఇవ్వొచ్చు. అధ్యక్షుడు బ్రీఫ్ కేసును తెరిచి.. కమాండ్ సిగ్నల్ లేదా వాచ్ అలర్ట్‌ను జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్‌కు ఇస్తారు. ఆ తర్వాత తన వెంట ఉన్న సైనిక సహాయకుడితో దాడి అవకాశాల్ని సమీక్షిస్తారు. ఒకేఒక క్రూయిజ్ క్షిపణి ద్వారా ప్రయోగించాలా లేదా బహుళ ఐసీబీఎం ప్రయోగాలు చేయాలా? అనే ప్రణాళికను నిర్ణయిస్తారు. 'ఓప్లాన్ 8010' అనే ప్రణాళిక(గతంలో దీనిని సింగిల్ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ ప్లాన్ అనేవారు) ప్రకారం ఇదంతా చేస్తారు. ఆ తర్వాత నల్లటి సంచిలో నుంచి కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెరిచి.. సైనిక సహాయకుడు నేషనల్ మిలిటరీ కమాండ్ సెంటర్‌ను సంప్రదిస్తారు. అధ్యక్షుడు సంచిలోని ప్లాస్టిక్ కార్డుపై ఉండే ప్రత్యేక సంకేతాన్ని చెప్పాల్సి ఉంటుంది. అమెరికాలో అణు ప్రయోగ కేంద్రాలపై అధ్యక్షుడికి, రక్షణమంత్రికి మాత్రమే అధికారాలుంటాయి. అధ్యక్షుడు స్వయంగా అణు ఆదేశాలు ఇచ్చారా? లేదా? అని రక్షణమంత్రి సరిచూసుకోవాల్సి ఉంటుంది. వాటిని తిరస్కరించే అధికారం రక్షణమంత్రికి లేదు. పాటించి తీరాల్సిందే. సంకేతాల్ని సరిచూసుకున్న తర్వాత.. సంబంధిత యూనిట్లకు దాడి ఆదేశాల్ని సైన్యం ఇస్తుంది. తదనుగుణంగా సైన్యం అణుబాంబుల్ని ప్రయోగిస్తుంది.

ఉత్తర కొరియాలో ఇలా...

ఉ.కొరియా అణు ప్రయోగ విధానాలు ఎలా ఉంటాయన్నది ఎవరికీ తెలియదు. కిమ్‌కు అణ్వాయుధాలన్నింటిపైనా నియంత్రణ ఉన్నప్పటికీ.. ఆయనే స్వయంగా క్షిపణులు ప్రయోగించరని, సైనికాధికారులకు ఆ ఆదేశాలు ఇస్తారని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అమెరికాలో 'ఫుట్‌బాల్' విధానంలాగా ఇక్కడ ఉండదు. కిమ్ సర్వాధికారి కాబట్టి.. ఏం చేయాలనుకుంటారో ఆ మేరకు ఆయన ఒక్కరే.. వ్యూహాత్మక రాకెట్ బలగాలకు ఆదేశాలు ఇస్తారు. అయితే క్షేత్రస్థాయి యూనిట్లకు కూడా ఆయన నేరుగా ఆదేశాలు ఇస్తారా? అన్నది స్పష్టత లేదు. నిర్దిష్ట ప్రదేశాలపై దాడులు చేయాలన్న ఆదేశాల్ని ఎవరు ఇస్తారన్నదీ తెలియదు. అయితే ప్రత్యర్థులు ఊహించని రీతిలో దాడులు చేస్తే.. వాటిని తిప్పికొట్టడానికి స్థానిక యూనిట్లలోని జూనియర్ అధికారులకు సైతం కిమ్ అదేశాలు ఇవ్వొచ్చన్న వాదనా ఉంది. అణు యూనిట్లతో కిమ్ తరచూ సంప్రదిస్తుంటారు. ప్రత్యర్థిది పైచేయి అయినపుడు కొరియా సైన్యంలోని స్థానిక యూనిట్లే సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోలేదన్న వాదనా ఉంది.



కొరియా అణు క్షిపణి

- ఈనాడు ప్రత్యేక విభాగం

2వేల గుడిసెలు దగ్ధం

బద్వేలు, న్యూస్‌టుడే: పేదలు వేసుకున్న రెండు వేల గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. కడప జిల్లా బద్వేలులో గురువారం రాత్రి ఈ ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కొద్దికాలం క్రితం పేదలు అంబేడ్కర్-మార్క్స్ కాలనీ ఏర్పాటుచేసుకున్నారు. ఇక్కడ 4 వేల వరకు గుడిసెలున్నాయి. గురువారం సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో విద్యుత్తు తీగల రాపిడికి ఒక గుడిసెపై నిప్పు పడి మంటలు చెలరేగాయి. అవి వేగంగా వ్యాపించి పక్కనున్న గుడిసెలకు అంటుకున్నాయి. మంటలకు గాలులు తోడవటంతో ప్రమాద స్థాయి పెరిగింది. రాత్రి 9.30 గంటల సమయానికి 2000 వరకు గుడిసెలు కాలిపోయి లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా. స్థానికంగా ఒకే అగ్నిమాపక యంత్రం ఉండటం.. ఈ యంత్రానికి నీరు కూడా నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకురావాల్సి రావడంతో మంటలు ఆర్పటం ఆలస్యమైంది. పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు నుంచి అగ్నిమాపక యంత్రాలు తీసుకువచ్చి మంటలు అదుపుచేశారు. పట్టణ సీఐ రెడ్డెప్ప, తహసీల్దారు మాధవ కృష్ణారెడ్డి, పురపాలిక ఛైర్మన్ పార్థసారధి ఘటనా స్థలికి చేరుకొని సహాయ చర్యలు పరిశీలించారు. నష్టం వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేడి సెగకు ఎవరూ లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో ప్రాణనష్టంపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని అధికారులు చెప్పారు.



ప్రమాద స్థలంలో బాధితులు

ప్రమాదంపై సీఎం ఆరా: అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. బాధితులకు తక్షణ సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

జన్మభూమి వినతులన్నీ పరిష్కరించాలి: చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఐదో విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమం పూర్తయ్యేనాటికి గతంలో, ప్రస్తుతం ప్రజల నుంచి అందిన వినతులన్నింటినీ పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గురువారం రాత్రి విశాఖ పోర్టు అతిథిగృహంలో అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రస్థాయి రియల్ టైమ్ గవర్నెన్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అహ్మద్ బాబు అంశాల వారీగా జన్మభూమి ప్రగతి వివరించారు. వినతులు అందించిన వారి మొబైల్ ఫోన్లకు సంబంధిత వివరాలు వెళ్లేలా ఏర్పాట్లు చెయ్యాలన్నారు. విదేశీ విద్యకు సుమారు 4 వేల మందికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని.. ఆన్‌లైన్‌లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులను గుర్తించాలని ఆదేశించారు. ఈ నెల 18, 19 తేదీల్లో కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నామని, 19న సాయంత్రం వీరందరికీ బహుమతులు అందజేయడంతోపాటు మంచి విందు ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు.

ఏపీలో 3 సౌర నగరాల అభివృద్ధి

● కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరులశాఖ దేశవ్యాప్తంగా అభివృద్ధి చేయబోయే 60 సౌర నగరాల్లో మూడింటిని ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసినట్లు కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ తెలిపారు. ఇందులో విజయవాడ, కాకినాడ, నర్సాపూర్, తెలంగాణలో మహబూబ్‌నగర్ ఉన్నట్లు చెప్పారు. గురువారం లోక్‌సభలో విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ఆంధ్రా తీరంలో పెద్ద మొత్తంలో భార ఖనిజం

విశాఖ సముద్ర తీరంలో 38.64 మిలియన్ టన్నుల భార ఖనిజం (హెవీ మినరల్) ఉన్నట్లు జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశీలనలో తేలిందని కేంద్ర గనులశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. గురువారం లోక్‌సభలో ఏపీ ఎంపీలు జేసీ దివాకర్‌రెడ్డి, కొత్తపల్లి గీత అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో సముద్ర మట్టానికి 1 మీటరు కింద 53.61 మిలియన్ టన్నుల భారీ ఖనిజ వనరులున్నట్లు అంచనా ఉందన్నారు. 160 బ్లాక్‌ల్లో 38.64 మిలియన్ టన్నుల వనరులు ఉండొచ్చని ఈ సర్వే ద్వారా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని అనంతగిరి- చింతపల్లి- సపర్లగూడెం, జీరల ప్రాంతాల్లో 567.80 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. తూర్పుగోదావరి జిల్లా గుర్తేడు ప్రాంతంలో 142 మిలియన్ టన్నుల బాక్సైట్ ఉన్నట్లు తేలిందని తెలిపారు. కడప జిల్లాలోని మంగంపేట ప్రాంతంలో 62 మిలియన్ టన్నుల బెరైటీస్ నిల్వలు ఉన్నట్లు తెలిపారు.

బ్యారన్ల తీసివేతకు అనుమతివ్వండి

ఆంధ్రప్రదేశ్‌లో లాభదాయకంగా లేని పొగాకు బ్యారన్లను తీసివేయడానికి అనుమతి ఇవ్వాలని ఉభయగోదావరి జిల్లాల రైతులు కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభుకు విజ్ఞప్తి చేశారు. ఎంపీలు తోట నరసింహం, మాగంటి బాబు, మురళీ మోహన్, గల్లా జయదేవ్, రాయపాటి సాంబశివరావు, కంభంపాటి హరిబాబు, కొత్తపల్లి గీతలతో కలసి వారు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఐజేఎస్ నిర్వహించాలి: ఎంపీ రవీంద్రబాబు

అఖిల భారత సర్వీసుల మాదిరిగా న్యాయమూర్తుల నియామకానికి ఇండియన్ జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్) పరీక్ష నిర్వహించాలని తెదేపా ఎంపీ పి.రవీంద్రబాబు డిమాండు చేశారు. గురువారం లోక్‌సభలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతన సవరణ బిల్లుపై ఆయన మాట్లాడారు. ఐదేళ్లకోసారి ప్రజల వద్దకు వెళ్లి చట్టసభ సభ్యులు ప్రజలకు జవాబుదారీగా ఉంటున్నారని, అదే విధంగా న్యాయమూర్తులూ ప్రజలకు అంటే పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాలన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటు చేయండి: అవంతి శ్రీనివాస్

విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని తెదేపా ఎంపీ అవంతి శ్రీనివాస్ డిమాండు చేశారు. లోక్‌సభలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

16 అనుసంధాన ప్రాజెక్టులపై నివేదికలు రూపొందించాం: మేఘ్వాల్: నదుల అనుసంధానం కోసం 30 ప్రాజెక్టులను గుర్తించామని, సర్వే అనంతరం 16 అనుసంధాన ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాల నివేదికలు రూపొందించామని గురువారం లోక్‌సభలో వైకాపా ఎంపీ అవినాశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలవనరుల శాఖ సహాయమంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సైనిక సంక్షేమానికి రూ.5లక్షల విరాళం

ప్రధానికి అందజేస్తానన్న జ్యోతి సురేఖ



ఈనాడు, దిల్లీ: విపత్కర పరిస్థితుల్లోనూ దేశం కోసం పనిచేస్తున్న సైనికుల సంక్షేమానికి తనవంతు భాగస్వామ్యం ఉండాలని విలువిద్య(ఆర్చరీ) క్రీడాకారిణి జ్యోతి సురేఖ ఆకాంక్షించారు. ఈ మేరకు సైనిక సంక్షేమ నిధి పేరిట రూ.5లక్షల చెక్‌ను ప్రధాని నరేంద్రమోదీకి అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. గురువారం దిల్లీకి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశం కోసం ఎంతో చేస్తున్న సైనికులకు అవార్డు ద్వారా తనకు వచ్చిన నగదును ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వ్యక్తిగత విభాగంలోనూ ప్రపంచ ఛాంపియన్ పతకం సాధనే లక్ష్యంగా సిద్ధమవుతున్నానని జ్యోతి సురేఖ చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్థుడి హల్‌చల్

- తాళాలు వేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- బలవంతంగా తెరిస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెదకాకాని, న్యూస్‌టుడే: తన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఓ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకొని హల్‌చల్ చేసిన సంఘటన గుంటూరు జిల్లా పెదకాకానిలో చోటుచేసుకుంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన రోశయ్య గురువారం ఉదయం 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తాళాలు తీయగానే లోనికి వెళ్లి వెంట తెచ్చుకున్న తాళాన్ని గేటుకు వేసేశాడు. పెదకాకాని సీఐ చంద్రమౌళి అక్కడికి చేరుకొని బయటకు రావాలని సదరు వ్యక్తికి సూచించారు. నా డిమాండ్లు పరిష్కరించే వరకు గేటును తెరిచేది లేదన్నాడు. పోలీసులు బలవంతంగా గేటును తెరిచేందుకు ప్రయత్నించగా వెంట తెచ్చుకున్న కిరోసిన్, పెట్రోల్‌ను చూపించి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పెదకాకాని మండలంలో ఉన్న జన్మభూమి కమిటీలను రద్దు చేయాలని, మండలంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిలిపివేసి.. తాను నివాసముంటున్న అంబేడ్కర్ నగర్, జ్యోతినగర్ కాలనీ నీటి ట్యాంకుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి. ఇళ్ల పట్టాలు ఇప్పించాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, శ్మశానం చుట్టూ ప్రహరీ, మాదిగలకు బ్యాంకుల ద్వారా పూచీకత్తులేని రుణాల మంజూరు తదితర డిమాండ్లను వివరించాడు. తనకు అర్హత ఉన్నా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం అందకుండా జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయని ఆరోపించాడు. ఒక చిన్న బడ్డీకొట్టు పెట్టుకుంటే విద్యుత్ అధికారులు అధిక మొత్తంలో బిల్లులు వేశారన్నాడు. ప్రశ్నిస్తే కేసులు పెట్టారని.. విద్యుత్తు ఏఈ, పెదకాకాని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. సర్పంచి, స్థానిక అధికారులు సర్దిచెప్పినా వినకపోవడంతో ఆర్డీవో శ్రీనివాసరావును పిలిపించి మాట్లాడించారు. ఇంతలో భవనం వెనక ఉన్న కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలికి వెళ్లిన పోలీసులు రోశయ్యను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గేటులోనుంచి రోశయ్యతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్, అంతర చిత్రంలో కిరోసిన్ పోసుకుంటానని బెదిరిస్తున్న రోశయ్య

ఎగువ కాఫర్ డ్యాంపై నేడు నిర్ణయం

ఈనాడు, అమరావతి: దిల్లీలో శుక్రవారం పోలవరం ప్రాజెక్టు డ్యాం ఆకృతుల కమిటీ సమావేశమవుతోంది. ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో రెండే అంశాలు అజెండాగా ఉన్నాయి. పోలవరంలో ఎగువ కాఫర్ డ్యాంపై నిర్ణయం తీసుకోవడంతో పాటు, పుణెలోని కేంద్ర జలవిద్యుత్తు పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలవరం 3డి నమూనాపైనా చర్చ జరగనుంది. ఈ సమావేశంలో జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు, పోలవరం పర్యవేక్షక ఇంజినీర్ వేమన రమేష్‌బాబు ఇతర అధికారులు పాల్గొంటారు. కేంద్ర జలవిద్యుత్తు కార్పొరేషన్ నిపుణులు ఇప్పటికే ఎగువ కాఫర్ డ్యాంపై రెండు ప్రతిపాదనలు సమర్పించారు. ఇందులో 5అలైన్‌మెంట్లు సూచించారు. ప్రధాన డ్యాం 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా ఆకృతులు సిద్ధం చేస్తున్నారు. ఎగువ కాఫర్ డ్యాం 28 లక్షల క్యూసెక్కుల వరద తట్టుకునేలా సిద్ధం చేస్తున్నారు. ఈ రెండింటిలో ప్రధాన డ్యాంకు డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నారు. ఎగువ కాఫర్ డ్యాంకు జెట్ గ్రౌటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని భిన్నాంశాల మధ్య ఏకరూపత సాధ్యమా, సాంకేతికంగా ఇది ఎంతవరకు సాధ్యం అన్నది తేల్చాల్సింది పోలవరం డ్యాం ఆకృతుల కమిటీయే. ఈ అంశంపై చర్చించి కమిటీ తుది నిర్ణయం వెలువరిస్తుంది.

తలుపుల కేబుల్ యాంకర్లపై జలసంఘం వద్ద చర్చ

పోలవరం ప్రాజెక్టులో తలుపుల నిర్వహణకు వినియోగించే కేబుల్ యాంకర్ల ఆకృతులకు సంబంధించి కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్ సిన్హా వద్ద గురువారం దిల్లీలో ఒక సమావేశం జరిగింది. ఈ యాంకర్లు సరఫరా చేస్తున్న ఇటాలియన్ కంపెనీ ప్రతినిధి వీటిపై ఒక ప్రజంటేషన్ సమర్పించారు. ఇందులోని సాంకేతిక అంశాలపై అనుమానాల నివృత్తి కోసం ఈ సమావేశం జరిగింది.

తలాక్ బిల్లుపై రాజ్యసభలో కొనసాగిన ప్రతిష్టంభన

దిల్లీ: ముమ్మారు తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడలేదు. ఈ బిల్లును సెలెక్టు కమిటీకి పంపాలా వద్దా అనే అంశంపై రెండు పక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. విపక్షాల డిమాండ్‌ను ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన తెదేపా కూడా సమర్థించింది. ఈ తీర్మానాలపై తొలుత ఓటింగ్ జరగాలని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఒ బ్రెన్ కోరారు. విపక్షాల తీర్మానాలు/సవరణలకు ఆమోదం లభించినట్లేనని సభ ఛైర్మన్ స్థానంలో ఉన్న కురియన్ అన్నారు. దీంతో ఆర్థికమంత్రి జైట్లీ ఏకీభవించలేదు. ఇందుకు కురియన్ స్పందిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి 24 గంటల ముందు నోటీసు ఇవ్వాలన్న నిబంధన ఉన్నా సభాధ్యక్ష స్థానంలో ఉన్న వారు ఇందుకు మినహాయింపు ఇవ్వచ్చని చెప్పారు. విడాకులు పొందిన మహిళలు, వారి పిల్లల ఆర్థిక అవసరాలకు భరోసా కల్పించేలా బిల్లులో నిబంధన చేర్చాలని విపక్ష నేత గులాంనబీ ఆజాద్ సూచించారు. తాము బిల్లుకు అనుకూలమేనని, కానీ భర్తలకు జైలు శిక్ష విధించే నిబంధననే వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. బాధిత మహిళలు, పిల్లల ఖర్చులను ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. వాదోపవాదాలు కొనసాగడంతో కురియన్ సభను వాయిదా వేశారు.

జన్మభూమి ఆర్థిక అవసరాలకు ప్రత్యేక బడ్జెట్

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: విద్యుదుత్పత్తి, మిగులులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లిలో గురువారం జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. జన్మభూమిలో ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించనున్నట్లు వెల్లడించారు.

మా చిరునామా: విహారి
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

పర్యాటకానికి సంబంధించి మీ
అనుభవాలు, సందేహాలు పంపించండి

విహారి




vihari@eenadu.in

"నాన్నా! సెలవుల్లో ఎక్కడికి వెళ్దాం?"
"చూద్దాంలే!"
"అదే, ఏం చూద్దాం నాన్నా!!"
సెలవుల ముందు చాలా ఇళ్లల్లో వినిపించే మాటలివి.

నాలుగు రోజుల్లో సంక్రాంతి సెలవులు వచ్చేస్తున్నాయ్! పల్లెకు పోయేవాళ్లు పల్లెకు పోతారు. పతంగులు ఎగరేసేవారు.. గాల్లో తేలిపోతుంటారు. సెలవుల్లో కాస్త తిరిగొద్దామని అనుకునేవారు మరికొందరు. ఐదారు రోజుల సెలవులు. ఎందుకాలస్యం... జిల్లాలు దాటండి, రాష్ట్రాలు దాటి వెళ్లిపోండి. సంకురాతిరి సంబరాలను సంతోషంగా ఆస్వాదించండి. మీ పర్యటన కోసం ముచ్చటైన ప్రదేశాల వివరాలు అందిస్తున్నాం. నచ్చినదాన్ని ఎంచుకొని ఎంచక్కా చుట్టేసిరండి!

పొంగల్ హంగులు



సంక్రాంతి పండగ తమిళనాట నాలుగు రోజుల పాటు సాగుతుంది. భోగి పొంగల్, థాయ్ పొంగల్, మట్టు పొంగల్, కనుమ్ పొంగల్.. మన దగ్గర భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఎలాగో అలాగన్నమాట! అయితే సంప్రదాయాలను కచ్చితంగా పాటించే తమిళనాడు సంక్రాంతి అనగానే గుర్తొచ్చేది జల్లికట్టు ఆట. మదురై చుట్టు పక్కల గ్రామాల్లో ఈ సందడి కనిపిస్తుంది. సంక్రాంతి సీజన్‌లో నెల రోజుల పండగ ఒకటి జరుగుతుందిక్కడ. అదే మామల్లపురం నృత్యోత్సవం. భరతనాట్యం, కూచిపూడి, కథక్, కథాకళి, ఒడిస్సీ... ఇలా భారతీయ సంప్రదాయ నృత్యాలన్నీ ప్రదర్శిస్తారు. ప్రసిద్ధ నృత్యకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారు. సంక్రాంతి నాలుగు రోజులు నృత్యోత్సవం పతాకస్థాయిలో సాగుతుంది.

మామల్లపురం పేరు కొత్తగా ఉందంటారా! ఈ పట్టణాన్ని మహాబలిపురం అని కూడా అంటారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ నగరం పల్లవ రాజ్యంలో రేవుపట్నంగా ఉండేది. బంగాళాఖాతం ఒడ్డున క్రీస్తుశకం 7వ శతాబ్దంలో నిర్మించిన మహాబలిపురంలో అడుగడుగునా అద్భుతాలే. కడలి కెరటాలు తాకేంత దూరంలో ఉన్న శివాలయం ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ఈ ఆలయం యునెస్కో చారిత్రక సంపదగా గుర్తింపు పొందింది. వరాహ గుహ, పాండవుల రథాలు, భారీ శిలలను తొలిచి పౌరాణిక గాథలు తెలిపే శిల్పమాలికలుగా మలచిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.



కొండవాలుపై ఏటవాలుగా నిలిచి ఉన్న బండరాయి ఇప్పుడు సెల్ఫీజోన్‌గా మారింది. మహాబలిపురం సందర్శన ఆశ్చర్యానందాలను కలిగిస్తుంది.




సమీపంలో

చోళమండలం ఆర్ట్ విలేజ్, లైట్ హౌస్, ఓపెన్ ఎయిర్ మ్యూజియమ్, టైగర్ కేవ్, ప్రభుత్వ శిల్పకళా కళాశాలతో పాటు మరెన్నో ఉన్నాయి. మహాబలిపురం నుంచి కంచి సుమారు 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

ఎలా వెళ్లాలి: మహాబలిపురం వెళ్లాలంటే ముందుగా చెన్నై చేరుకోవాలి. అక్కడి నుంచి నుంచి మహాబలిపురం దాదాపు 58 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సులు, ట్యాక్సీల్లో చేరుకోవచ్చు.

ఎన్ని రోజులు: 4-6 రోజులు



ఉడుపిలో కంబాలా..

ఉడుపి : కన్నయ్య సన్నిధిలో..

మకర సంక్రాంతి వేళ కృష్ణుడు కొలువుదీరిన ఉడుపి క్షేత్రం కోలాహలంగా ఉంటుంది. ఉత్తరాయణ ప్రవేశం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారు. సంక్రాంతి రోజు మూడు రథాల్లో నిర్వహించే శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగుతుంది.



గర్భగుడిలోని కృష్ణుడి విగ్రహాన్ని చిన్న కిటికీలో నుంచి చూడాలి. ఈ కిటికీకి ఉండే తొమ్మిది గళ్లను నవగ్రహాలుగా భావిస్తారు. ఉడుపి ఉత్సవాలు మగిశాక.. చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే 'కంబాలా' పోటీలు చూడాల్సిందే.

మడిలో తలపడి

ఊళ్లోని వారంతా ఒక చోటికి చేరుకుంటారు. జట్లుగా విడిపోయి.. కేరింతలు కొడుతుంటారు. బూరలు ఊదుతుంటారు. కాడికి కట్టిన దున్నలు కాలుదువ్వుతుంటాయి. ముక్కులు ఎగిరేస్తుంటాయి. కాడిని పట్టుకున్న రైతుబిడ్డ మీసం మెలేస్తాడు, ఈల మోగుతుంది. 'రా.. రా.. రా..' ఏ నోట విన్నా ఇవే అరుపులు. పంటలు సమృద్ధిగా పండాలని దైవాన్ని కోరుతూ చేసుకునే 'కంబాలా' పండగ ఇలా సాగిపోతుంది. ఉడుపి జిల్లాలోని పల్లెలతో పాటు దాని పక్కనే ఉండే మంగళూరు ప్రాంతంలోనూ ఈ సంప్రదాయం ఉంది. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు వారాంతాల్లో ఈ పోటీలు జరుగుతాయి. సంక్రాంతి సమయంలో ఈ ఉత్సాహం రెండింతలు అవుతుంది. రైతులే.. వీరులు. కాడికి దున్నలను కట్టి.. దూసుకెళ్తారు. గెలిచినవాడే మొనగాడు. కంబాలా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ రేసులు జరుగుతుంటాయి. ఊరూరా జరిగే ఈ పోటీలను చూసేందుకు వేలమంది పర్యాటకులు ఉడుపి చుట్టుపక్కల గ్రామాలకు విచ్చేస్తుంటారు. పల్లెవాసుల ఆనందంలో పాలుపంచుకుంటారు.

సమీపంలో

పుణ్యక్షేత్రాలు: కొల్లూరు (మూకాంబిక), మురుడేశ్వర్, శృంగేరి, ధర్మస్థల

విహార స్థలాలు: కపు బీచ్, మల్పె బీచ్, కుడ్లు జలపాతం, జోగ్ ఫాల్స్

ఎలా వెళ్లాలి: హైదరాబాద్ నుంచి ఉడుపి, మంగళూరు... విజయవాడ నుంచి మంగళూరుకు ప్రైవేట్ ట్రావెల్ సంస్థల బస్సులు ఉన్నాయి. టికెట్ ధర రూ.1,000 నుంచి రూ.1,600 వరకూ ఉంది. మంగళూరు నుంచి ఉడుపి 56 కిలోమీటర్లు. హైదరాబాద్ నుంచి హుబ్లీ మీదుగా ఉడుపి చేరుకోవచ్చు.

ఎన్ని రోజులు: 5-7 రోజులు

సంక్రాంతి సందడి
చూద్దాం పదండి

గోదారి గలగలలు.. కోనసీమ

గోదారి గలగలలు.. పైర గాలులు.. కొబ్బరి తోటలు.. కడలి అందాలు.. ఇదీ కోనసీమ సౌందర్యం. సంక్రాంతి వేళ.. ముంగిట్లో ముగ్గులు, వంటింట్లో పిండివంటల ఘుమఘుమలు, ఊరంతా పతంగులు, ఊరి చివరన కోడి పందేలు.. కోనసీమ అందాలు రెట్టింపు అవుతాయి. దీనికి తోడు మనసును కట్టిపడేసే పర్యాటక ప్రాంతాలెన్నో ఉన్నాయిక్కడ.

కోనసీమలో సంక్రాంతి శోభ వారం ముందు నుంచే మొదలవుతుంది. భోగి నాడు వేసే.. మంటలతో పండగ సంబరం పతాకస్థాయికి చేరుకుంటుంది. సంక్రాంతి రోజు మరింత సందడిగా ఉంటుంది. కనుమ రోజు కోనసీమలో ప్రభల తీర్థాలు వైభవంగా జరుగుతాయి. వీరభద్రుడిని కొలుస్తూ అందమైన ప్రభలను తయారు చేసి తీర్థ ప్రదేశాలకు తరలిస్తారు. ప్రభ కింద పడకుండా యువకులు భుజం కాసి అశ్శరభ...శ్శరభ అంటూ పొలాలు, కాలువల వెంట.. సాగిపోతారు.

జగ్గన్నతోట వైభవం..

కోనసీమలోని జగ్గన్నతోట ప్రభల తీర్థానికి విశేషమైన ప్రాచుర్యం ఉంది. దీనికి నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. 11 ప్రదేశాల నుంచి ప్రభలు ఇక్కడికి వస్తాయి. దీంతో పాటు పి.గన్నవరం, రాజోలు, మామిడికుదురు, ముమ్మిడివరం, కొత్తపేట ఇలా వివిధ మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రభల తీర్థాలు జరుగుతాయి. వీటికి హాజరయ్యే వారు ఎడ్ల బళ్లలో విహరిస్తారు. పచ్చని కొబ్బరి ఆకులతో అల్లిన చాపలను ఈ బళ్లకు చుడతారు. వాటిలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ తీర్థాలకు వెళ్లే తీరు పల్లె వైభవాన్ని, సంక్రాంతి ఔన్నత్యాన్ని చాటుతుంది.

– భగత్‌సింగ్
న్యూస్‌టుడే, పి.గన్నవరం

సమీపంలో

అంతర్వేది నరసింహస్వామి, అప్పనపల్లిలో శ్రీబాలబాలాజి, అయినవిల్లిలో వినాయకుడు, మురమళ్లలో వీరేశ్వరస్వామి, వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి వంటి ప్రముఖ ఆలయాలు ఉన్నాయి.



ఎలా వెళ్లాలి: రాజమండ్రి, రాజోలు, అమలాపురం చేరుకుంటే కోనసీమ మొత్తం చుట్టిరావొచ్చు. దిండి రిసార్ట్స్‌లో బస చేయవచ్చు.

ఎన్ని రోజులు: 2-4 రోజులు




ఏకో వైపు

అడవి దాగిన అందాలు



సంక్రాంతి సెలవులను భిన్నంగా ఆస్వాదించాలనుకునే వారికి అడవి దాగిన అందాలు ఆహ్వానిస్తున్నాయి. ఇక్కడ సరస్సులో బోటు షికారు చేయవచ్చు, గుట్టలెక్కవచ్చు, ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎకో టూరిజానికి కొత్త విడిదిగా మారింది.

ఒకప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అలరించిన లక్నవరం సరస్సు, ఏటూరునాగారం అభయారణ్యం, పాండవుల గుట్ట.. ఇప్పుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భాగమయ్యాయి. వీటికి ప్రాచుర్యం కల్పించడం కోసం అటవీశాఖ గతేడాది ఎకో టూరిజం క్యాలెండర్‌ను రూపొందించింది. సంక్రాంతి సెలవుల్లో వన విహారానికి అటవీ శాఖ వివిధ ప్యాకేజీలను ప్రకటించింది. 'లక్నవరం ఫెస్ట్'ను జనవరి 13, 14వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా లక్నవరం సరస్సు చుట్టూ సైక్లింగ్, గుడారాల్లో బస, సరస్సులో బోటు షికారు, ట్రెక్కింగ్, ఐలాండ్ విజిట్, లేక్‌వ్యూ సఫారీ ఉంటుంది. పర్యటనలో ఎడ్లబండ్లపై విహారం ఉంది. భోజన వసతి కూడా కల్పిస్తారు. 'లక్నవరం ఫెస్ట్' ప్యాకేజీ ధర రూ.1,500 ఒక్కొక్కరికి.



గుట్టలెక్కేద్దాం: రేగొండ మండలం పాండవుల గుట్ట రాక్ క్లైంబింగ్‌కు ప్రసిద్ధి. జనవరి 14, 21, 28వ తేదీల్లో ఇక్కడ రాక్‌క్లైంబింగ్ నిర్వహించనున్నారు. నిపుణుల సమక్షంలో తాళ్ల సాయంతో గుట్టను అధిరోహించాల్సి ఉంటుంది. టికెట్ ధర రూ.400.

అరణ్యంలో హాయిగా: ఏటూరు నాగారం అభయారణ్యంలోని తాడ్వాయి దగ్గర పర్యాటకులు బస చేయడానికి ఆరు కుటీరాలు ఏర్పాటుచేశారు. కుటీరం అద్దె ఒక్క రాత్రికి రూ.1,000. ఉదయాన్నే అడవిలో సైక్లింగ్ ఉంటుంది. బ్లాక్‌బెర్రీ ఐలాండ్ సందర్శనతో పాటు, కొండేటి వ్యూ పాయింట్ నుంచి బర్డ్‌వాచింగ్ అవకాశం ఉంది. వనకుటీరాల వద్ద గిరిజన మ్యూజియం సందర్శించవచ్చు. వీటితోపాటు పరిసరాల్లో హేమాచల లక్ష్మీనరసింహస్వామి, మేడారం సమ్మక్కసారలమ్మ, రామప్ప దేవాలయాలను చూడొచ్చు. మరిన్ని వివరాలకు 7382619363 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించవచ్చు.

– పాండురంగశర్మ, ఈనాడు, వరంగల్

వనవిహారం చేయాలంటే ముందుగా వరంగల్ చేరుకోవాలి. అక్కడి నుంచి లక్నవరం, ఏటూరు నాగారం, తాడ్వాయ్ చేరుకోవచ్చు. బస్సులు అందుబాటులో ఉంటాయి.

దిక్సూచి



మేమున్నామనీ..

ప్రకృతి అందాలు ఎవరికి మాత్రం చూడాలని ఉండదు. అయితే ఆ అవకాశం అందరికీ ఉండదు. ఎక్కడెక్కడికో వెళ్లాలని, ఏవేవో చూడాలని ఉన్నా.. దివ్యాంగులకు సాధ్యం కాకపోవచ్చు. అలాంటి వారికి అండగా నిలుస్తోంది ఎనేబుల్ ట్రావెల్ అనే స్టార్టప్. ఈ సంస్థ.. '#కెన్‌డూ' పేరుతో దివ్యాంగుల విహారానికి చేయుతనిస్తోంది. నడవలేని వారికి వీల్ చైర్ తీసుకెళ్లడానికి అనుకూలంగా ఉండే వ్యాన్ అందుబాటులో ఉంచుతోంది. బధిరులకు వినికిడి యంత్రాలు అందజేస్తోంది. పర్యాటకులను కంటికి రెప్పలా చూసుకునే సహాయకుడితో పాటు గైడ్‌ను అందుబాటులో ఉంచుతోంది. వీరి సహాయంతో దివ్యాంగులు వారు కోరుకున్న ప్రదేశంలో హాయిగా పర్యటించ వచ్చని చెబుతోంది ఈ సంస్థ.

పులికాట్‌లో విహంగామా

ఒంటికాలుపై తపస్సు చేసే కొంగలు.. వంపు తిరిగిన పొడవాటి మెడ, ఎర్రనిముక్కుతో కనువిందు చేసే ఫ్లెమింగోలు.. సంచిని వేలాడేసుకున్న గొంతుతో మిడిసిపడే గూడబాతులు.. ఒకటా.. రెండా.. 152 రకాల పక్షులు విడిది కోసం ప్రళయ కావేరి (పులికాట్ సరస్సు)కి చేరుకున్నాయి. నేలపట్టు, వెదురుపట్టు ప్రాంతాల్లోనూ వీటి కిలకిలారావాలు వినిపిస్తుంటాయి. విదేశాల నుంచి గగన మార్గంలో అతిథులు విచ్చేసిన సందర్భంగా పండగ చేసుకోకుంటే ఎలా? అందుకే ఫ్లెమింగో పండగకు రంగం సిద్ధమైంది.

నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లో 600 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఏటా అక్టోబర్ వచ్చిందంటే చాలు ఈ ఉప్పునీటి సరస్సు విదేశీ పక్షులకు ఆలవాలంగా మారిపోతుంది. అక్టోబర్ నుంచి జనవరి మాసాంతం వరకు విదేశీ పక్షులు అలరిస్తాయి. శీతాకాలంలో చలిని తట్టుకోలేక.. దక్షిణ అమెరికా, ఐరోపా ఖండాల్లోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తాయివి. నాలుగు నెలల పాటు పులికాట్ సరస్సుతో పాటు సమీపంలోని నేలపట్టు, వెదురుపట్టులో హాయిగా సేద తీరుతాయి. గూళ్లు కట్టి, గుడ్లు పెట్టి, వాటిని పొదిగి.. శీతాకాలం ముగిసిన తర్వాత పిల్లలతో కలిసి స్వస్థలాలకు ఎగిరిపోతాయి.

మూడు రోజుల పండగ

విదేశీ పక్షుల రాకతో ఈ ప్రాంతమంతా సందడి సందడిగా ఉంటుంది. ఈ సందర్భాన్ని మరింత ఉత్సాహంగా మార్చేందుకు 2001లో పక్షుల పండగను నిర్వహించాలని నిర్ణయించారు అప్పటి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్. దానికి సముద్రపు రామచిలుక



(ఫ్లెమింగో) పక్షి పేరిట 'ఫ్లెమింగో ఫెస్టివల్' అని నామకరణం చేశారు. ఆనాటి నుంచి రెండు సంవత్సరాలు మినహా ఈ పండగ జరుగుతూ వస్తోంది. 2014 నుంచి 'ఫ్లెమింగో ఫెస్టివల్'ను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది జనవరి 7,8,9 తేదీల్లో పండగ నిర్వహించనున్నారు. సూళ్లూరుపేటతోపాటు, నేలపట్టు, అటకానితిప్ప, భీమునివారిపాళెం ఒడల రేవుల్లో పండగ జరుగుతుంది. పక్షుల అందాలు చూసేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే స్టాల్స్‌తోపాటు, ఆటల పోటీలు, సాయంత్రం నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.



ఎలా వెళ్లాలంటే:

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి నుంచి సూళ్లూరుపేటకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. చెన్నై వెళ్లే బస్సులు సూళ్లూరుపేట మీదుగానే వెళ్తాయి. తిరుపతి నుంచి బస్సులు, ట్యాక్సీల్లో ఇక్కడికి చేరుకోవచ్చు.

– దేవేంద్రరెడ్డి కల్లిపూడి, న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

ఇవీ చూడొచ్చు..

- సూళ్లూరుపేట నుంచి 25 కిలోమీటర్ల దూరంలో భీమునివారిపాళెం ఓడరేవు ఉంటుంది. బోటింగ్‌కు అనుకూలం. పడవ పందేలు కూడా జరుగుతుంటాయిక్కడ.
- పనిలో పనిగా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించవచ్చు. అధికారుల అనుమతి తప్పనిసరి. సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయానికి తలుపులు ఉండవు. 24 గంటలూ.. దర్శనం లభిస్తుంది.
- సూళ్లూరుపేటకు మూడు కిలోమీటర్ల దూరంలో మన్నారుపోలూరులో అలఘుమన్నారు కృష్ణస్వామి ఆలయం ఉంది. ద్వాపరయుగంలో శమంతకమణి కోసం శ్రీకృష్ణుడికి, జాంబవంతునికి మధ్య మల్ల యుద్ధం ఇక్కడే జరిగిందని స్థలపురాణం.

ఈనాడు సినిమా

అమ్మో అనుకుంటే అంతే!


రకుల్ ప్రీత్ సింగ్

మంచి వాళ్లు.. చెడ్డవాళ్లు... ప్రతి చోటా ఉంటారు. అలాగే సినిమా రంగంలోనూ ఉంటారు. అందరి దృష్టి ఉండే రంగం కాబట్టి కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. చిత్ర పరిశ్రమలో మీకు ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కొంటుంటారు? అంటే "నాకు ఇప్పటి వరకూ భయపడి పోయేటంత సమస్యలు ఏమీ రాలేదు. అమ్మాయి, అబ్బాయి ఎవరైనా సమస్య ఎదురైతే పారిపోకూడదు. ధైర్యంగా నిలబడాలి. నాకు ఆ పని వచ్చు. వందశాతం న్యాయం చేస్తాను, దీక్షతో పనిచేయగలను అనుకుంటే ముందుకెళిపోతారు. అమ్మో నేను చేయలేను, నా వల్ల కాదు అంటూ కూర్చొంటే అంతే సంగతులు. నేను ఇలాంటి ధోరణికి చాలా దూరంగా ఉంటాను. అందుకే హాయిగా నా పని నేను చేసుకుపోతున్నాను"అని చెప్పింది. ఈ భామ ప్రస్తుతం హిందీ చిత్రం 'అయ్యారీ' చిత్రీకరణతో తీరిక లేకుండా ఉంది.

బహు నాయకా నామ సంవత్సరం


ఎన్టీఆర్ రాంచరణ్

తెరపై ఓ కథానాయకుడు కనిపిస్తే ఈలలు.. గోలలు.. హారతులు పట్టడాలు.. కాసులు కురిపించడాలు. ఊర్లో జరగాల్సిన జాతర కాస్త థియేటర్లో కనిపిస్తుంది. అదే... ఇద్దరు కనిపిస్తే..? అదుర్స్ కదూ. వన్ ప్లస్ వన్ ఆఫర్‌లా.. అద్భుతంగా ఉంటుంది. ఓ టికెట్టుపై ఇద్దరు హీరోల్ని చూడ్డమే 'మల్టీ స్టారర్'. కథ డిమాండ్ చేయాలే గానీ.. ఇద్దరు, ముగ్గురు హీరోల్ని కూడా తెరపై చూపించడానికి మన దర్శకులు సిద్ధం. పాత్ర నచ్చాలే గానీ... మరో ముగ్గురితోనైనా కలసి నటించడానికి కథానాయకులు రెడీ! అందుకే మల్టీస్టారర్ సినిమాల్ని చూసే అవకాశం దక్కుతుంది. ఈ యేడాది ఈ తరహా చిత్రాల సంఖ్య కాస్త ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. అందుకే 2018 కాస్త.. బహు నాయకా నామ సంవత్సరం అయిపోతోంది!


నాగ చైతన్య


వరుణ్ తేజ్



వెంకటేష్


శర్వానంద్


నితిన్

జనవరి 10న ఓ మల్టీస్టారర్ వస్తోంది. అదే.. 'అజ్ఞాతవాసి'. అదేంటి? ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మాత్రమే కథానాయకుడు కదా అనుకుంటున్నారేమో. ఇందులో వెంకటేష్ కూడా ఉన్నారు. ఆయన అయిదు నిమిషాల పాత్రలో తళుక్కున మెరుస్తారు. ఆ అయిదు నిమిషాలూ పవన్, వెంకీలు కలిసే కనిపిస్తారు. ఆలెక్కన ఇది మల్టీస్టారర్ కిందే లెక్క. ఆ మాటకొస్తే... వెంకీని 'మల్టీస్టారర్ ఆఫ్ ది ఇయర్'గా ముందే ప్రకటించేయొచ్చు. ఎందుకంటే ఆయన ఇప్పుడు చేస్తున్నవన్నీ దాదాపుగా ఇలాంటి కథలే. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాలో నటించనున్నారు. అది కూడా మల్టీస్టారర్ సినిమానే అనేది ఫిల్మ్‌నగర్ వర్గాల మాట. నాగచైతన్యతో కలిసి వెంకటేష్ ఓ సినిమా చేస్తున్నారు. 'సోగ్గాడే చిన్నినాయన'తో ఆకట్టుకున్న కల్యాణ్ కృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు. వెంకటేష్ - వరుణ్ తేజ్‌ల కలయికలో ఓ సినిమా రాబోతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తారు. ఇలా వెంకీ 2018ని బిజీ బిజీగా గడిపేస్తున్నారు.


నరేష్


సునీల్


నాగార్జున

నాని

ఈ యేడాది అందరి దృష్టినీ ఆకర్షించే మెగా మల్టీస్టారర్.. ఎన్టీఆర్ - రామ్ చరణ్‌లదే. ఈ చిత్రానికి ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వం వహిస్తారు. జక్కన్న ట్రాక్ రికార్డు చూస్తే ఎవ్వరికైనా కళ్లు బైర్లు కమ్ముతాయి. 'బాహుబలి' సిరీస్‌తో ఆయన రికార్డులన్నీ తుడిచేశారు. ఆయన 'ఈగ'తో సినిమా చేసినా సంచలనమే. అలాంటిది ఇద్దరు అగ్ర కథానాయకులతో కథ నడిపిస్తే ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవొచ్చు. బహుశా.. ఈతరం కథానాయకుల అతి పెద్ద మల్టీస్టారర్ సినిమా ఇదే కావొచ్చు. యువ కథానాయకులు నితిన్, శర్వానంద్‌లు కలసి 'దాగుడు మూతలు' ఆడేస్తున్నారు. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఇద్దరు యువ హీరోలకూ టాలీవుడ్‌లో మంచి మార్కెట్ ఉంది. విభిన్నమైన కథల్ని ఎంచుకుంటున్నారు. ఇద్దరూ కలిస్తే ఎంత సందడి ఉంటుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాలి. నాని నిర్మాతగా రూపొందుతున్న 'అ' కూడా ఓ విధంగా మల్టీస్టారర్ చిత్రమే. హాస్య కథానాయకులు అల్లరి నరేష్, సునీల్‌లతో భీమనేని శ్రీనివాసరావు ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సంక్రాంతికి సెట్స్‌పైకి వెళ్తుంది. మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'భరత్ అను నేను'లోనూ నరేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. నాగార్జున మల్టీ స్టారర్ కథలకు ఎప్పుడూ సిద్ధమే. ఆయన నానితో కలిసి ఓ సినిమా చేయబోతున్నారు. అశ్వనీదత్ నిర్మాతగా వ్యవహరించే ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తారు. కథ సిద్ధమైపోయింది. త్వరలోనే ఈ చిత్రం లాంఛనంగా మొదలయ్యే అవకాశాలున్నాయి. వీళ్లలానే మిగిలిన అగ్ర కథానాయకులు కూడా మరొకరితో కథని పంచుకోవడానికి ఉత్సాహం చూపిస్తే 2018లో మరిన్ని బహు నాయకా చిత్రాలు వచ్చే అవకాశం ఉంది. ఇద్దరు కథానాయకులు కలిస్తే.. వెండి తెరకి అందం రావడమే కాదు, పరిశ్రమలో ఓ ఆరోగ్యకరమైన వాతావరణానికి నాంది పలికినట్టవుతుంది. రాబోయే తరానికి స్ఫూర్తినిచ్చినట్టవుతుంది.

బన్నీ కష్టం తెరపై కనిపిస్తుంది


లగడపాటి శ్రీధర్

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మానియేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. నాగబాబు సమర్పిస్తున్న ఈ చిత్రానికి బన్నీ వాసు సహ నిర్మాత. దాదాపు మూడొంతుల చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల ఫస్ట్ ఇంపాక్ట్ టీజర్ విడుదల చేశారు. తొలి 29 గంటల్లోనే ఆన్‌లైన్‌లో కోటికిపైగా డిజిటల్ వ్యూస్ దక్కించుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. "మిలటరీ నేపథ్యంలో సాగే కథ ఇది. కుటుంబ బంధాలు, ప్రేమ, భావోద్వేగాలు ఇవన్నీ ఉంటాయి. ఈ సినిమాతో బన్నీకి 'పాన్ ఇండియా' ఇమేజ్ వస్తుంది. ఎందుకంటే దేశభక్తి అనేది ఓ ప్రాంతానికి సంబంధించిన అంశం కాదు. ప్రతి భారతీయుడి గుండెల్ని తాకే విషయం. ఈ పాత్రలో బన్నీ నటనకి తప్పకుండా కొత్త అభిమానులు ఏర్పడతారు. టీజర్‌కి వస్తున్న స్పందన చూస్తే సంతోషంగా ఉంది. తొలి ప్రచార చిత్రంతోనే ప్రేక్షకులు, అభిమానుల మనసుల్ని గెలుచుకోవాలన్నది మా ప్రయత్నం. అందుకే.. ప్రచార చిత్రంపై అంతగా దృష్టి పెట్టాం. టీజర్‌లో కథానాయకుడి పాత్రని బలంగా చెప్పాలన్నది దర్శకుడి ఉద్దేశం. అది నెరవేరింది. బన్నీ లుక్, అతని ఎనర్జీ, పాత్ర కోసం పడే తాపత్రయం టీజర్‌లో కనిపించాయి. ఈ పాత్ర కోసం అల్లు అర్జున్ చాలా కష్టపడ్డారు. అదంతా విడుదల తరవాత తెరపై కనిపిస్తుంది. బన్నీతో సినిమా అనగానే ఏ విషయంలోనూ లోటు చేయకూడదనుకున్నాం. అందుకే అర్జున్, శరత్ కుమార్‌లాంటి పేరున్న నటుల్ని తీసుకొచ్చాం. బాలీవుడ్ సంగీత దర్శకులు విశాల్ శేఖర్‌ని రంగంలోకి దింపాం. అటు మా సంస్థలోనూ, బన్నీ కెరీర్‌లోనూ 'నా పేరు సూర్య' అత్యుత్తమ చిత్రం అవుతుందని మా నమ్మకం" అన్నారు.

ఏప్రిల్ 27నే విడుదల

ఏప్రిల్ 27... తెలుగు చిత్రసీమని ఆకర్షిస్తున్న తేదీ. 'నా పేరు సూర్య..' ప్రేక్షకుల ముందుకు వస్తున్న రోజు అది. అదే తేదీన మహేష్‌బాబు 'భరత్ అను నేను', రజనీకాంత్ '2.ఓ' విడుదల కాబోతున్నాయి. ఒకే రోజు మూడు పెద్ద చిత్రాలు ఢీ కొనబోతుండడంతో థియేటర్ల సమస్య ఉత్పన్నమవడం ఖాయం. వీటిపై లగడపాటి శ్రీధర్ స్పందించారు. "మేం మాత్రం ఏప్రిల్ 27నే వస్తున్నాం. 'భరత్ అను నేను' నిర్మాతతో చర్చించాం. మా మధ్య సయోధ్య కుదిరింది. '2.ఓ' విషయమే ఇంకా తేలలేదు. చెన్నై వెళ్లి ఆ నిర్మాతలతో మాట్లాడిన తరవాత ఓ నిర్ణయానికి వస్తాం" అన్నారు.

సాగు లేదని పొలాన్ని అమ్మితే... సాకలేదని అమ్మని అమ్మినట్లే!

చిత్రం: ఖైదీ నెం 150

- పంపినవారు: జీకే విష్ణుకుమార్, పుల్లూరు, జోగులాంబ గద్వాల్ జిల్లా

పంచ్ డైలాగ్

ఎవ్వరూ ఆపలేని వాడు మంచు వారి మనవడు


విష్ణు

ప్రముఖ నటుడు మోహన్‌బాబు ఇంటికి కొత్త ఏడాదిలో ఓ కొత్త సభ్యుడు రావడంతో ఇల్లంతా సంతోషాలతో నిండిపోయింది. ఆయన పెద్ద కుమారుడు మంచు విష్ణు, వెరోనికా దంపతులకు జనవరి 1న పండంటి మగబిడ్డ జన్మించిన విషయం తెలిసిందే. ఆ బిడ్డకు 'అవ్రామ్ భక్త' అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకొన్నారు విష్ణు. "వాడిని అరియానా 'బేబీ లయన్' అని, వివియానా 'బేబీ టెడ్డీ బేర్' అని పిలుస్తున్నారు. మేమంతా అవ్రామ్ భక్త అంటున్నాం. అవ్రామ్ అంటే ఎవ్వరూ ఆపలేనివాడు అని అర్థం" అని ట్వీటారు విష్ణు. మోహన్‌బాబు అసలు పేరు మంచు భక్త వత్సలం నాయుడు కావడంతో అందులోని భక్తని కొడుక్కి పెట్టుకున్నారు విష్ణు దంపతులు. ఈ దంపతులకు తొలి సంతానంగా ఇద్దరు కవలలు అరియానా, వివియానా జన్మించారు.

బాలయ్య డ్యాన్సులు చూసి ఆశ్చర్యపోతారు

"చిన్న సినిమాలే చిత్రపరిశ్రమకు ఆధారం. అవి లేకపోతే పరిశ్రమ ఆరు నెలల్లో మూతపడుతుంది" న్నారు సి.కల్యాణ్. తెలుగు చిత్రసీమలో నిర్మాతగా ఆయనది సుదీర్ఘమైన ప్రయాణం. పలు కీలకమైన పదవుల్లోనూ ఉన్నారు. ఇప్పుడు నిర్మాతగా నాలుగు సినిమాల్ని రూపొందిస్తున్నారు. అందులో 'జై సింహా' ఒకటి. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఈనెల 12న విడుదల అవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సి.కల్యాణ్ విలేకరులతో మాట్లాడారు.



■ "'జై సింహా' అన్ని కార్యక్రమాల్నీ పూర్తి చేసుకుంది. ఈ సినిమా ఇప్పటికే పదిసార్లు చూశాను. నందమూరి అభిమానులకు పండగలాంటి సినిమా ఇది. సంక్రాంతికి తప్పకుండా సందడి చేస్తుంది. కథ కథనాలు, దర్శకుడు తెరకెక్కించిన విధానం, సాంకేతిక నిపుణుల కృషి.. ఇవన్నీ కలసి ఈ సినిమాని ఉన్నతంగా తీర్చిదిద్దాయి. బడ్జెట్ పరిధి దాటింది. చాలా ఎక్కువగా ఖర్చు పెట్టాం. కానీ అది కథకు అవసరం. ఈ సినిమాపై నమ్మకంతో దాదాపు అన్ని చోట్లా సొంతంగా విడుదల చేస్తున్నా"

■ "ద్వితీయార్ధంలో భావోద్వేగాలకు పెద్దపీట వేశాం. పతాక సన్నివేశాలు చూశాక.. ప్రతీ ఒక్కరూ కంటతడి పెట్టుకుంటారు. బాలయ్య డాన్సులు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. యువ కథానాయకుడిలా మారిపోయి స్టెప్పులేశారు. కుంభకోణం నేపథ్యంలో సాగే యాక్షన్ ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణ. బ్రాహ్మణుల వైశిష్ట్యం చెప్పే సన్నివేశం తప్పకుండా నచ్చుతుంది. ప్రతీ బ్రాహ్మణుడూ బాలయ్యకు అభిమానిగా మారిపోతాడు. ధర్నాలు ఎందుకు చేయాలి? అని చెప్పే సన్నివేశం ఒకటుంది. అది కూడా చప్పట్లు కొట్టిస్తుంది. నయనతార, ప్రకాష్‌రాజ్ లేకపోతే ఈ సినిమా లేదు. వాళ్ల పాత్రలు కూడా గుర్తుండిపోతాయి. కె.ఎస్.రవికుమార్‌కి తమిళంలో చాలా పెద్ద క్రేజ్ ఉంది. ఈ సినిమాని అక్కడ కూడా విడుదల చేయొచ్చు. కానీ.. ఆయన 'ఈ సినిమాని నేను తమిళంలో రీమేక్ చేస్తా' అన్నారు. అందుకే తమిళ డబ్బింగ్‌పై దృష్టి పెట్టలేదు".

■ "వినాయక్ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'ఇంటిలిజెంట్' పూర్తికావొచ్చింది. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. చిరంజీవి కెరీర్‌లో 'ఖైది' సినిమాని ఎలా చెప్పుకుంటారో, సాయిధరమ్ తేజ్ విషయంలో 'ఇంటిలిజెంట్' సినిమా గురించీ అంతే గొప్పగా చెప్పుకుంటారు. 'చమకు చమకుచాం.. చుట్టుకో చుట్టుకో' పాటని ఈ సినిమా కోసం రీమిక్స్ చేశాం. పాటలు, అందులో సాయిధరమ్ స్టెప్పులూ ఆకట్టుకుంటాయి. రానాతో '1945' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తీస్తున్నాం. వేసవిలో విడుదల చేస్తాం. మరోవైపు 'సంఘమిత్ర' పనులూ జరుగుతున్నాయి"

■ "మార్చి 1న థియేటర్లని బంద్ చేయడం ఖాయం. తెలుగులోనే కాదు, దక్షిణాదిలోనూ ఈ పరిస్థితే కనిపిస్తుంది. షూటింగులు కూడా ఆగిపోతాయి. క్యూబ్, యూఎఫ్‌వోలపై మా పోరాటం కొనసాగుతుంది. జీఎస్‌టీ విషయంలో తెలుగు నిర్మాతలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానం కార్పొరేట్ సంస్థలకైతే బాగుంటుంది. వాళ్లకు సినిమా అనేది వ్యాపారం. తెలుగు చిత్రసీమలో ఓ అభిరుచితో సినిమాలు తీస్తుంటారు. క్యూబ్, యూఎఫ్‌వోలను అడ్డుపెట్టుకుని కోట్లు ఆర్జిస్తున్నారు. సినిమాలు తీసిన నిర్మాతలు నష్టపోతున్నారు. పైరసీ సమస్య కూడా ఎక్కువవుతుంది. సెల్‌ఫోన్ల వల్లే 70 శాతం పైరసీ జరుగుతోంది. థియేటర్లోకి సెల్‌ఫోన్లు అనుమతించకూడదు. ముందు కష్టం అనిపించినా మెల్లమెల్లగా అలవాటు చేయాలి"

సెలవులు అయిపోయాయ్


ప్రియాంక చోప్రా

'క్రిస్మస్ సెలవులు అయిపోయాయి... కొత్త సంవత్సరం సందడి కూడా ముగిసింది... మళ్లీ సెట్లోకి వచ్చేశాను... షరా మామూలుగానే పనిలో మునిగిపోయాన'ంటోంది ప్రియాంక చోప్రా. ఓ వైపు 'క్వాంటికో' టీవీ సిరీస్, మరోవైపు హాలీవుడ్ చిత్రాలతో అమెరికాలో బిజీగా ఉంది ఈ భామ. కొద్ది రోజుల క్రితం క్రిస్మస్, కొత్త ఏడాది సంబరాల కోసం రెండు వారాలు విరామం తీసుకుని ఇండియాకు వచ్చింది. కుటుంబ సభ్యులతో ఎంచక్కా లండన్ వెళ్లి సెలవులను ఎంజాయ్ చేసింది. ఆ తర్వాత ఏమాత్రం ఆలస్యం చేయకుండా న్యూయార్క్ విమానం ఎక్కేసింది. అక్కడ ల్యాండ్ అయిన వెంటనే మేకప్ వేసుకుని 'క్వాంటికో' సెట్‌లోకి అడుగుపెట్టింది. ఎముకలు కొరికే చలిలోనూ షూటింగ్‌లో పాల్గొంటోంది. "నేను మళ్లీ వచ్చేశాను. మూడు గంటలకు ల్యాండ్ అవడం, ఆరు గంటలకు సెట్లోకి రావడం... ఇదీ నా జీవితకథ" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ప్రియాంక. అంత బిజీలోనూ షాట్‌గ్యాప్‌లో అభిమానులతో ఫొటోలకు పోజిస్తూ ఆనందపరుస్తోందామె. ప్రస్తుతం 'ఏ కిడ్ లైక్ జాక్', 'ఈజింట్ ఇట్ రొమాంటిక్' చిత్రాల్లో నటిస్తోంది ప్రియాంక.

డిజిటల్ ప్రింటు మాయాజాలం..



ఫ్యాషన్ ఫ్యాషన్

అనార్కలీలూ, గాగ్రాచోళీలు చిన్నారులకు ఎప్పుడూ ప్రత్యేకమే. మరి వాటికి డిజిటల్ ప్రింట్ల హంగులు తోడైతే ఆ ఆకర్షణే వేరు. ఈ వస్త్రశ్రేణితో మీ ఇంటి బంగారాలు తళుక్కుమనడం ఖాయం. వారికోసం ప్రత్యేకంగా రూపొందించినవే ఈ దుస్తులు.

సీగ్రీన్ రంగు గాగ్రా మీద డిజిటల్ ఫ్లోరల్ ప్రింట్లు... స్లిట్‌తో వచ్చిన గులాబీ రంగు టాప్ ట్రెండీగా కనిపించేలా చేస్తుంది.

డిజిటల్ ప్రింటు చేసిన లేత గులాబీ గాగ్రాకు జతగా ముదురు నీలం రంగు టాప్.. దానిపై చేసిన ఫ్రెంచ్‌నాట్ ఎంబ్రాయిడరీ, కట్ స్లీవ్స్ అదనపు హంగులు.

ఆకర్షించే లేతరంగుల మేళవింపుతో డిజిటల్ ప్రింటు గాగ్రాకు మెడ దగర రంగురంగుల రాళ్లతో చేసిన ఎంబ్రాయిడరీ మరింత వన్నెతెస్తుంది.

మెరూన్ రంగు అనార్కలీకి జతగా నెట్ దుపట్టా..దానిపై పసిడి రంగు చేనేత పనితనం. దీనికి తోడు మెడ దగ్గర వచ్చిన ఎంబ్రాయిడరీ మెరిపిస్తుంది.

టస్సర్ సిల్క్‌తో చేసిన పొడవాటి సాండల్ పీచ్ రంగు గౌను..దానిపై కలిసిపోయే రంగులతో మెడా, చేతులపై ఫుల్కారీ ఎంబ్రాయిడరీ..దీనికి తోడు కట్ స్లీవ్ చేతులు ప్రత్యేకంగా కనిపిస్తాయి.

నారింజ రంగు గౌనుపై జియోమెట్రిక్ ప్రింటు.. దాని పైభాగాన పసుపు రంగు.. మెడ దగ్గర పసిడి రంగు రాళ్లూ, రంగుల పూసలతో చేసిన పనితనం ఆకట్టుకోవడం ఖాయం.

మోడల్: బేబీ సమ్రీన్, తులియా జ్యోతి, అక్షర

ఫోటోలు: దండా శ్రీనివాసరావు

ఆ మాటలు పట్టించుకుంటే ఎలా!

కాలేజీలో కావచ్చు. కార్యాలయంలో కావచ్చు.. ముగ్గురు ఓ చోట చేరితే కచ్చితంగా అక్కడ లేని వ్యక్తికి సంబంధించిన ప్రస్తావన వస్తుంది. కొన్నిసార్లు ఆ మాటలు వినడానికి సరదాగానే అనిపించొచ్చు కానీ.. ఆ మాటల వల్ల మనకూ సమస్యలు తప్పవు. అందుకే వాటికి ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేయడం మంచిది.



◆ పని వాతావరణంలో అయినా, స్నేహితులతో ఉన్నప్పడయినా మూడో వ్యక్తి చెప్పే మాటలు పట్టించుకోకుండా ఉండటమే మేలు. నమ్మి, పట్టించుకుంటే వాటి బలం పెరుగుతుందని మరవకండి.

◆ మనకు ఓ వ్యక్తికి సంబంధించిన విషయంపై సందేహం ఉండొచ్చు. అది నిజం కానప్పుడు, నిరూపితం కానప్పుడు ఇతరులతో పంచుకోకుండా ఉండటమే మేలు. కొన్ని సార్లు అలా సరదాగా పంచుకున్న విషయాలే ఇతరులకే కాదు, మనకూ కీడు చేయొచ్చు.

◆ మీమీద అనవసరంగా ఎవరైనా నింద వేశారని తెలిస్తే అసలది ఎంతవరకూ నిజమో ముందు కనుక్కునే ప్రయత్నం చేయాలి. అనవసరంగా కోపం పెంచుకోవడం కన్నా నేరుగా వెళ్లి మాట్లాడితేనే అసలు విషయం తెలిసిపోతుంది. దానికి అక్కడితో ముగింపు చెప్పినవారవుతారు.

◆ మీ మధ్య లేని వ్యక్తి గురించి ప్రస్తావన వచ్చినప్పుడు వీలైనంతవరకూ అక్కడి నుంచి జారుకోవడమే మంచిది. ఇతరులు చెప్పే ప్రయత్నం చేస్తున్నా కూడా ఆసక్తి లేదని నిర్మొహమాటంగా చెప్పేయండి.



'స్కేటింగ్ అంటే తెలుసు కానీ.. స్కేట్‌బోర్డింగా అదేంటీ'.. అన్న అమ్మాయికి ఇప్పుడు అదే శ్వాసగా మారిపోయింది. ఎంతోమంది అమ్మాయిలకు అందులో తర్ఫీదునిస్తూ ఆ ఆటకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తోంది. పేద పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇస్తోంది. ఆమే బెంగళూరుకు చెందిన అతీతా వర్గీస్. దేశంలో అతితక్కువమంది మహిళా స్కేట్‌బోర్డర్‌లలో ఆమె ఒకరు.

పేద పిల్లల్ని స్కేట్‌బోర్డెక్కిస్తుంది!

అప్పుడు వర్గీస్‌కి పంతొమ్మిదేళ్లు. ఓ రోజు ఆమె స్నేహితురాలు వర్గీస్‌ని స్కేట్ బోర్డర్లు ఉండే చోటుకు తీసుకెళ్లింది. అదో పార్కు. అక్కడికి వెళ్లాకే తెలిసిందట.. బెంగళూరులో స్కేట్‌బోర్డర్ల కోసం ప్రత్యేకంగా ఓ పార్కు ఉందని. అలా మొదటిసారి వెళ్లాక ఆమెకు ఆటపై ఆసక్తి పెరిగింది. స్నేహితురాలు స్కేట్‌బోర్డర్ల కోసం ప్రారంభించిన హోలీ స్టాక్ కలెక్టివ్‌లో ఓ సభ్యురాలిగా చేరిపోయింది. అప్పటికి స్కేట్‌బోర్డింగ్‌కు మనదేశంలో అంతగా ప్రాధాన్యం లేదు. పైగా చాలా కొత్తది. అయినప్పటికీ నేర్చుకోవడానికి సిద్ధమైంది. చాలాతక్కువ సమయంలోనే ఆటను నేర్చుకున్న వర్గీస్... ఆ తరువాత దానికి ఆదరణ తేవాలనుకుంది. దాని గురించి నలుగురికీ తెలియాలంటే కొందరు పిల్లలకు నేర్పించి వాళ్లతో ప్రదర్శన ఇప్పించాలనుకుంది. ఇందుకోసం పేదపిల్లల్ని ఎంచుకుని కొంతకాలం శిక్షణ ఇచ్చింది. క్రమంగా ఆమె ఆశించినట్లుగానే ఆటకు ఆదరణ పెరగడంతో మరో ప్రయోగం చేసింది.

విశాఖపట్నంలోనూ ఏర్పాటు..

క్రీడపై ఆమెకు ఉన్న మక్కువా, దాన్ని నేర్చుకోవాలనే తాపత్రయం, దానికోసం ఆమె పడే నిరంతర శ్రమా వృథాగా పోలేదు. ఆ క్రీడలో ఆమె ప్రత్యేకంగా నిలవడమే కాదు అనుభవజ్ఞురాలిగా మారింది. కలెక్టివ్ బృందంతో కలిసి దేశంలో ఇలాంటి స్కేటింగ్‌కి అనువుగా ప్రత్యేక పార్కులు ఏర్పాటు చేసింది. కేవలం బెంగళూరులోనే కాదు, విశాఖపట్నం, మధ్యప్రదేశ్‌లోని జన్‌వార్‌లోనూ అందుబాటులోకి తెచ్చింది. ఇవి చేస్తూనే మూడేళ్ల క్రితం సొంతంగా 'గాళ్ స్కేట్ ఇండియా' పేరుతో బెంగళూరులో ఓ సంస్థను ప్రారంభించింది. ఇందులో తొమ్మిది దేశాలకు చెందిన సభ్యులున్నారు. 'స్కేట్‌బోర్డింగ్‌కు ప్రస్తుతం ఆదరణ పెరుగుతున్నా ఇందులో అమ్మాయిలకు తగినంత ప్రాధాన్యం లేదు. అందుకే ఇందులో అమ్మాయిల సంఖ్య తక్కువ. అది గమనించాకే అమ్మాయిలు దీన్ని నేర్చుకునేలా చేయాలనుకున్నా...' అంటుంది అతీతా వర్గీస్.

అమ్మాయిలతో ప్రత్యేక యాత్ర..

వర్గీస్ మిత్రబృందం పిల్లలతో కలిసి కేరళలోని కోవలమ్ స్కేట్ క్లబ్ తరఫున పేద, బడి మానేసిన పిల్లలకు ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. దాంతోపాటూ బెంగళూరులోనూ మరికొన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఇవన్నీ పిల్లలకు స్కేట్‌బోర్డింగ్‌పై ఆసక్తి పెంచాయి... బడి మానేసిన పిల్లలు తిరిగి స్కూల్లో చేరేందుకూ ఆసక్తి చూపిస్తున్నారు. అంతేకాదు 'ద కేవ్ స్కేట్ పార్క్' పేరుతో స్కేట్‌బోర్డింగ్ నేర్చుకునే వారికోసం బెంగళూరులోనే ఓ ర్యాంప్‌ని ఏర్పాటు చేసింది. ఇవన్నీ ఒకెత్తయితే కేవలం అమ్మాయిలతోనే ప్రత్యేకంగా స్కేట్‌బోర్డింగ్ టూర్‌నీ ఏర్పాటు చేసింది. పన్నెండు మంది అమ్మాయిల్ని ఎంపిక చేసుకుని గోవా, హంపీ వరకూ వెళ్లొచ్చింది. 'కేవలం నిరుపేద అమ్మాయిల్ని ఈ క్రీడా, చదువు వైపు ప్రోత్సహించేందుకే ఈ యాత్రను ఏర్పాటు చేశాం. మొదట్లో భయపడ్డ అమ్మాయిలు తరువాత ఉత్సాహంగా పూర్తిచేశారు. 'ఇప్పుడు దాదాపు వందకు పైగా అమ్మాయిలు మా దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. అవకాశం రావాలే కానీ.. వీళ్లను పోటీలకూ పంపించాలన్న ఆలోచనా ఉంది' అని చెబుతోంది అతీతా వర్గీస్.

ముక్కుపై మచ్చలు.. ఏం చేయను?

■ **నా వయసు 35. నేను చాలా తెల్లగా ఉంటాను. నేను గృహిణిని. నా ముక్కూ, చెంపలపై తేనె రంగులో మచ్చలు వస్తున్నాయి. ఒక్కోసారి బాగా కనిపిస్తాయి. మరికొన్నిసార్లు వాటికవే తగ్గుముఖం పడతాయి. ఎండలోకి వెళ్లడం వల్ల వస్తాయని నా స్నేహితురాలు చెప్పింది. నేనసలు బయటకే వెళ్లను. మరి ఎందుకిలా అవుతోంది?**

- సునీత, హైదరాబాద్

● ఇది చాలా సాధారణంగా కనిపించే చర్మ సంబంధిత సమస్య. దీన్నే పిగ్మెంటేషన్ అంటారు. ఇవి బూడిద, ముదురు ఎరుపు రంగుల్లో ప్యాచెస్‌లా కనిపిస్తాయి. చెంపలూ, ముక్కూ, పై పెదవిపైనా, నుదురు వంటి భాగాలే కాదు చేతులమీదా కనిపిస్తాయి. మగవారితో పోలిస్తే ఈ సమస్య మహిళల్లోనే ఎక్కువ కనిపిస్తుంది. ఇది ఆసియాలో అందునా మన భారతీయుల్లో ఎక్కువ. దానికి కారణం మన శరీరంలో ఉండే మెలనోసైట్స్. కారణాలు ఇంకా పూర్తిగా తెలియదు కానీ వాటంతట అవే వచ్చి పోతుంటాయి. సాధారణంగా కుటుంబ చరిత్రలో ఎవరికైనా ఉన్నా కూడా ఇవి తరువాతి తరంలో కనిపిస్తూ ఉంటాయి. అలానే గర్భందాల్చినప్పుడూ కొన్నిసార్లు ఈ మచ్చలు వస్తాయి. అయితే ప్రసవానంతరం వాటంతట అవే తగ్గుతాయి. గర్భనిరోధక మాత్రలు తీసుకున్నప్పుడూ ఇలా కావచ్చు. అలానే మూర్ఛవ్యాధితో పాటు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మందులు వేసుకునేవారిలోనూ ఇది కనిపిస్తుంది. ఇలా మచ్చలుండి ఎండలోకి వెళ్లినప్పుడు అవి పెరుగుతాయి. బ్లీచింగ్, సౌందర్య ఉత్పత్తులు పడనివారిలోనూ ఈ మచ్చలు కనిపిస్తాయి. మీ సమస్యకు కారణాలేంటో తెలుసుకునే ప్రయత్నం చేయండి. అలాగే మాయిశ్చరైజర్‌తో పాటు సన్‌స్క్రీన్ కూడా రాసుకోవడం అలవాటు చేసుకోవాలి. కెమికల్ పీల్స్, బ్లీచింగ్‌కి దూరంగా ఉండాలి. నిజానికి ఈ సమస్య వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతుంది. అలా తగ్గని పక్షంలో ఎజిలాయిడ్, హైడ్రోక్వీనాన్, విటమిన్ సి, జింక్, టైటానియం ఆక్సైడ్ ఉన్న క్రీంలు రాసుకోవాలి. రాత్రుళ్లు రెటినాయిడ్ ఉన్న క్రీంలను వాడితే మార్పు కనిపిస్తుంది. డాక్టర్ దగ్గరకు వెళ్తే ఇవి సూచిస్తూనే మైక్రోడెర్మాబ్రేషన్ పద్ధతిలో తగ్గిస్తారు. యూవీఏ, యూవీబీ రకాల్లో సన్‌స్క్రీన్‌లోషన్ రాసుకోవాలి. ఇంట్లో కూడా చెంచా చొప్పున తేనె, పాలపొడీ, బాదం నూనె కలిపి ముఖానికి పూతలా వేసుకోవాలి. అరగంటాయ్యక కడిగేసుకోవాలి. అలానే టేబుల్ స్పూను చొప్పున టొమాటో గుజ్జూ, ఓట్‌మీల్ పొడీ, పావుకప్పు పెరుగు కలిపి పూతలా వేయాలి. ఇవన్నీ మీకు మంచి ఫలితాల్ని ఇవ్వొచ్చు.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

నజరానా

గొంతు ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీటిలో తులసి ఆకులను వేసుకుని తాగితే ఉపశమనం కలుగుతుంది.

బంగారం-వెండి


4న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	30,420	30,500
ఆర్నమెంట్	28,440	28,500
వెండి (కిలో)	39,670	39,830
విజయవాడ		
బంగారం (24క్యా)	30,400	30,500
ఆర్నమెంట్	28,300	28,300
వెండి (కిలో)	40,200	42,000
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	30,350	30,420
ఆర్నమెంట్	28,200	28,200
వెండి (కిలో)	39,900	39,900
రాజమండ్రి		
బంగారం (24క్యా)	30,020	30,150
ఆర్నమెంట్	28,070	28,210
వెండి (కిలో)	39,100	39,150
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	30,090	30,220
ఆర్నమెంట్	27,980	28,100
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
ఆర్నమెంట్ (గ్రా)	2,806	2,819
వెండి (గ్రా)	41.90	42.00


(రూ. లలో)

రంగవల్లిక

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.




17 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకూ




గుగులోత్ సునీత
హైదరాబాద్

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.



17 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకూ



కుముదిని,
యాదాద్రి

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
✦ email: vasundhara@eenadu.net

రయ్ రయ్

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
autopage@eenadu.in

మొదటి సవారీ





ఆడీయా భట్.. ఆహా

ఆలియాభట్.. టీనేజీ దాటకుండానే కుర్రాళ్ల మనసులు కొల్లగొట్టిన భామ. తండ్రి పేద్ద దర్శకుడు, నిర్మాత. డబ్బుకి కొదవలేదు. కోరుకున్న కారుని క్షణాల్లో తీసుకొచ్చి ఇవ్వగలరు. అయినా ఆలియా ఎప్పుడూ నాకు కారు కొనిపెట్టమని నాన్నని అడగలేదు. నేను సంపాదించిన డబ్బులతో కారు కొన్నప్పుడే అది నా సొంతమనే భావనతో ఉండేది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్‌తో తెరంగేట్రం చేసింది. అది హిట్. ఆపై హైవే కూడా బాగా ఆడింది. ఈ రెండు సినిమాల తర్వాతే అమ్మడు తనకు నచ్చిన ఆడి ఏ4 మోడల్ కొనేసింది. 'హియర్ కమ్స్ మై ఫస్ట్ కార్.. వోహూ ఆడీ' అని కామెంట్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటో కూడా పెట్టేసింది.

కొత్తగా.. అదిరేలా కళ్లు చెదిరేలా!

దూసుకొస్తున్నాయ్

నిన్నటిది రేపటికి బోర్...
కోరుకున్నదేదైనా కొత్తగా.. మనసుకు హత్తుకునేలా ఉండాలి...
ఈ సూత్రం ఆటోమొబైల్ రంగానికీ వర్తిస్తుందండోయ్...
అందుకే మేటి డిజైన్లతో.. ఆకట్టుకునే ఫీచర్లతో రోజుకో మోడల్ మార్కెట్‌ని ముంచెత్తుతోంది...
కొత్త ఏడాదిలో, సంక్రాంతికి అయితే ఈ ఊపు మరింతగా ఉంది...
వాహన ప్రియుల మనసు దోచుకోవడానికి రేస్‌గుర్రాల్లా దూసుకొస్తున్న కొన్ని మోడళ్లు.. వాటి ప్రత్యేకతలు ఇవిగో.

ఓ కొత్త కారు, బైక్ అందుబాటులోకి వస్తుందంటే ఎవరైనా కొత్తదనం ఆశిస్తారు. సహజమే. దానికి తగ్గట్టే సంస్థలూ పోటీ పడుతున్నాయి. చిన్న కార్ల లీడర్లు మారుతీ, హ్యుందాయ్‌ల నుంచి ఖరీదైన ఆడీ, బెంజ్‌ల వరకు అందరూ స్టైల్, డిజైన్, సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బేసిక్ మోడళ్లు మంచి మైలేజీ కోసం తపిస్తుంటే.. లగ్జరీ కార్లు, సూపర్ బైక్‌ల్లో భద్రత, ఆధునిక టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్నాయి. ఇక అన్ని కంపెనీలూ చేస్తున్న పని ఏంటంటే ఇప్పటికే తెగ పాపులర్ అయిన మోడళ్లకు కొన్ని మార్పులు చేసి ఫేస్‌లిఫ్ట్‌లంటూ, 'న్యూ' పదం జోడించి మార్కెట్లోకి వదులుతున్నాయి. మొత్తానికి గతంతో పోలిస్తే 2018 కొత్త సంవత్సరం తొలి రెండు నెలల్లో అత్యధికంగా కొత్త కార్లు, బైక్‌లు విడుదల అవుతున్నాయి. ఆ వివరాలు.



మార్కెట్‌పై పట్టు కోసం

కారు మోడల్: హోండా న్యూ బ్రియో
విడుదల: ఫిబ్రవరి 2018
ధర: రూ.4.3లక్షలు

ప్రత్యేకతలు: హ్యాచ్‌బ్యాక్ విభాగంలో మరింత పట్టు సాధించే ఉద్దేశంతో ఈ కొత్త మోడల్ తీసుకొస్తున్నామంటోంది హోండా. డిజైన్ విషయంలో భారీ మార్పులు చేసి స్టైలిష్‌గా తీర్చిదిద్దారు. క్యాబిన్ పాత బ్రియోకన్నా విశాలంగా ఉంది. ఖరీదైన కార్లకు ఉపయోగించే మోనోకోఖ్ ఛాసిస్‌ని ఉపయోగించారు. 1.5 లీటర్ల టర్బో డీజిల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.

మేటి పికప్‌తో

బైక్ మోడల్: బజాజ్ పల్సర్ ఎస్ఎస్ 400
విడుదల: ఫిబ్రవరి 2018
ధర: రూ.1.6–1.8లక్షలు

ప్రత్యేకతలు: యువతరం పల్స్ పట్టేసిన పల్సర్ మోడల్‌లో ఎస్ఎస్ 400 మరో కొత్త వేరియంట్. 2014 ఆటోఎక్స్‌పోలో తొలిసారి బైక్ ప్రియులకు కనువిందు చేసింది. గత ఆర్ఎస్ 200కి మరిన్ని మెరుగులు అద్ది మార్కెట్లోకి తీసుకురాబోతున్నారు. క్షణాల్లో పికప్ అందుకునేలా 375సీసీ, లిక్విడ్ కూల్డ్ ఫ్యుయెల్ ఇంజెక్టెడ్ ఇంజిన్ దీని సొంతం. పసుపు, నీలం రంగులు, ఎల్ఈడీ టెయిల్‌లైట్లు హంగులు. యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, అలాయ్ వీల్స్, లాటరల్ షాక్ అబ్జార్బర్లు చెప్పుకోదగ్గ ఫీచర్లు.



విదేశాల్లోంచి భారత్‌కి



మోడల్: హ్యుందాయ్ సొనాటా
విడుదల: ఫిబ్రవరి 2018
ధర: రూ.19లక్షలు

ప్రత్యేకతలు: విదేశాల్లో ఇప్పటికే పరుగులు పెడుతున్న ఈ మోడల్ రెండు నెలల్లో భారత్ రోడ్ల మీదకు రానుంది. ఇది ఆరో జనరేషన్ కారు. ఫ్లూయిడిక్ డిజైన్ కాన్సెప్ట్, నాలుగు సిలిండర్లతో 2.2లీటర్ల పవర్‌ఫుల్ ఇంజిన్ ఈ కారు ప్రత్యేకతలు. సెడాన్ విభాగంలో ఉన్న లగ్జరీ కారు ఇది అంటోంది హ్యుందాయ్.

మరిన్ని

- మారుతిసుజుకీ న్యూస్విఫ్ట్ (జనవరి2018), ధర: రూ.5–7లక్షలు
- హీరో హెచ్ఎక్స్250ఆర్ (ఫిబ్రవరి 2018), ధర: రూ.1.8లక్షలు
- హ్యుందాయ్ హెక్సా (ఆగస్టు 2018), ధర: రూ.7–9లక్షలు
- హోండా సీబీ500 ఎక్స్ (ఫిబ్రవరి 2018), ధర రూ.4.5–4.8లక్షలు
- ఆడీ క్యూ2 (జనవరి 2018), ధర: రూ.28–32 లక్షలు
- రాయల్ ఎన్‌ఫీల్డ్ 750సీసీ (ఫిబ్రవరి 2018), ధర:రూ.3–3.5లక్షలు
- లెక్సస్ ఎల్ఎస్ 500హెచ్ (జనవరి 2018), ధర:రూ.1.5– 1.85కోట్లు
- హీరో డేర్ (ఫిబ్రవరి 2018), ధర: రూ.56–61వేలు
- నిస్సాన్ కిక్స్ (ఫిబ్రవరి 2018), ధర: రూ.8–11లక్షలు
- సుజుకీ జీఎస్ఎక్స్- 250ఆర్: ధర రూ.3–4లక్షలు
- బీఎండబ్ల్యూ 6సిరీస్ (ఫిబ్రవరి 2018), ధర: రూ.65–75 లక్షలు
- యమహా డిలైట్ (ఫిబ్రవరి 2018) ధర: రూ.50వేలు– 55వేలు
- డాట్సున్ ఆన్ డీవో (ఫిబ్రవరి 2018), ధర: రూ.4–6లక్షలు
- బజాజ్ చేతక్ (మార్చి 2018), ధర: రూ.60–65వేలు
- స్యాంగ్‌యాంగ్ రోడియస్ (మార్చి 2018), ధర: రూ.24–26 లక్షలు
- ట్రయంఫ్ స్ట్రీట్ కప్ (ఫిబ్రవరి 2018), ధర: రూ.8లక్షలు–8.5లక్షలు



యాభై కిమీల మైలేజీ

బైక్ మోడల్: బెనెల్లీ టీఎన్‌టీ 135
విడుదల: మార్చి 2018, ధర: రూ.1.5–2లక్షలు

ప్రత్యేకతలు: మధ్యస్థాయి బైక్‌ల మార్కెట్లో వాటా పెంచుకుంటున్న బెనెల్లీ తరచూ కొత్త మోడళ్లు విడుదల చేస్తోంది. ఈ ఊపులోనే వస్తున్న బైక్ టీఎన్‌టీ 135. 135సీసీ సింగిల్ సిలిండర్, డబుల్ స్పార్క్ ఇంజిన్, లైట్‌వెయిట్ లాటిస్ ఫ్రేమ్ దీని ప్రత్యేకతలు. యాభై కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని చెబుతున్న ఈ మోడల్‌ని మొదటిసారి 2016 ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించారు.

మరింత రిచ్‌గా

మోడల్: మెర్సిడెస్ బెంజ్ జీఎల్‌సీ కూప్
విడుదల: జనవరి 2018
ధర: రూ.50–60లక్షలు

ప్రత్యేకతలు: తమ సంప్రదాయానికి భిన్నంగా స్పోర్ట్ లుక్ డిజైన్‌తో ఈ మోడల్‌ని రూపొందించింది మెర్సిడెస్ బెంజ్. ఏబీఎస్, ఎయిర్‌బెలూన్‌లాంటి అంశాల్లో రాజీ పడలేదు. ఏడు అంగుళాల తాకే తెర, నాణ్యమైన లెదర్‌తో ఉన్న డాష్‌బోర్డ్ లోపలిభాగం రిచ్‌గా కనిపిస్తోంది. ఎకో, కంఫర్ట్, స్పోర్ట్, స్పోర్ట్‌ప్లస్, ఇండివుడ్యువల్ అనే ఐదు డ్రైవింగ్ మోడ్‌లున్నాయి. మూడు రంగుల్లో ఎల్ఈడీ లైట్లు మరో ఆకర్షణ.



అందుబాటులో మరోటి



బైక్ మోడల్: హోండా పీసీఎక్స్ 125
విడుదల: ఫిబ్రవరి 2018
ధర: రూ.85వేలు–1.1లక్షలు

ప్రత్యేకతలు: గేర్లు లేని విభాగంలో తన కిరీటాన్ని మరింత పదిలం చేసుకునే ఉద్దేశంతో ఈ మోడల్ తీసుకొస్తోంది హోండా. విదేశాల్లో ఇది ఇప్పటికే పాపులర్ అయింది. మొదటిసారి 2014 ఆటో ఎక్స్‌పోలో తళుక్కుమంది. ఇంధనం ఆదా చేయడానికి తేలికగా స్టాప్, స్టార్ట్ అయ్యే మీట అమర్చారు. 96కిమీల అత్యధిక వేగంతో దూసుకెళ్తుంది. రైడింగ్ తేలిక చేసేలా స్మార్ట్ నావిగేషన్ ఉపయోగపడుతుంది.

చిన్న విభాగంలో దూకుడుగా

కారు మోడల్: టాటా పెలికాన్
విడుదల: ఆగస్టు 2018, ధర: రూ.3–4లక్షలు

ప్రత్యేకతలు: కాంపాక్ట్ సెగ్మెంట్‌లో తన స్థానం పదిలం చేసుకునే ఉద్దేశంతో నానోకి మరిన్ని మెరుగులు దిద్ది ఈ మోడల్ తీసుకొస్తున్నారు. రెనాల్ట్ క్విడ్, మారుతి ఆల్టో 800కి పోటీగా రాబోతోంది. దీని డిజైన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 1.2లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.



వాహన సురక్ష

థర్డ్‌పార్టీ బీమా.. ఆదుకునే హస్తం

థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ గురించి చాలాసార్లు విన్నాం. దీని ఉపయోగాలేంటి? ఇది ఎందుకు అవసరం?

– బాబ్జీ, పాలకొల్లు

ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి అనే నిబంధన ఉంది. అందులో ప్రధానమైంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్. వాహన యజమానిని ఫస్ట్ పార్టీ, బీమా కంపెనీని సెకండ్ పార్టీ అంటారు. వాహనానికి ఏ సంబంధం లేని బయటివారే థర్డ్ పార్టీ. ఈ బీమానే 'ఎ' పాలసీ లేదా 'యాక్ట్ పాలసీ' అంటారు. ఈ బీమా ఉన్న వాహనం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగి.. ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డా, మరణించినా, వస్తుసామగ్రి నష్టపోయినా పరిహారం దక్కుతుంది. అయితే వాహనంలో ప్రయాణించేవారికి జరిగే నష్టానికి ఎటువంటి పరిహారం అందదు.



మామూలుగా థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం తక్కువే. టూవీలర్స్‌కి వందల్లో, నాలుగు చక్రాల వాహనానికి మూడు, నాలుగు వేల రూపాయలు మించదు. కానీ కొందరు డబ్బులు మిగుల్చుకునే ఉద్దేశంతో తక్కువ ప్రీమియం ఉన్న పాలసీ ఎంచుకుంటారు. ఇది సబబు కాదు. ఏదైనా ప్రమాదం జరిగి వస్తువులకు నష్టం జరిగితే బీమా కంపెనీల చట్టం నిర్దేశించినట్టుగా ఇలాంటి పాలసీలకు కేవలం ఆరువేల రూపాయలు మాత్రమే పరిహారం దక్కుతుంది. మిగతా నష్టాన్ని వాహనదారే భరించాలి. ప్రస్తుత గణాంకాల ప్రకారం ద్విచక్రవాహనదారులు యాభై నుంచి అరవైశాతం, నాలుగు చక్రాల వాహనదారులు ముప్పై నుంచి నలభైశాతం బీమా లేకుండానే వాహనాలు నడుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. పైగా థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ చేయించినట్లైతే మన కారణంగా ఎవరైనా ప్రమాదానికి గురైతే, చనిపోతే బీమా పరిహారం అందడంతో వారి కుటుంబాన్ని ఆ రకంగానైనా ఆదుకున్నామనే సంతృప్తి మిగులుతుంది.

– నరేశ్ భైరపనేని

మెకానిక్ గురూ

నా కారు నా ఇష్టం కాదా?

■ **నా అభిరుచికి అనుగుణంగా కారుకి కొన్ని మార్పులు చేర్పులు చేయాలనుకుంటున్నాను. అయితే వీటికీ నియమనిబంధనలు ఉంటాయనీ.. అతిక్రమిస్తే రవాణాశాఖ అధికారులు, పోలీసులు అభ్యంతరం చెబుతారని తెలిసింది. నిజమేనా? మోడిఫికేషన్ ఎంతవరకు ఆమోదయోగ్యం?**

– సుబ్బారెడ్డి, నంద్యాల

భారతీయ ఆటోమొబైల్ పరిశోధక సంస్థ (ఏఆర్ఏఐ), రవాణాశాఖలు ఎలాంటి వాహన మార్పులను ఒప్పుకోవు. ప్రయాణికుల భద్రత, రక్షణ ప్రమాణాల ప్రకారమే ప్రతి వాహనం తయారవుతుంది. దీనికోసం ప్రతి వాహన తయారీదారుడు ఏఆర్ఏఐ అనుమతి తీసుకోవాలి. పరీక్షలు ఎదుర్కోవాలి. ఇక మీ కారుని ముస్తాబు చేసేలా, సామర్థ్యం పెంచుకునేలా కొన్ని మార్పులు చేసుకోవచ్చు. ఇది అసలైన రూపాన్ని మార్చకూడదనేది నిబంధన. దీన్ని అతిక్రమించడం నిబంధనలకు విరుద్ధమేకాదు.. ఒకవేళ కారుకి ఎలాంటి ప్రమాదం జరిగినా బీమా సంస్థలు పరిహారం చెల్లించవు. కారు మాడిఫికేషన్ చేయించేటప్పుడు రవాణాశాఖ అనుమతించిన మేరకే మార్పులు చేయమని కచ్చితంగా చెప్పండి.

■ **సాధారణంగా నా బైక్ మొదటి కిక్‌కే స్టార్ట్ అవుతుంది. అలా జరగలేదంటే ఎన్నిసార్లు కిక్ కొట్టినా స్టార్ట్ కావడం లేదు. అరగంట, గంట విరామం ఇచ్చి ప్రయత్నిస్తే మళ్లీ మొదటి కిక్‌కే స్టార్ట్ అవుతోంది. సమస్యేంటి?**

– చరణ్, హైదరాబాద్

బైక్‌ని స్వయంగా పరిశీలిస్తేగానీ ఏమైందో చెప్పలేం. మీరిచ్చిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం..



- ఇగ్నిషన్ కాయిల్ చెడిపోయి ఉండొచ్చు
- స్పార్క్‌ప్లగ్ లెడ్ చిరిగిపోయిందేమో ఓసారి చెక్ చేయండి. ఇలాగైతేనే అసహజంగా ప్రవర్తిస్తుంది.
- స్పార్క్‌ప్లగ్‌లో ఏవైనా గ్యాప్‌లున్నాయేమో చూడండి.

– సాయిభరత్ బొప్పరాజు, మోటోఫిక్స్

(ఇలాంటి సమస్యలు మీకూ ఉంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)

రికార్డు

20 ఏళ్లలో 36 లక్షలు


సెడాన్ విభాగంలో అత్యధిక అమ్మకాలతో దుమ్ము రేపిన కారు హోండా సిటీ. ఈ మోడల్ వినియోగదారుల గుమ్మం తొక్కి ఇరవై ఏళ్లు పూర్తైంది. అంకెల్లో దాని రికార్డులు.

1998
మొదటిసారి హోండా సిటీ మార్కెట్లోకి వచ్చిన ఏడాది

36 లక్షలు
ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన హోండా సిటీ కార్లు

60
హోండా సిటీ చక్కర్లు కొడుతున్న దేశాల సంఖ్య

1 ర్యాంకు
జేడీ పవర్ ఇనీషియల్ క్వాలిటీ స్టడీలో హోండా సిటీ స్థానం



234
హోండా సిటీ ఔట్‌లెట్లు ఉన్న నగరాలు

నాలుగో జనరేషన్
మూడుసార్లు ముస్తాబు పూర్తి చేసుకొని ప్రస్తుతం నాలుగో తరం మార్కెట్లో ఉంది.

పల్లె ప్రగతికి ఆధునిక సాంకేతికత

- మంత్రి నారా లోకేష్ వెల్లడి



జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నారా లోకేష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

తెనాలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు అర్జీలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా వారికి అన్ని వసతులు కల్పించటం, సమస్యలు పరిష్కరించటం ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో గురువారం జరిగిన 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చేపట్టిన పరిశుభ్రతాపరమైన సమస్యల వల్ల ఏ ఒక్కరికీ డెంగీ, మలేరియా రావటానికి వీల్లేదని, ఆ మేరకు పనులు చేయాలని తనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు ఏర్పాటు, మురుగు కాలువల్లో పూడికలు తొలగించడం, కాలువల వెంట పిచ్చిచెట్లు తీసివేయించటం, దోమల నివారణకు ఫాగింగ్ చేయించటం వంటి పనులను ప్రణాళికాబద్ధంగా మొదలుపెట్టామన్నారు. ఈ కార్యక్రమాలు సరిగ్గా అమలు అవుతున్నాయా? లేదా? అని పర్యవేక్షించటానికి పూర్తి సాంకేతికతను వినియోగిస్తామని.. ప్రతి విషయాన్ని నేరుగా ముఖ్యమంత్రి కూడా తెలుసుకోగలుగుతారని వివరించారు. 2018 డిసెంబరు నాటికి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామాల్లో ఆధునిక ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు నూతన ఏడాదిలో పూర్తవుతుందని, ఏ ఊర్లో, ఏ వీధిలో దీపం వెలగకపోయినా తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. టెన్ స్టార్స్ కార్యక్రమం ద్వారా గ్రామాలకు గ్రేడ్లు ఇవ్వనున్నామని, వాటి ఆధారంగా సాధించాల్సిన లక్ష్యాలపై స్పష్టత ఉంటుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, జన్మభూమి ప్రత్యేకాధికారి ప్రవీణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల 'సంక్షేమ నిధి'పై తకరారు

- కొన్ని మార్పులు చేసిన ఏపీ
- అభ్యంతరం తెలిపిన తెలంగాణ

ఈనాడు అమరావతి: న్యాయవాదులు, వారి దగ్గర ఉండే గుమస్తాల సంక్షేమం కోసం ఉద్దేశించిన నిధి విభజనపై గందరగోళం నెలకొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సమయంలో, అందుకు ఉద్దేశించిన చట్టంలో 'ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంక్షేమ నిధి'పై ప్రస్తావన లేదు. 9, 10 షెడ్యూళ్లలో ఈ నిధిని చేర్చలేదు. రాష్ట్ర హైకోర్టు విభజన కాకపోవడంతో ఏపీ, తెలంగాణల మధ్య ఉమ్మడిగానే నిధి కొనసాగుతోంది. నిధి నిర్వహణకు సంబంధించిన కమిటీకి ఎక్స్‌అఫిషియో ఛైర్మన్‌గా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ వ్యవహరిస్తారు. రాష్ట్ర న్యాయశాఖ నుంచి ఇద్దరు, హైకోర్టు రిజిస్ట్రార్, ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమల నుంచి ఒక్కో అడ్వకేట్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ సంక్షేమ నిధిలో ఉన్న మొత్తంతో న్యాయవాదుల వైద్య అవసరాలకీ, ఇతర సమస్యలకీ సహాయం చేస్తారు. సభ్యులెవరైనా మరణిస్తే రూ.3 లక్షల వరకూ ఆర్థిక సాయం చేస్తారు. సంక్షేమ నిధి కమిటీని రెండుగా విభజించాల్సి వచ్చింది. ఏపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టానికి సవరణలు చేసి అడ్వకేట్ జనరల్‌కు బాధ్యతలు అప్పగించాలని పేర్కొంది. అలాగే ఈ నిధి కోసం కోర్టు కేసుల్లో అతికించే రూ.50 స్టాంపు మొత్తాన్ని రూ.100 చేశారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య గందరగోళం నెలకొంది. చట్ట సవరణలకు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు తెలియచేస్తోంది. ఇంకా విభజన జరగనందున ఏ విధంగా సవరణలు చేస్తారని ప్రశ్నిస్తోంది. ఇందుకు సంబంధించిన అభ్యంతరాలను గవర్నర్‌కు తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది.

నాలుగేళ్లలో పొగ లేని రైల్వే

- ఐఆర్ఎఫ్‌సీ ఎండీ పట్టనాయక్



ఈనాడు, విశాఖపట్నం: పర్యావరణంపై దుష్ప్రభావం లేకుండా సమూల మార్పులకు భారతీయ రైల్వే పకడ్బందీ ప్రణాళికలతో ముందుకెళ్తోందని ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) ఎండీ ఎస్.కె.పట్టనాయక్ వెల్లడించారు. గురువారం విశాఖ వచ్చిన ఆయన రైల్వే విశ్రాంతి భవనంలో విలేకరులతోనూ, 'ఈనాడు'తోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కోసం ఐఆర్ఎఫ్‌సీ నిధులు ఖర్చుపెడుతోందని, రానున్నరోజుల్లో రూ. 12 వేల కోట్ల పెట్టుబడుల్ని సేకరించాలనే లక్ష్యంగా ఐఆర్ఎఫ్‌సీ ముందుకెళ్తోందని పట్టనాయక్ వెల్లడించారు. రైల్వే వృద్ధిలో భాగంగా తమ పెట్టుబడుల ప్రాధాన్యాల్ని తెలిపారు. ఆ వివరాలు.

.. రాబోయే నాలుగేళ్లలో దేశంలోని అన్ని రైల్వే లైన్లను విద్యుదీకరించే ప్రణాళిక అమలవుతోంది. ఇప్పటికి 42 శాతం లైన్లను విద్యుదీకరించాం. మొత్తం వ్యయం రూ.35 వేల కోట్లు. ఇది పూర్తయ్యేలోపే డీజిల్‌తో నడిచే లోకోలను విడతలవారీగా తప్పిస్తారు. తర్వాత పొగ లేని లోకోలు నడిచే పట్టాల్నే చూడగలుగుతాం. ప్రస్తుతం ఈ ప్రక్రియ మొదలైంది. దీని వల్ల రైలు వేగం పుంజుకోవడంతో పాటు, అవి స్టేషన్లకు చేరే సమయాల్లో కచ్చితత్వం వస్తుంది. దీనికి ఐఆర్ఎఫ్‌సీ పెద్దఎత్తున నిధులు ఇస్తోంది. భారతీయ రైల్వే ప్రత్యామ్నాయ ఇంధన వనరుల మీద పూర్తిస్థాయిలో దృష్టిపెట్టింది. గ్రిడ్‌బాండ్ల పేరుతో పెట్టుబడులనూ ఆహ్వానిస్తున్నాం. ఏటా రైల్వే ఖర్చుపెట్టే నిధుల్లో ఐఆర్ఎఫ్‌సీ రుణాలు 75 శాతం వరకు ఉన్నాయి. వీటిని 100 శాతం చేయాలనేది మా ఆలోచన. క్షేత్రస్థాయిలో సిగ్నలింగ్, పట్టాల వ్యవస్థ అత్యాధునికంగా ఉంటేనే ప్రమాదాలు పూర్తిగా తగ్గుతాయి. పట్టాలకు లేజర్ వాడి ప్రమాదాల్ని ఎలా నివారించవచ్చనేదానిపై పరిశోధనలు జరుగుతున్నాయి. భద్రత కోణంలో అత్యాధునిక ఎల్‌బీహెచ్ కోచ్‌లకు పెద్దఎత్తున నిధులు ఇచ్చేందుకు మేం ముందుకొస్తున్నాం.

అనాథ శవం.. అసంపూర్తి ఖననం!

- చెయ్యి బయటకు కనిపించటంతో భయాందోళనలు



శ్మశానంలో బయటపడిన మృతదేహం చెయ్యి

ఆకివీడు, న్యూస్‌టుడే: అదో అనాథ శవం.. అడిగేవారు ఎవరులే అనుకున్నారేమో.. ఆదరాబాదరా రాత్రిపూట పూడ్చిపెట్టి పోయారు. కానీ మృతదేహానికి సంబంధించి ఓ చెయ్యి బయటకు వచ్చి ఉండటంతో మరుభూమి సమీప స్థానికులు భయాందోళనలకు గురయ్యారు..

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు శ్రీనగర్ కాలనీలోని హిందూ శ్మశానవాటికలో ఈ పరిస్థితి వెలుగుచూసింది. దీనిపై స్థానిక పోలీసులు, పంచాయతీ అధికారులకు సమాచారమివ్వగా.. ఆ పని భీమవరం రైల్వే పోలీసులు చేసివుంటారని భావించి వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు ఆకివీడు వచ్చి మృతదేహాన్ని పూర్తిస్థాయిలో పూడ్చారు. జనవరి 1న రాత్రిపూట ఖననం చేయడంతో ఈ సమస్య తలెత్తిందని, అది అనాథ శవంగా గుర్తించామని వివరించటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఏపీఐఐసీకే వ్యవసాయ వర్సిటీ భవన నిర్మాణ బాధ్యత

ఈనాడు, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ భవన నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వసతుల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో దీన్ని చేపట్టనున్నారు. నిర్మాణానికి సంబంధించి గతంలోనే ఆకృతులు ఖరారైనా ఏపీఐఐసీకి పనుల అప్పగింతపై సందిగ్ధత నెలకొంది. 15శాతం చొప్పున రుసుములు చెల్లించాలని సంస్థ పట్టుబట్టింది. అంత ఇవ్వలేమని విశ్వవిద్యాలయం భీష్మించింది. చివరకు విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు వెళ్లింది. ఆయన 3శాతం చొప్పున రుసుములు ఇచ్చేలా నిర్ణయించారు. దీంతో వచ్చేవారం ఏపీఐఐసీతో ఒప్పందం జరగనుందని ఉపకులపతి దామోదర్‌నాయుడు తెలిపారు. విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే రూ.135కోట్లు ఇచ్చింది. ఇందులో రూ.90 కోట్ల వ్యయంతో భవనాలు నిర్మిస్తారు. రూ.10 కోట్లతో రహదారులు, మౌలిక వసతులు కల్పిస్తారు. వస్తుసేవల పన్ను 18 శాతం ఉండటంతో భవన విస్తీర్ణాన్ని కుదించనున్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమను కీలక రంగంగా గుర్తించి రెండేళ్ల క్రితం దేశంలోనే అత్యుత్తమ విధానాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ది ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆహార శుద్ధి పరిశ్రమపై 3రోజుల అవగాహన సదస్సును విజయవాడలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెగా ఫుడ్‌పార్కు, శీతల గోదాములను అభివృద్ధిచేసి ఆహార శుద్ధి యూనిట్ల విస్తరణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 351 ఒప్పందాల ద్వారా రూ.10,551 కోట్ల పెట్టుబడిని సాధించగలిగామన్నారు. ఐదేళ్లలో మరింత సమర్థంగా అమలయ్యేలా చూస్తామని వెల్లడించారు. ఆహారశుద్ధి విభాగం కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్ మాట్లాడుతూ మత్స్య, మాంస ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. కస్టమ్స్ కమిషనర్ కోక సుధ జీఎస్టీ విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సి అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, ఆహారశుద్ధి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ భాస్కరరెడ్డి, ఫ్యాప్సి కార్యదర్శి టీఎస్ అప్పారావు, ఉపాధ్యక్షుడు కరుణేంద్ర ఎస్.జాస్తి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శనను దినేష్‌కుమార్ పరిశీలించారు.

జన్మభూమికి చక్కని స్పందన: పరకాల

ఈనాడు, అమరావతి: గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి చక్కని స్పందన లభిస్తోందని, సభలకు హాజరయ్యే ప్రజల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనమని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ హాజరవుతున్న వారిలో ఎక్కువమంది ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం వినతులు ఇస్తున్నారని తెలిపారు. గత మూడు రోజుల వ్యవధిలో 3,00,570 మంది వినతులిచ్చారని, 5,32,336 మంది జన్మభూమి సభలకు హాజరైనట్లు ఆయన వివరించారు. గత మూడు రోజుల వ్యవధిలో కొత్తగా 59,808 రేషన్ కార్డులు, 30,759 పింఛన్లు, 9,420 ఇళ్ల స్థలాలు, మరో 10,126 పనిముట్లు అర్హులైన వారందరికీ అందజేశామని పరకాల తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో 5,256 వైద్య శిబిరాలు నిర్వహిస్తే 3,08,677 మంది ప్రజలు సేవలు పొందారని వివరించారు. పశు వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విశాఖ జిల్లా నర్సీపట్నం, విజయనగరం జిల్లా బొబ్బిలిలో నిర్వహించే జన్మభూమి సభల్లో పాల్గొంటారని తెలిపారు.

మతాల మధ్య చిచ్చుకు తల్లీ, పిల్ల కాంగ్రెస్‌ల యత్నం

ఈనాడు, అమరావతి: మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు స్వార్థపరులు చేస్తున్న ప్రయత్నాలపై ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఎంఏ షరీఫ్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం తల్లి, పిల్ల కాంగ్రెస్‌ల కుట్రని పేర్కొన్నారు. వాస్తవాలు గ్రహించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం లాలాచెరువు మసీదు మౌజాన్ మహ్మద్ ఫరూఖ్ హత్యకేసును మూడు రోజుల్లో ఛేదించి నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులను ఆయన అభినందించారు.

ఎంసెట్ అభియోగపత్రంలో జేఎన్‌టీయూ!

- సంచలన కేసులో కీలక మలుపు
- వచ్చేవారం కోర్టులో దాఖలు చేసే అకాశం

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన ఎంసెట్ కేసు కీలక మలుపు తిరుగుతోంది. అభియోగపత్రంలో హైదరాబాద్ జేఎన్‌టీయూ పేరు చేరనుంది. ఆ వర్సిటీకి చెందిన పలువురు అధికారులను ఇందులో సాక్షులుగా పేర్కొననున్నట్లు సమాచారం. వైద్య కళాశాలల్లో ప్రవేశానికి తెలంగాణ ప్రభుత్వం 2016లో నిర్వహించిన ఎంసెట్-2 ప్రశ్నపత్రం ముందుగానే బహిర్గతమైన వ్యవహారం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. జేఎన్‌టీయూ రూపొందించిన ప్రశ్నపత్రాన్ని దిల్లీలోని ఒక ప్రైవేటు సంస్థలో ముద్రించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన శివబహద్దూర్ సింగ్ ముఠా ముద్రణ సంస్థలోని ఉద్యోగులను లోబరచుకొని ప్రశ్నపత్రాన్ని బయటకు తెచ్చింది. దీన్ని అమ్మి రూ.కోట్లు కూడగట్టుకున్నారు. ఇది బయటపడడంతో సీఐడీ దర్యాప్తు మొదలుపెట్టింది. అనేక మలుపులు తిరిగిన ఈ కేసు చివరకు వారణాసిలో ఎస్బీ సింగ్ అరెస్టుతో కొలిక్కి వచ్చింది. ఎస్బీ సింగ్‌తోపాటు దాన్ని విద్యార్థులకు అమ్మి, ఆ ప్రశ్నపత్రానికి అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మధ్యవర్తులతో కలిపి మొత్తం 50 మందికిపైగా నిందితులను అరెస్టు చేశారు. మొత్తం 210 మంది విద్యార్థులు దీనిద్వారా లబ్ధి పొందినట్లు గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కూడా అరెస్టు చేయాలని భావించారు. కాని సాంకేతిక కారణాల దృష్ట్యా వారిని సాక్షులుగా మాత్రమే చేర్చాలని నిర్ణయించారు. ఆధారాలన్నీ క్రోడీకరించుకొని అభియోగపత్రాలు సిద్ధం చేశారు. అయితే అభియోగపత్రాలను పరిశీలించిన ఒక ఉన్నతాదికారి అందులో జేఎన్‌టీయూ పాత్ర గురించి పెద్దగా ప్రస్తావించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

వర్సిటీకి నోటీసులు

ఎంసెట్‌లో ప్రశ్నపత్రం రూపొందించడం దగ్గర నుంచి దాన్ని ముద్రించడం, పరీక్ష నిర్వహించడం, మూల్యాంకనం, చివరకు ఫలితాలు వెల్లడించడం వరకూ జేఎన్‌టీయూదే బాధ్యత. ఫలానా ముద్రణ సంస్థలోనే ప్రశ్నపత్రం ముద్రిస్తున్నారన్న విషయం నిందితులకు ఎలా తెలిసిందన్నది ప్రశ్న. ఇందుకోసం పరీక్ష నిర్వహించే ప్రక్రియ గురించి ఆ వర్సిటీ అధికారులను ప్రశ్నించి వారిచ్చే సమాధానాలను కూడా పేర్కొనాలని, లేకపోతే అభియోగపత్రం అసంపూర్తిగా ఉంటుందని ఆ అధికారి సూచించినట్లు తెలుస్తోంది. దాంతో మొత్తం ఎంసెట్ ప్రక్రియ, అందులో ఎవరెవరు ఎలాంటి పాత్ర పోషిస్తారు అన్న వివరాలకు సంబంధించి సీఐడీ అధికారులు జేఎన్‌టీయూకు నోటీసులు జారీ చేశారు. దీనికి వర్సిటీ అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ వివరాలను కూడా పేర్కొంటూ సీఐడీ అభియోగపత్రాలు సిద్ధం చేసింది. ఇందులో పరీక్ష నిర్వహణలో పాలుపంచుకున్న జేఎన్‌టీయూ అధికారులను కూడా సాక్షులుగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. వచ్చేవారం అభియోగపత్రాలను దాఖలు చేసే అవకాశం ఉంది. దాంతో దాదాపు సంవత్సరంన్నర పాటు సాగిన ఎంసెట్ దర్యాప్తు ఒక కొలిక్కి వచ్చినట్లే.



ఉత్తరాన్ని పెట్టెలో వేస్తున్న అన్నాహజారే

రక్తదానాన్ని జాతీయ కార్యక్రమంగా ప్రకటించాలి

ఉత్తరాల ఉద్యమం ప్రారంభించిన అన్నాహజారే

గంగావతి (కర్ణాటక), న్యూస్‌టుడే: చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు పల్స్‌పోలియో నిర్వహిస్తున్న తరహాలోనే రక్తదానాన్ని జాతీయ కార్యక్రమంగా ప్రకటించాలని సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే ప్రధానికి విజ్ఞప్తి చేశారు. కొప్పళలోని గవి సిద్దేశ్వర రథోత్సవంలో బుధవారం పాల్గొన్న ఆయన గురువారం అక్కడే మరో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం కొరత తీర్చేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానాన్ని జాతీయ కార్యక్రమంగా ప్రకటించాలని కోరుతూ ప్రధాని మోదీకి లేఖ రాసి డబ్బాలో వేశారు. కార్యక్రమాన్ని కొప్పళ జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ, జీవదాన గెళెయర బళగ చేపట్టింది. రక్తదానాన్ని జాతీయ కార్యక్రమంగా ప్రకటిస్తే దాతల సంఖ్య పెరిగి ఎందరికో మేలు జరుగుతుందని కొప్పళ రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ హ్యాటి అభిప్రాయపడ్డారు.

మెగాసీడ్ పార్కు సంస్థ ఛైర్మన్‌గా సీఎం

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా తంగెడంచం మెగా సీడ్‌పార్కుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక వాహక సంస్థ(ఎస్‌పీవీ) ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక మంత్రి ఉపాధ్యక్షుడిగా, వ్యవసాయ మంత్రి కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా ఉంటారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా, మరో 13 మంది సభ్యులుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విత్తన పార్కులో భాగంగా విత్తన పరిశోధన, ఆవిష్కరణలు తదితర కార్యక్రమాలు చేపడతారు. అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం.. పార్కు ఏర్పాటుకు సహకారం అందించనుంది. దీనిపై ఇప్పటికే ఒప్పందం కుదిరింది.

మార్చిలోగా రిజర్వేషన్లు కల్పించాలి

15 శాతం కల్పిస్తేనే కాపులకు న్యాయం: ముద్రగడ



గుంటూరు,తిరుపతి, న్యూస్‌టుడే: కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పిస్తారని.. అలస్యమైనా న్యాయం చేస్తారని అనుకుంటున్నామని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. గురువారం తిరుపతిలో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్‌తో ఆయన భేటీ అయ్యారు. గుంటూరు, తిరుపతిలలో ముద్రగడ మీడియాతో మాట్లాడారు. నా జాతి సోదరుడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి బీసీ ధ్రువీకరణ పత్రం పొందిన రోజునే మాకు అసలైన పండుగ రోజని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమానికి తాత్కాలిక విరామమని, మార్చి 31 నాటికి పూర్తి స్థాయిలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏప్రిల్‌లో ఉద్యమంలోకి వస్తామన్నారు. 15 శాతం రిజర్వేషన్ సాధిస్తేనే తమ సామాజిక వర్గంలోని అణగారిన ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందుకోసం తమకు మద్దతిచ్చే ప్రతి ఒక్కరితో, రాష్ట్ర నేతలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికార పార్టీలో కిందిస్థాయి నేతలు సహకరిస్తున్నారని తెలిపారు. భాజపా, వైకాపా, కాంగ్రెస్ పార్టీ నేతలు మద్దతు ప్రకటించారన్నారు. జనసేన అధినేతను తాను నేరుగా ఎప్పుడూ కలవలేదని, ఆయనను సినిమాల్లో మాత్రమే చూశానని ముద్రగడ చెప్పారు.

మట్టి పనులు చేసి డబ్బులు కాజేశారు: మంత్రి సోమిరెడ్డి



ఈనాడు, అమరావతి: జలయజ్ఞం పేరుతో మట్టి పనులు చేసి డబ్బులు కాజేసిన ఘనత తల్లి, పిల్ల కాంగ్రెస్ పార్టీలకే దక్కుతుందని వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జన్మభూమి కార్యక్రమాన్ని వైకాపా సభలా మార్చేందుకు ఆ పార్టీ ఎంపీ అవినాష్‌రెడ్డి చేసిన ప్రయత్నాన్ని రైతులు నిరసించారని స్పష్టం చేశారు. పులివెందుల నీటి కొరతకు జగన్ ధన దాహమే కారణమని విమర్శించారు. గండికోట సీబీఆర్ ఎత్తిపోతల, పులివెందుల బ్రాంచి కాలువ, చిత్రావతి (లింగాల) ప్రాజెక్టులకు వైఎస్ హయాంలో రూ. 1,100 కోట్లు ఖర్చు చేసినా చుక్కనీరివ్వలేదని, తెదేపా అధికారంలోకి వచ్చాక జనవరి 3 నాటికి రూ.2,053 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి	బంగారం	వెండి	ముడి చమురు
▲ 176	▲ 62	63.41 ▲	29,490 ▼	38,700 ▲	67.96 ▲
33970	10505	(ఒక అమెరికా డాలరుకు) 12 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 95	ముంబయిలో కిలో రూ.లలో 05	(బ్రెంట్ ధర డాలర్లలో)




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,075	+153
నాస్‌డాక్	7,081	+16
నిక్కీ 225 (జపాన్)	23,506	+741
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,501	+37
షాంఘై(చైనా)	3,386	+17
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,696	+25
డాక్స్ (జర్మనీ)	13,168	+190

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.87	67.10
పౌండ్ స్టెర్లింగ్	78.21	91.71
యూరో	69.51	80.62
జపనీస్ యెన్/100	51.35	59.57
ఆస్ట్రేలియా డాలరు	45.30	52.41
సింగపూర్ డాలరు	43.49	51.52
థాయ్ బాత్/100	179.01	214.09
బహ్రెయిన్ దీనార్	156.71	179.59
కువైట్ దీనార్	174.47	217.19
ఒమన్ రియాల్	153.46	175.57
సౌదీ రియాల్	15.38	18.24
యూఏఈ దిర్హమ్	15.75	18.41
మలేషియా రింగిట్	14.09	17.33

గురువారం నిఫ్టీ కదలికలు



నేటి మార్కెట్

సూచీల లాభాలు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొత్త కొనుగోళ్లు చేయొచ్చని బ్రోకరేజీ సంస్థలు సిఫారసు చేస్తున్నాయి. నేడు నిఫ్టీకి 10400 పాయింట్ల వద్ద బలమైన మద్దతు, 10560 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావొచ్చని సాంకేతిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. వివిధ దేశాల్లో విడుదల కానున్న ఆర్థిక గణాంకాలు ప్రభావం చూపొచ్చు. నేడు డిసెంబరు అమెరికా ఉద్యోగ గణాంకాలు వెలువడనున్నాయి. దేశీయంగా చూస్తే.. 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలు ప్రకటించనుండటంతో మదుపర్లు కొంత అప్రమత్తత పాటించొచ్చు. లోహాలు, ఆభరణాలు, ఎరువుల షేర్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

కొత్త ఏడాదిలో లాభాల బోణీ

- రాణించిన బ్యాంకింగ్, లోహ షేర్లు

సమీక్ష

మూడు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. కొత్త ఏడాదిలో తొలిసారిగా సెన్సెక్స్ లాభాల బోణీ కొట్టింది. బ్యాంకుల పునర్‌వ్యవస్థీకరణ కోసం అదనంగా రూ.80,000 కోట్లు వ్యయానికి ఆర్థిక శాఖ పార్లమెంట్ అనుమతి కోరడంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు రాణించాయి. డిసెంబరులో సేవల రంగ పీఎంఐ రాణించడంతో మార్కెట్ సెంటిమెంట్ బలోపేతమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి రెండున్నరేళ్ల గరిష్ఠానికి చేరడం కూడా కలిసొచ్చింది. జపాన్ నిక్కీ దుమ్మురేపడంతో ఆసియా షేర్లు మెరిశాయి. ఐరోపా మార్కెట్లు సైతం లాభాల్లో ట్రేడయ్యాయి.

డోజోన్స్@25,000: అమెరికా ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీ చరిత్రలో తొలిసారిగా 25,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. గురువారం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే సూచీ ఈ ఘనత సాధించింది. డిసెంబరు ఉద్యోగ గణంకాలు ఇందుకు దన్నుగా నిలిచాయి.

రోజంతా లాభాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 33,912.49 పాయింట్ల వద్ద జోరు మీద ప్రారంభమైంది. రోజంతా దూకుడు కొనసాగించిన సూచీ. . ఒకానొకదశలో 33,995.40 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 176.26 పాయింట్లు పెరిగి 33,969.64 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సూచీ 263.45 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 61.60 పాయింట్లు పెరిగి 10,504.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,441.45- 10,513 పాయింట్ల మధ్య కదలాడింది.



బ్యాంకులు ధనాధన్: బ్యాంకుల పునర్‌వ్యవస్థీకరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో ప్రభుత్వ రంగ షేర్లు మెరిశాయి. యూకో బ్యాంక్ అత్యధికంగా 8.50 శాతం దూసుకెళ్లింది. ఐడీబీఐ బ్యాంక్ 8.33%, పీఎన్‌బీ 5.97%, బ్యాంక్ ఆఫ్ ఇండియా 3.83%, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.77%, ఓబీసీ 3.71%, కెనరా బ్యాంక్ 2.69%, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.39%, ఇండియన్ బ్యాంక్ 1.89%, ఎస్‌బీఐ 1.72% మేర రాణించిన వాటిలో ఉన్నాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభాలతో ముగిశాయి. టాటా స్టీల్ అత్యధికంగా 3.74% లాభపడింది. డాక్టర్ రెడ్డీస్ 3.14%, ఎల్ అండ్ టీ 3.08%, ఓఎన్‌జీసీ 2.92%, ఏషియన్ పెయింట్స్ 2.71%, సన్‌ఫార్మా 2.06%, కోల్ ఇండియా 2.02%, ఎస్‌బీఐ 1.72%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.98%లు రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా మోటార్స్ (0.81%), పవర్‌గ్రిడ్ (0.67%), ఇన్ఫోసిస్ (0.37%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ సూచీ 2.77% మెరిసింది. మన్నికైన వినిమయ వస్తువులు 2.53%, యంత్ర పరికరాలు 2.11%, పీఎస్‌యూ 1.55%, మౌలిక 1.03%, ఆరోగ్య సంరక్షణ 0.99% చొప్పున రాణించాయి.

మారుతీ కంటే వేగంగా టాటా?

ఈ ఏడాది రాణించనున్న షేర్లపై విశ్లేషకుల అంచనాలు

మారుతీ సుజుకీతో పోలిస్తే టాటా మోటార్స్ షేర్లు రాణించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. కంపెనీ దేశీయ వ్యాపారం తిరిగి పుంజుకోవడంతో పాటు.. షేరు విలువ మెరుగవుతుందన్న అంచనాలున్నాయన్నారు. అయితే 2017లో మాత్రం మారుతీతో పోలిస్తే టాటా మోటార్స్ షేర్లు చాలా వెనకబడి ఉన్న సంగతి తెలిసిందే.

వైఫల్యం వెనక.. గతేడాది మారుతీ షేరు ఏకంగా 83 శాతం మేర దూసుకెళ్లగా.. టాటా మోటార్స్ షేరు మాత్రం 9 శాతం తగ్గింది. 2014-17లో మారుతీ సుజుకీ ఆదాయం 43 శాతం మేర పెరిగింది. అదే సమయంలో టాటా మోటార్స్ ఆదాయం మాత్రం 27 శాతం క్షీణించింది. అనుబంధ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) మెరుగ్గా రాణించినా.. టాటా మోటార్స్ దేశీయ వ్యాపారం నష్టాలను నమోదు చేసింది. దీంతో మొత్తం మీద వృద్ధి కుంటుపడింది.

విజయం అంచనాల వెనక.. అయితే ఈ ఏడాది మాత్రం టాటా మోటార్స్‌కు అనుకూలంగా పరిస్థితులు మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.. మారుతీ సుజుకీ వేగం కొనసాగినా.. అంతకంటే వేగంగా టాటా మోటార్స్ పయనించే అవకాశం ఉంది. అదెలాగంటే..

దేశీయ వ్యాపారం పైకి: 2018లో టాటా మోటార్స్ దేశీయ వ్యాపారం తిరిగి పుంజుకుంటుంది. అలాగే జేఎల్‌ఆర్ స్థిరంగా ముందుగా వెళుతుంది. ఇటీవలి కాలంలో కంపెనీ విడుదల చేసిన ప్యాసింజరు వాహనాలకు వెల్లువెత్తిన స్పందనే ఈ అంచనాలకు నేపథ్యం. టియాగో, టిగోర్, నెక్సాన్, హెక్సాలు విడుదలైనప్పటి నుంచి ఇప్పటి దాకా బలమైన విక్రయాలను నమోదు చేశాయి. ఈ నేపథ్యంలోనే భారత వ్యాపారం పుంజుకుంటుందన్న అంచనాలు పెరిగాయి.



అంచనాలను మించి వృద్ధి: గత రెండు నెలలుగా వాణిజ్య వాహనాలు పుంజుకుంటుండం కూడా గమనించదగ్గ విషయం. డిసెంబరు విషయానికే వస్తే టాటా మోటార్స్ వాణిజ్య వాహన విభాగం 67 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది విశ్లేషకుల అంచనా కంటే 40 శాతం ఎక్కువ.

లాభం మూడింతలు: 2017లో బీఎస్-4 ఉద్గార నిబంధనల అమలు, జీఎస్‌టీ వల్ల వాణిజ్య వాహన పరిశ్రమ ఇబ్బంది పడింది. అయితే 2016-17 నుంచి 2019-20 మధ్య కంపెనీ నికర లాభం మూడింతలు; ఈక్విటీపై ప్రతిఫలాలు రెండింతలు అవుతాయని విశ్లేషకులు అంచనా కడుతున్నారు.

నష్టాలు తక్కువే: అదే సమయంలో జేఎల్‌ఆర్‌కు కూడా వచ్చే కొద్ది సంవత్సరాల్లో విదేశీ మారక నష్టాలు తక్కువగా నమోదు కావొచ్చన్న అంచనాలున్నాయి. కొత్త కార్ల విడుదల వల్ల ఈ విభాగంలోనూ విక్రయాలు పెరగవచ్చు.

షేరు ఆకర్షణీయం: ఇక మారుతీతో పోలిస్తే టాటా మోటార్స్ షేరు తక్కువ విలువ వద్ద ఉండడంతో ఈ ఏడాది మదుపర్లను అది ఆకట్టుకునే అవకాశం ఉంది. జనవరి 3న టాటా మోటార్స్ షేరు ధరే తీసుకుంటే అది 7.9% పీఈ (వన్ ఇయర్ ఫార్వర్డ్ పీఈ) నిష్పత్తితో కదలాడుతోంది. ఇది 10 ఏళ్ల సగటు అయిన 10.2 శాతంతో పోలిస్తే 23 శాతం తక్కువ.

ఫండ్‌ల ఆసక్తి: సెప్టెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల్లో మ్యూచువల్ ఫండ్లు టాటా మోటార్స్‌లో తమ వాటాను 86 బేసిస్ పాయింట్లు పెంచుకుని 5.22 శాతానికి చేర్చుకున్నాయి. అదే సమయంలో మారుతీ సుజుకీలో తమ వాటాను 56 బేసిస్ పాయింట్లు తగ్గించుకుని 5.98 శాతానికి పరిమితం చేసుకున్నాయి.

గురువారం టాటా మోటార్స్ షేరు ముగింపు:	రూ.429.70
గురువారం మారుతీ సుజుకీ షేరు ముగింపు:	రూ.9382.25

2018కు డాయిష్ బ్యాంకు అంచనా

సెన్సెక్స్ 37000 నిఫ్టీ 11500

దిల్లీ: కొత్త సంవత్సరంలోనూ మన మార్కెట్ జోరు కొనసాగే అవకాశం ఉందని డాయిష్ బ్యాంక్ అంచనా వేసింది. ఈ డిసెంబరు చివరి కల్లా సెన్సెక్స్ 37000; నిఫ్టీ 11500 పాయింట్లను చేరొచ్చని వెల్లడించింది. కార్పొరేట్ కంపెనీల ఆదాయాల్లో రెండంకెల వృద్ధి నమోదయ్యే అవకాశం ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని తన పరిశోధన నివేదికలో పేర్కొంది. 2017లో ప్రపంచంలోని అన్ని మార్కెట్ల మాదిరే భారత స్టాక్ మార్కెట్లు అద్భుత పనితీరును కనబర్చడంతో పాటు అత్యంత తక్కువ ఒడుదొడుకులతో సూచీలు కదలాడటం విశేషం. అయితే 2018లోనూ ఇంత తక్కువ స్థాయిలో ఒడుదొడుకులు పునరావృతం కాకపోవచ్చని నివేదిక పేర్కొంది. మున్ముందు ఎదురయ్యే ప్రతికూలతలపై మదుపర్లు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటం భారత్‌కు ఎదురుకానున్న అత్యంత కీలక సవాలని పేర్కొంది. 'ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో గత కొన్నేళ్లుగా భారత్ సాధించిన ఆర్థిక స్థిరత్వంపై కొంత ప్రభావం పడొచ్చు. ఒక వేళ బ్యారెల్ ముడి చమురు 70 డాలర్లను మించితే ద్రవ్యలోటు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏడాది కావడంతో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచే విషయంలో ప్రభుత్వం వెనుకాడే అవకాశం ఉంటుంది. ఈ భారం ద్రవ్యలోటుపై పడుతుంద'ని నివేదికలో పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ ప్రతికూలతల ప్రభావం తగ్గుముఖం పట్టొచ్చని తెలిపింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉండటంతో ఈ ప్రాంత ప్రజల కొనుగోళ్ల శక్తి పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. 'భారత జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని 6.6 శాతం నుంచి వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2018-19, 2019-20) వరుసగా 7.5%, 7.8% చొప్పున పెరగొచ్చని మా ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నార'ని నివేదిక వెల్లడించింది. నిఫ్టీ కంపెనీల ఆదాయాలు 2018-19లో 22%, 2019-20లో 17% మేర పెరగొచ్చని పేర్కొంది.

మార్కెట్ కబుర్లు

- షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రతిపాదనను వచ్చే వారంలో జరిగే బోర్డు సమావేశంలో పరిశీలించనున్నట్లు **ఆర్తి డ్రగ్స్** తెలిపింది. అయితే బైబ్యాక్ చేయనున్న షేర్ల సంఖ్య, విలువకు సంబంధించిన వివరాలను కంపెనీ వెల్లడించలేదు.
- ఈగల్ ఇంటర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ను 81 లక్షల డాలర్లకు కొనుగోలు చేసినట్లు **ఎన్ఐఐటీ** తెలిపింది.
- తాజా నిధుల సమీకరణ విడతలో భాగంగా ఎయిట్ రౌండ్స్ వెంచర్స్, మరికొన్ని సంస్థల నుంచి రూ.100 కోట్లను **ఎర్లీశాలరీ డాట్ కామ్** సమీకరించింది.
- అధిక నిరర్థక ఆస్తుల కారణంగా **అలహాబాద్ బ్యాంక్‌**పై దిద్దుబాటు పర్యవేక్షణ చర్యలను ఆర్‌బీఐ ప్రారంభించింది. ఈ చర్యల్లో భాగంగా మూలధన వినియోగంపై ఆంక్షలు ఉంటాయి.
- గ్రేట్ అమెరికన్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఉన్న సంయుక్త సంస్థ ఒప్పందాన్ని **హెచ్‌సీఎల్ టెక్నాలజీస్** రద్దు చేసుకుంది. ఈ రెండు సంస్థలు కలిసి 2011లో హెచ్‌సీఎల్ ఈగల్ లిమిటెడ్ ఏర్పాటు నిమిత్తం ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.
- ఆదిత్యా బిర్లా గ్రూపులోని ప్రమోటర్లకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో 32.66 కోట్ల షేర్లను జారీ చేయడం ద్వారా రూ.3,250 కోట్లను **ఐడియా సెల్యులార్** సమీకరించనుంది. ఇందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు అనుమతినిచ్చింది.
- **డ్రెడ్జింగ్ కార్పొరేషన్, హెచ్‌ఎల్ఎల్ లైఫ్‌కేర్, ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్‌**లో 100 శాతం వాటా విక్రయ ప్రక్రియను నిర్వహించేందుకు లావాదేవీ సలహాదార్ల నుంచి బిడ్‌లను ప్రభుత్వం ఆహ్వానించింది.
- ఎంఎస్ గ్లోబల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు **సంవర్ధన మదర్‌సన్ ఇంటర్‌నేషనల్** పేర్కొంది. అయితే లావాదేవీ వివరాలను కంపెనీ వెల్లడించలేదు.
- **అపోలో మైక్రో సిస్టమ్స్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు రూ.270- 275ను ధరల శ్రేణిగా నిర్ణయించారు. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ రూ.156 కోట్లు సమీకరించాలని భావిస్తుంది. ఈ ఇష్యూ 10న ప్రారంభమై 12న ముగుస్తుంది.
- **పంజాబ్ నేషనల్ బ్యాంక్** మరో కీలక మైలురాయిని సాధించింది. మొత్తం టర్నోవరు రూ.11 లక్షల కోట్లు మించిందని పేర్కొంది.

ప్రకటనల స్థల విక్రయానికి యాప్

ఈనాడు, హైదరాబాద్: ప్రకటన సంస్థలు, ఏజెన్సీలు తమ బిల్‌బోర్డులు, హోర్డింగుల ఖాళీ స్థలాన్ని విక్రయించుకోవడానికి హైదరాబాద్‌కు చెందిన మేరా హోర్డింగ్స్, మార్కెట్ ప్లేస్ మొబైల్ యాప్‌ను విడుదల చేసింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కరోలినా మరిన్ ఈ యాప్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ప్రకటనల స్థలాన్ని విక్రయించడానికి మేరాహోర్డింగ్స్ డాట్‌కామ్‌ను ప్రారంభించారు. దాదాపు 20 రాష్ట్రాల్లో 10 వేలకు పైగా బిల్‌బోర్డులు, హోర్డింగ్‌ల స్థలాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా వెండర్లు విక్రయిస్తున్నారు.

చిన్న మదుపర్లకు 7.75% బాండ్ల పథకం

- 10 నుంచి విక్రయాలు


దిల్లీ: చిన్న మదుపర్ల కోసం 7.75 శాతం పన్ను సహిత బాండ్ల పథకాన్ని ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇంతకు ముందు ఉన్న 8 శాతం పథకాన్ని ఇది భర్తీ చేయనుంది. ఏడేళ్ల కాలవ్యవధి కలిగిన ఈ బాండ్ల పథకం ఈ నెల 10న మొదలుకానుందని ఆర్థిక శాఖ తెలిపింది. ఈ బాండ్లపై వడ్డీని ఆరు నెలలకు ఒకసారి పొందే సౌలభ్యం ఉంది. రూ.1000 విలువ కలిగిన బాండ్ల కొనుగోలు చేస్తే. . ఏడేళ్ల తర్వాత వాటి మొత్తం విలువ రూ.1,703 అవుతుంది. ఈ బాండ్లపై వచ్చే వడ్డీ ఆదాయపు పన్ను చట్టానికి లోబడి ఉంటుంది. అయితే సంపద పన్ను నుంచి మాత్రం మినహాయింపు లభిస్తుంది. బాండ్లపై పెట్టుబడులకు గరిష్ఠ పరిమితి ఏమీ లేదు. ఈ బాండ్లను సెకండరీ మార్కెట్‌లో బదిలీ, ట్రేడింగ్ చేయడానికి వీలు లేదు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల నుంచి తనఖా రుణాలు పొందేందుకు సైతం అవకాశం లేదు. చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పన్ను రేట్లు తగ్గిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కొత్త బాండ్లను తీసుకొచ్చిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

టాటా స్టీల్



రూ.736.50 వద్ద ప్రారంభమై రూ.732- 763.45 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.734.95తో పోలిస్తే రూ.25.30 (3.44%) లాభంతో రూ.760.25 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 80,82,986.

టాటా మోటార్స్



రూ.430 వద్ద మొదలై రూ.425.75- 433.30 మధ్య చలించి క్రితం ముగింపు రూ.433.90తో పోలిస్తే రూ.3.95 (0.91%) నష్టంతో రూ.429.95 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 83,95,377 షేర్లు చేతులు మారాయి.


52 వారాల గరిష్ఠం (రూ.లలో)	
యునైటెడ్ స్పిరిట్స్	3700.00
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	1863.90
ఎల్ అండ్ టీ	1320.00
సీఈఎస్‌సీ	1094.60
సన్‌టీవీ నెట్‌వర్క్	1030.00
టైటన్ కంపెనీ	897.45
విశాకా ఇండస్ట్రీస్	796.35
ఆర్తి డ్రగ్స్	762.80
రెయిన్ ఇండస్ట్రీస్	456.05
కార్బొరండమ్ యూనివర్సల్	427.00

52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
బాంబే రేయాన్ ఫ్యాషన్స్	101.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
04/01	4,624	4,412	212	3,817	3,491	325
03/01	4,529	4,433	96	3,081	3,350	−269
02/01	3,162	2,640	523	3,230	3,166	65
01/01	770	444	326	2,499	3,800	−1,300
29/12	3,587	2,992	595	4,283	3,821	461

4వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	390	వరంగల్	392
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	395
బెంగళూరు	385	చెన్నై	405
5న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	388	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 409.85 (407.65) 1990506
AMBUJA CEMEN 273.45 (272.60) 2142231
ASIAN PAINTS 1172.05 (1141.90) 729965
AUROBIND PHA 668.30 (665.55) 1785334
AXIS BANK LT 559.90 (560.45) 2766664
BAJAJ AUTO L 3264.45 (3241.05) 256909
BAJAJ FINANC 1754.00 (1715.30) 730147
BHARTI AIRTE 523.00 (518.20) 5366018
BHARTI INFRA 379.05 (378.65) 4247055
BOSCH LTD 19652.65 (19692.95) 16677
BPCL 491.50 (494.90) 2720308
CIPLA 616.75 (606.80) 990602
COAL INDIA L 277.80 (271.85) 6919578
DR. REDDYS 2410.80 (2339.00) 558617
EICHER MOTOR 28570.75 (28814.35) 49421
GAIL 496.70 (490.10) 2194433
HCL TECH 893.10 (897.30) 596730
HDFC 1703.20 (1700.80) 1585554
HDFC BANK 1859.90 (1852.65) 593444
HERO MOTOCOR 3738.90 (3755.20) 196775
HINDALCO IND 279.80 (276.50) 10346774
HINDUSTAN UN 1352.25 (1350.35) 640189
HPCL 418.85 (410.95) 2868056
ICICI BANK 314.70 (315.00) 6385367
INDIABULLS H 1183.95 (1185.65) 505851
INDIAN OIL 387.30 (386.30) 4367569
INDUSINDBANK 1646.60 (1630.25) 747232
INFOSYS LTD 1015.40 (1021.30) 4473807
ITC 261.55 (261.15) 9368913
KOTAK MAHIND 1000.40 (1000.10) 783950
LARSEN & TOU 1315.70 (1275.30) 4546456
LUPIN 878.15 (878.95) 1924978
M&M 756.00 (754.90) 1663380
MARUTI SUZIK 9386.25 (9416.60) 562919
NTPC LTD 177.10 (177.05) 7260268
ONGC 199.50 (193.45) 12740860
POWER GRID C 200.35 (201.65) 2364782
RELIANCE IND 920.30 (914.80) 4118581
SBI 308.50 (302.85) 24517099
SUN PHARMA 581.20 (569.05) 6246746
TATA CONSULT 2657.10 (2638.65) 456541
TATA MOTORS 429.95 (433.90) 8395377
TATA STEEL L 760.25 (734.95) 8082986
TECH MAHINDR 522.55 (519.45) 1460097
ULTRATECH 4345.50 (4301.95) 149645
UPL LIMITED 781.65 (775.80) 1374445
VEDANTA LIMI 339.10 (332.50) 8879360
WIPRO 311.65 (309.95) 1464584
YES BANK LTD 317.10 (315.85) 5667580
ZEE ENTERTAI 580.00 (579.75) 1456032

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1433.30 (1414.45) 154339
ACC 1801.35 (1774.60) 278240
ASHOK LEYLAN 126.95 (124.50) 17032019
AVENUE SUPER 1203.10 (1184.55) 707905
BAJAJ FINSER 5062.55 (5099.45) 79205
BANK OFBAROD 163.90 (157.85) 17214456
BEL 180.05 (181.00) 4631211
BHEL 100.75 (98.55) 14450624
BRITANNIA 4626.40 (4680.95) 167350
CADILA HEALT 431.50 (428.50) 523367
COLGATE PALM 1094.35 (1098.35) 104294
CONTAINER 1376.30 (1370.05) 497555
CUMMINS INDI 972.95 (931.35) 1030993
DABUR INDIA 355.00 (354.65) 1107800
DLF LIMITED 257.50 (258.30) 4123938
EMAMI LIMITE 1328.65 (1321.95) 150644
GLAXOSMI CON 6402.80 (6414.35) 8019
GLAXOSMI PHA 2477.55 (2459.30) 9471
GLENMARK PHA 589.40 (591.85) 557391
GODREJ CONSU 989.45 (986.40) 269423
HAVELLS INDI 562.85 (555.65) 1178675
HINDUSTAN ZI 317.85 (312.00) 1150153
ICICI PRU LI 379.90 (376.70) 1120810
IDEA CELLULR 104.55 (102.70) 12497709
INTERGLOBE A 1213.65 (1208.40) 330334
JSW STEEL LT 277.15 (268.70) 6281682
LIC HOUS.FIN 567.60 (566.85) 880901
MARICO LIMIT 323.35 (320.85) 1060147
MCDOWELL 3688.85 (3598.15) 257782
MOTHERSON 375.35 (373.90) 1588578
MRF 71219.85 (71173.35) 4477
NHPC LTD 33.75 (32.70) 30920925
NMDC LTD 154.75 (149.25) 7255409
OIL INDIA 381.55 (376.90) 662892
ORACLE FIN S 4060.75 (4163.05) 24576
P&G HYG&HEAL 9309.90 (9412.85) 28471
PETRONET LNG 252.70 (253.60) 1758113
PIDILITE IND 905.60 (913.95) 454449
PIRAMAL ENTE 2819.30 (2850.05) 167634
PNB 176.45 (166.60) 31613344
POWER FIN CO 125.30 (123.75) 4371234
RURAL ELEC C 161.95 (157.85) 4584558
SAIL 97.90 (93.80) 23392017
SHREE CEMENT 17978.35 (18099.55) 24866
SHRIRAM TRAN 1468.85 (1452.10) 521009
SIEMENS 1277.05 (1258.15) 176736
SUN TV LTD 1028.20 (1004.70) 1460645
TATA POWER 99.60 (100.80) 6688043
TITAN IND 892.90 (856.30) 3028931
TORRENT PHAR 1393.90 (1378.55) 62641

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 209.60 (205.05) 2153252
ADANI ENTERP 183.30 (176.20) 12411875
ADANI POWER 44.25 (44.25) 27294014
ALL BANK 73.60 (72.20) 7332198
AMARA RAJA 839.75 (846.30) 248130
ANANT RAJIND 73.95 (71.35) 4248166
ANDHRA BANK 59.40 (57.30) 3905941
APOLLO HOSPI 1160.10 (1176.50) 263585
APOLLO TYRES 270.90 (269.95) 2423527
APTECH 358.20 (361.20) 236685
BAJAJ ELECT. 540.35 (533.45) 840962
BAJAJ HIND 17.05 (17.40) 6515420
BAJAJ HOLDIN 2828.50 (2843.55) 6551
BALAJI TELE 159.50 (153.95) 635851
BALLARPUR IN 18.45 (18.85) 4240127
BALRAMPUR CH 137.15 (137.25) 1534990
BANK OF MAHA 23.60 (23.05) 3945256
BANK OFINDIA 174.65 (168.35) 8222419
BATA INDIA 767.35 (772.40) 939051
BGR ENERGY S 141.25 (138.90) 193668
BHARAT FORGE 726.95 (733.10) 669117
BHUSHAN STEE 68.70 (67.30) 2126323
BIOCON LTD 541.65 (541.85) 863927
BOMBAY DYE 279.10 (279.50) 2714971
CANARA BANK 362.55 (352.80) 2758616
CEAT LIMITED 1941.15 (1945.55) 314336
CENTRAL BANK 76.75 (75.90) 3582211
CHAMBAL FERT 160.65 (160.20) 761529
CHENNAI PETR 423.30 (426.15) 409693
CITY UNIBANK 176.70 (178.40) 261065
CORPO BANK 41.30 (40.15) 700412
COX & KINGS 270.00 (268.10) 180566
D B REALTY L 71.20 (67.85) 1003890
DELTA CORP L 306.40 (300.80) 2144470
DENA BANK 26.95 (25.40) 15022781
DHANALAKBANK 29.65 (29.60) 517508
DIVIS LAB 1106.55 (1099.40) 450896
EDELWEISS CA 285.35 (282.45) 1379745
EID PARRY 379.75 (382.55) 120259
EIH 151.35 (149.20) 206196
ESSAR SHIPPI 32.40 (31.65) 443320
ESTER INDUST 60.50 (62.40) 278075
EXIDE INDUST 222.10 (223.35) 752325
FEDERAL BANK 108.65 (107.70) 9282382
FINOLEX CABL 696.60 (689.05) 40184
G E SHIP LTD 407.50 (404.90) 92719
GAMMON INFRA 3.60 (3.70) 7711096
GATI LIMITED 136.80 (135.70) 1389144
GAYATRI PROJ 212.90 (227.45) 4173819
GITANJALIGEM 74.00 (75.25) 16851618
GMR INFRASTR 21.05 (21.80) 53266055
GODREJ IND 612.45 (607.80) 593868
GRASIM IND 1170.30 (1127.20) 1008796
GUJ ALK&CHEM 760.50 (743.45) 132933
GUJ NRE COKE 1.55 (1.65) 17837686
HCL INFOSYS 59.45 (59.65) 2900598
HEXA TECH 352.00 (350.40) 922787
HIMACHAL FUT 33.90 (33.30) 26300936
HINDU MOTORS 9.30 (9.60) 629504
HOUSING DEV 62.15 (62.65) 12064355
IDBI 64.40 (59.50) 25032575
IDFC 61.70 (61.70) 2888757
IFCI 29.20 (29.25) 12253767
IL&FS TRANS 94.20 (93.05) 4233435
INDBULLS REL 219.25 (216.00) 4387036
INDIA CEM 190.35 (186.40) 5170878
INDIAN BANK 380.15 (373.20) 1146187
INDO RAMA SY 44.75 (45.60) 407059
INDRAPRASTHA 329.05 (332.75) 2156352
INGERSOLL-R 873.60 (859.50) 91408
IOB 23.05 (22.50) 2846170
IPCA LAB 580.15 (584.70) 160668
IRB INFRA DE 236.75 (236.10) 1873563
J&K BANK 81.55 (82.05) 586475
JAI CORP 202.75 (207.15) 3189540
JAIN IRRIGAT 136.25 (128.75) 22635947
JAYPEE INFRA 23.10 (23.15) 5379141
JET AIRWAYS 865.20 (870.60) 3424214
JINDAL SAW 163.75 (150.15) 6558332
JINDAL STEEL 244.55 (219.55) 44549944
JK LAKSHMI C 447.90 (441.90) 182192
JK PAPER LIM 164.05 (145.45) 6451612
JM FINANCIAL 157.35 (155.05) 556040
JP ASSOCIATS 24.40 (24.25) 59894875
JSW ENERGY L 91.05 (90.30) 5498152
JUBILANT FOO 1838.75 (1850.55) 592506
JUBILANT ORG 787.15 (763.05) 468100
JYOTHY LABS 380.45 (379.05) 233977
JYOTI STRUC 13.60 (14.30) 1872556
KARNATA BANK 155.45 (153.15) 3024130

ఘనం (+)

నిఫ్టీ	4న	మార్పు %
TATA STEEL	760.25	3.44
L & T	1315.70	3.17
ONGC	199.50	3.13
DR. REDDYS	2410.80	3.07
ASIAN PAINTS	1172.05	2.64
BAJAJ FINANCE	1754.00	2.26
COAL	277.80	2.19

గ్రహణం (-)

నిఫ్టీ	4న	మార్పు %
TATA MOTORS	429.95	-0.91
EICHER MOTORS	28570.75	-0.85
BPCL	491.50	-0.69
POWER GRID	200.35	-0.64
INFOSYS	1015.40	-0.58
HCL TECHNO	893.10	-0.47
HERO MOTOCORP	3738.90	-0.43

KEC INTL LTD 372.75 (372.80) 362476
KOLTE PATIL 357.50 (357.45) 181986
KPIT CUMMINS 203.80 (198.60) 3636391
L&TFIN.HOLD 172.40 (170.05) 4408258
LAK VIL BANK 148.20 (148.55) 929027
M & M FINANC 478.75 (464.60) 2162075
M & M FINANC 478.75 (464.60) 2162075
MANAPPURAM G 119.80 (119.40) 3924176
MMTC LIMITED 71.20 (71.50) 3074552
MOSER-BEAR 5.70 (5.30) 4343754
MPHASIS LTD 715.85 (720.05) 189039
MRPL 128.20 (126.35) 1473032
MTNL 29.35 (29.75) 5396020
NAGARJUNA OI 4.80 (4.75) 2763384
NCC LIMITED 132.65 (130.05) 4960251
NETWORK18 FI 60.25 (58.85) 1578197
NEULAND LAB 868.60 (873.70) 19682
NIIT LTD 104.60 (108.65) 1423750
NIIT TECHNOL 653.15 (645.95) 276774
OMAXE LTD 228.30 (228.85) 741561
ONMOBILE GLO 64.10 (63.35) 1537490
ORIENT PAPER 153.80 (158.20) 576226
ORIENTALBANK 124.00 (119.70) 3452181
PARSVNATH DE 29.65 (30.55) 333506
PATEL ENGG 83.70 (78.60) 3171166
PFIZER 2040.75 (2017.15) 22267
POLARIS SOFT 385.70 (386.30) 70041
POWERTRADING 120.40 (118.80) 1799136
PRAJ IND 120.15 (109.25) 8179538
PRISM CEMENT 120.85 (115.70) 577919
PUNJ LLOYD 26.15 (26.50) 3118298
PUNJAB & SIN 50.10 (49.60) 198168
PURAVANKARA 163.90 (166.15) 351227
PVP VENTURES 7.80 (8.00) 431639
PVR LIMITED 1399.00 (1401.80) 94195
RADICO KHAIT 308.00 (297.80) 3229039
RAJESH EXPOR 847.75 (809.75) 662849
RALLIS INDIA 274.55 (269.55) 1251516
RAMCO IND 291.55 (290.45) 328103
RAMCO SYS 558.35 (562.35) 34779
RAMKY INFRA 223.70 (221.85) 82185
RAYMOND 1097.30 (1055.90) 677838
RELIANCE CAP 596.35 (599.80) 5958529
RELIANCE COM 33.30 (30.55) 413019383
RELIANCE INF 565.55 (562.55) 2539276
RELIANCE POW 58.45 (56.95) 43274292
ROLTA INDIA 77.65 (70.80) 20235698
SAGAR CEMENT 1099.50 (1002.65) 203952
SAREGAMA 840.25 (853.40) 200421
SHANTHI GEAR 160.45 (160.00) 49358
SHIPPNG CORP 96.50 (96.05) 1882384
SHREE RENUKA 17.10 (16.85) 3344490
SINTEX IND 26.60 (26.65) 4584841
SOBHA DEVELO 610.00 (603.25) 313608
SOUTHINDBANK 31.30 (31.15) 10358296
SRS LIMITED 1.65 (1.65) 3350080
STERLITE TEC 335.10 (303.60) 4816615
SUN PHARMA 509.60 (500.30) 453297
SUND FASTNER 569.20 (573.65) 74408
SUZLON ENERG 15.80 (15.75) 33392449
SYND. BANK 80.65 (79.40) 5026591
TATA CHEM 754.40 (755.90) 899967
TATA COFFEE 166.00 (165.70) 509983
TATA COMMUN 674.70 (668.65) 291534
TATA GLOBAL 312.25 (311.20) 2703849
TATA METALIK 855.80 (860.55) 244882
TATA MOT DVR 255.00 (255.15) 2188575
THE INDIAN H 125.90 (121.35) 5019833
TORRENT POWE 280.60 (278.25) 731877
TRIVENI ENGG 77.55 (78.25) 398686
TTK PRESTIGE 7718.45 (7748.35) 4306
TV TODAY NET 429.00 (430.05) 96523
TV18 BROADCA 60.00 (60.50) 7636225
TVS MOTOR 766.55 (769.85) 692455
UCO BANK 33.30 (30.40) 8620848
UNION BANK 147.50 (143.15) 4391613
UNITECH 9.50 (10.55) 109845513
UNITED BANK 18.55 (18.00) 3139475
UNITED BREWE 1078.85 (1077.55) 356222
USHA MARTIN 25.55 (23.65) 3009157
VADILAL INDU 982.05 (970.55) 26677
VENKYS 2716.45 (2751.90) 33962
V-GUARD IND 235.35 (235.40) 546365
VIJAYA BANK 67.95 (66.80) 3644953
VIP 360.75 (344.60) 698297
VOLTAS 645.70 (643.60) 1081080
ZEE LEARN LI 45.75 (45.85) 852378
ZUARI GLOBAL 246.50 (250.00) 60072
ZYDUS WELLNE 1003.05 (1022.00) 7510

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 928.85 (910.50) 5556
AMAR RAJA BA 839.85 (846.10) 22415
ANDHRA BANK 59.45 (57.35) 490844
ANDHRA CEMEN 13.98 (13.75) 61765
ANDHRA PAPER 332.45 (332) 30836
ANDHRA PETRO 61.20 (58.30) 107959
ANDHRA SUGAR 521.30 (522.80) 765
ANJANI PORTL 247.80 (238.20) 4447
ASTRA MICROW 118.90 (120.90) 41708
AUROBINDO PH 668.65 (666.50) 125749
AVANTEL SOFT 509.05 (484.85) 17120
AVANTI FEEDS 2547.85 (2563.25) 5411
BALAJI AMIN 618.85 (623.60) 10978
BARTRONICS 15.92 (15.17) 81080
BHAGYA NAG 51.85 (51.15) 47782
CONT COFFEE 299.80 (298.65) 6582
COROMAN FERT 576.10 (568.70) 14085
CYIENT LIMIT 575.90 (576.65) 3550
DECCAN CEMEN 602.65 (564.60) 2696
DIVI'S LAB 1103.15 (1098.20) 27878
DR REDDY 2409.50 (2336.20) 50190
GATI CORPN 137.10 (135.40) 196603
GAYATRI PROJ 212.75 (228.10) 3537022
GMR INFRASTR 21.15 (21.80) 4966750
GOLDST INFRA 205.85 (199.70) 31718
GRANULES (I) 134.90 (134.75) 76443
GVK POWER 20.10 (19.25) 2956802
HBL NIFE POW 72.80 (73.05) 191642
HERITAGE FOO 825.20 (803.35) 1677
HYD INDUS 1594.30 (1504.40) 21044
IDL INDUSTRS 603.35 (605.85) 3214
ILFS ENGINEE 57.65 (56.45) 48040
IVRCL INFRAS 6.51 (6.85) 327402
JEEVAN SCIEN 53.25 (55.40) 14121
KAKATIYA CEM 402.10 (395.60) 17996
KAVERI SEED 534.55 (536.35) 36768
KCP LTD 161.35 (147.20) 387032
KNR CONSTRUC 309.20 (312.95) 19529
KREBS BIO 160.05 (161.40) 16860
LANCO INDUS 403.25 (405.20) 32853
LANCO INFRAT 1.62 (1.55) 5552588
LAURUS LABS 542.85 (536.70) 20679
LOKESH MACH 78.70 (77.65) 202027
MADHUCON PRO 36.85 (35.70) 102412
MEGA SOFT 17.66 (16.82) 408112
MOLD-TEK.TEC 74.50 (75) 16861
MOLDTK PLA 332.65 (325.35) 16284
MSR INDIA LT 36.25 (34.95) 5391
NAGARJAGRICH 64 (62.20) 299347
NAGARJAGRITE 7.98 (8.08) 7776
NATCO PHARMA 974.15 (973.75) 13632
NAVA BH VENT 171.70 (163) 491925
NCC 132.60 (130) 500472
NCL IND 282.05 (265.70) 68168
NETTLINX 84.25 (81.85) 26272
NEULAND LAB 869.55 (875.05) 5188
NIHAR INFO 14.01 (14.30) 681
PENNER IND 68.45 (67.55) 147565
PIONEER DIST 201.70 (201.25) 3556
PITTI LAMIN 103.55 (104.95) 28100
POKARNA 221.65 (220.90) 18090
PRAJAY ENGS 16.76 (15.97) 24250
PREMIER EXPL 462.80 (431.80) 20362
PRISM CEMENT 120.95 (115.40) 60432
RAIN INDUSTR 431.85 (438.95) 1896593
RAJ PACKAGIN 37.80 (37.20) 15879
SAGAR CEM 1104.50 (1011) 46485
SAMKRG PIST 348.65 (346.45) 11341
SAMPRE NUTRI 87.45 (90.40) 26835
SATVAH. ISPA 35.35 (34.20) 100736
SMS PHARMA 101.40 (102) 10299
SPHERE GLOBA 50.65 (49.95) 58182
SREE RAYAL A 80.60 (79.75) 660093
SRI KPR INDU 29.55 (30.25) 16748
SRINIVASA SH 93.65 (85.10) 50082
STEEL EXCHAN 46.25 (48.65) 116414
SUVEN PHARMA 215.30 (202.30) 159739
TAJ GVK HOTE 180.50 (178.20) 14541
TANLA 41.20 (40.70) 355006
VAMSHI RUBB 53.25 (52.95) 3036
VBC FERRO 46.50 (45.85) 1475
VIMTA LABS 172.80 (170.45) 23302
VISAKA IND 774.40 (662.05) 224963
VIVIMED LABS 104.45 (104.35) 149560
VST INDUS 3149.20 (3201.95) 299
ZENOTECH LAB 48.90 (47) 40851
ZENTECH 152.15 (149.15) 91045

ఈనాడు బిజినెస్

వచ్చే ఏడాదిన్నర కాలంలో దేశీయ మార్కెట్ ముందుకే పరుగులు తీసే అవకాశం ఉందని చెబుతున్నారు మహీంద్రా ఏఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) అశుతోష్ బిష్ణోయ్. గిరాకీ పుంజుకోవడం ప్రారంభమైందని చెబుతున్నారు. ఇప్పటికే విలువలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నా.. చిన్న కంపెనీల ఆదాయాలు, లాభాలు ఆకర్షణీయంగా పెరుగుతున్నందున షేర్ల ధరలు పెరుగుతాయని, విదేశీ మదుపర్లు వీటిలో మదుపు చేయగలరని అంటున్నారు. పెరుగుతున్న చమురు ధరలను భరించగలిగే శక్తి మన ఆర్థిక వ్యవస్థకు ఉందని, ఒకవేళ ద్రవ్య ఆస్తుల బుడగ ప్రపంచంలో ఎక్కడో ఒక చోట పగిలినా.. అది ఏడాదిన్నర తర్వాతే జరగొచ్చని 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ విశేషాలు..

'ఈనాడు' ఇంటర్వ్యూ: మహీంద్రా ఏఎంసీ ఎండీ అశుతోష్ బిష్ణోయ్



మార్కెట్ పిలుస్తోంది..

- ఇప్పటికీ బోలెడు అవకాశాలున్నాయ్
- చిన్న షేర్లు ఇంకా పెరుగుతాయ్!
- చమురు ఒత్తిళ్లను తట్టుకోగలం
- 38 ఏళ్లలో సెన్సెక్స్ 340 రెట్లయింది
- సగటున 14% ప్రతిఫలం ఇచ్చింది
- ద్రవ్య ఆస్తుల బుడగ బద్దలైనా.. ఏడాదిన్నర తర్వాతే!

? గత ఏడాది మన మార్కెట్ 27 శాతం ప్రతిఫలాన్ని ఇచ్చింది. కొత్త సంవత్సరంలో ఎలా ఉండొచ్చు అంటారు..

మన ఆర్థిక వ్యవస్థలో రెండు కీలక మార్పులు జరిగాయి. నోట్ల రద్దు, జీఎస్‌టీని ప్రవేశపెట్టడం. సాధారణంగా ఇలాంటి కీలక మార్పులు 50, 100 ఏళ్లకోసారి జరుగుతాయి. ప్రస్తుతం వీటి ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ బయటపడుతోంది. కంపెనీలు మళ్లీ గిరాకీ బాట పట్టాయి. గత అక్టోబరు-డిసెంబరు త్రైమాసికాన్నే పరిశీలిస్తే.. అన్ని రంగాల కంపెనీలు గాడిలో పడ్డాయి. పెద్ద కంపెనీల్లో అమ్మకాలు పెరుగుతున్న దాఖలాలు కనిపిస్తుంటే.. చిన్న కంపెనీల్లో అమ్మకాలతోపాటు లాభం కూడా పెరుగుతోంది. చిన్న కంపెనీలకు టర్న్ అరౌండ్ సమయం తక్కువ. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. మళ్లీ అధిక వృద్ధిరేటును నమోదు చేసే దిశగా ఆర్థిక వ్యవస్థ అడుగులు వేస్తోందని భావించవచ్చు. వచ్చే ఏడాది, ఏడాదిన్నర కాలంలో మార్కెట్ మరింత పెరుగుతుందని భావిస్తున్నాను. మంచి ఆదాయాలు (ఎర్నింగ్స్) ఇచ్చే మార్కెట్‌లోకి విదేశీ నిధులు వస్తాయి.

? ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి కదా.. ఇది మన మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది.. భవిష్యత్తు ఒడుదొడుకులకు ఆస్కారం ఉందా..

ముడి చమురు పీపా ధర 70-72 డాలర్లకు చేరగలదని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ఎదురయ్యే ఒత్తిడిని మనం తట్టుకోగలం. గతంలో 100 డాలర్లు దాటినప్పుడు కూడా మనం నిలదొక్కుకున్నాం. ఆర్థిక కార్యకలాపాల పరంగా పరిశీలిస్తే.. గత త్రైమాసికంలో రుణ గిరాకీ చాలా ఆకర్షణీయంగా పెరిగింది. అంటే.. వ్యాపార కార్యకలాపాలు బాగా ఉన్నాయని అర్థం. దీని వల్ల వడ్డీరేట్లు పెరుగుతాయి. ఇది సహజమే. గిరాకీ కారణంగా సమీప భవిష్యత్తులో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. కమోడిటీ సంబంధ ద్రవ్యోల్బణం ఇప్పటికే పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థ ట్రిలియన్ డాలర్లకు చేరడానికి దాదాపుగా అరవైఏళ్లు పట్టింది. ఆ తర్వాత దాదాపు పదేళ్లలోనే రెండు ట్రిలియన్ డాలర్లకు చేరింది. 2020 నాటికి కనీసం 3 ట్రిలియన్ డాలర్లకు చేరే వీలుంది. సాధారణంగా జీడీపీకి అనుగుణంగా మార్కెట్ విలువ (మార్కెట్ కేపిటలైజేషన్) పెరుగుతుంది. ప్రస్తుతం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో మన మార్కెట్ కేపిటలైజేషన్ 90 శాతం ఉంది. జీడీపీ 3 ట్రిలియన్ డాలర్లకు చేరితే.. మార్కెట్ విలువ 2.7 ట్రిలియన్ డాలర్లు అవుతుంది. ఇప్పుడున్న మార్కెట్ విలువ కన్నా ఇది దాదాపు 33 శాతం అధికం. స్టాక్ మార్కెట్లు బాగా పెరిగిన ఆర్థిక వ్యవస్థల్లో స్థూల దేశీయోత్పత్తిలో మార్కెట్ విలువ 200 శాతం వరకూ ఉన్న సందర్భాలు ఉన్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే.. మన స్టాక్ మార్కెట్‌లో షేర్లు అంతగా పెరగలేదని చెప్పొచ్చు. మధ్యలో చిన్న, చిన్న సాంకేతికపరమైన దిద్దుబాట్లు ఉండొచ్చు. మొత్తం మీద మన స్టాక్ మార్కెట్ 'దీర్ఘకాల బుల్లిష్' దశలో ఉంది. ఈ ధోరణి కనీసం 3-4 ఏళ్లు ఉండొచ్చు. ఆర్థిక వ్యవస్థకు ఊహించని తీవ్రమైన నష్టం జరిగితే తప్ప ఈ ధోరణిలో మార్పు ఉండకపోవచ్చు.

? చిన్న, మధ్యస్థాయి షేర్ల కంపెనీల పరిస్థితి ఏమిటి.. ఏయే కంపెనీల షేర్లు పెరిగే అవకాశం ఉంది.

అధిక మార్కెట్ విలువ గల కంపెనీల్లో సగటున 30-35% వాటా విదేశీ మదుపర్ల చేతిలో ఉంది. కొన్ని కంపెనీల్లో 50% వరకూ ఉంది. చిన్న, మధ్య స్థాయి మార్కెట్ విలువ గల కంపెనీల్లో విదేశీ మదుపర్ల వాటా 12-13% మాత్రమే ఉంది. చిన్న కంపెనీల షేర్ల విలువ ఇప్పటికే ఎక్కువగా ఉందని అంటున్నా.. గత మూడేళ్లను తీసుకుంటే.. పెద్ద కంపెనీల ఆర్జన సగటున 8%, చిన్న కంపెనీల ఆర్జనలు సగటున 17% పెరుగుతున్నాయి. అందువల్ల చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో ఎక్కువగా మదుపు చేసే వీలుంది. ఈ నేపథ్యంలో ఇవి పెరగొచ్చు. గత 7-8 ఏళ్లలో యూఎస్ ఫెడ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, స్విస్ నేషనల్ బ్యాంకు వంటి 5-6 కేంద్ర బ్యాంకులు ఆర్థిక వ్యవస్థలను ఉత్తేజపరిచేందుకు ప్రభుత్వ బాండ్లు, ఆర్థిక ఆస్తులను కొనుగోలు చేస్తున్నాయి. దీని తాలూకు నిధులు అధిక శాతం ఈక్విటీ, స్థిరాస్తుల్లోకి వస్తున్నాయి. ఇది మనలాంటి మార్కెట్లకు మేలైన పరిణామం.

? మన మార్కెట్లను ప్రభావితం చేసే అంశాలు ఏమిటి.. మార్కెట్‌కు ఎటువంటి రిస్కులున్నాయి

ఆసియా పసిఫిక్‌లో భౌగోళిక, రాజకీయ పరిస్థితులు స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేయొచ్చు. అణ్వాయుధాలు ప్రయోగిస్తామని కొన్ని దేశాలు భయపెడుతున్నాయి. అయితే.. ఈ రిస్క్ చాలా తక్కువే. ఏ నగదు లభ్యత వల్ల మార్కెట్లు పెరగడానికి వీలుందో అదే నగదు వల్ల రిస్క్ కూడా ఉంది. నిధులన్నీ ఆస్తుల్లోకి వస్తే బుడగ బద్దలయ్యే ప్రమాదం ఉంది. కేంద్ర బ్యాంకులు సమన్వయంతో నిధులు పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపారాల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాయా అన్నది ప్రశ్న. యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లను పెంచొచ్చు. అలా జరక్కపోతే.. ఏడాది, ఏడాదిన్నర తర్వాత ప్రపంచంలో ఎక్కడో చోట ఏదో సమయంలో ద్రవ్య ఆస్తుల బుడగ పగులుతుంది. ఇది పెద్ద ఆర్థిక వ్యవస్థలోనే జరగకపోవచ్చు. కొన్ని ఆసియా దేశాల్లో బ్యాంకుల పరిస్థితి బాగాలేదని నివేదికలు వస్తున్నాయి. అక్కడి బ్యాంకుల పరిస్థితులు మెరుగుపడకపోతే ఆ ఆర్థిక వ్యవస్థల్లో ద్రవ్య ఆస్తుల బుడగ పగలొచ్చు. మన మార్కెట్లను పరిశీలిస్తే ప్రస్తుత స్థాయుల నుంచి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

? చిన్న మదుపర్లు మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఇది తగిన సమయమేనా.. ఏ రంగాలపై దృష్టి పెట్టవచ్చు

చిన్న మదుపర్లు ప్రవేశించడానికి ఇది తగిన సమయంగానే భావిస్తున్నాను. 1979లో సెన్సెక్స్ 100 పాయింట్లతో ప్రారంభమైంది. ఇప్పుడు 34,000 పాయింట్లకు చేరింది. 38 ఏళ్లలో 340 రెట్లు అయింది. ఏడాదికి సగటున (సీఏజీఆర్) 14 శాతం పెరిగింది. వచ్చే మూడేళ్లలో ఇంతకంటే పెరుగుదల ఎక్కువగానే ఉంటుందని విశ్వసిస్తున్నాను. రంగాల వారీగా కాకుండా.. షేర్ల వారీగా పరిశీలించి పెట్టుబడి పెట్టాలి. విజ్ఞతతో ఆలోచిస్తే.. గిరాకీ పెరిగే రంగాలను ఎంచుకోవచ్చు. వాహన, గృహోపకరణాలు, గృహ అలంకరణ వంటి రంగాల్లో గిరాకీ బాగా పెరుగుతోంది. వినియోగ ఆధారిత రంగాలు, గ్రామీణ ప్రాంతాలతో గిరాకీ ముడిపడిన రంగాలు, రుణాలు ఇచ్చే కంపెనీల (బీఎఫ్ఎస్) షేర్లపై దృష్టి పెట్టొచ్చు. గిరాకీ, వినియోగం పెరిగితే.. వచ్చే మూడేళ్ల తర్వాత మౌలిక సదుపాయాలు, యంత్ర పరికరాల (కేపిటల్ గూడ్స్) రంగాల్లోని కంపెనీల పనితీరు బాగుంటుంది. ట్రేడింగ్ చేయడంలో నైపుణ్యం ఉంటే నేరుగా మార్కెట్‌లోకి పోవచ్చు. లేదంటే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టడం సరైన మార్గం. పెరిగే ద్రవ్యల్బణాన్ని అధిగమించాలంటే.. ఏదో ఒక మార్గంలో షేర్లలో పెట్టుబడులు పెట్టడమే సరైన వ్యూహం.

? భారత మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమపై మీ అంచనాలు ఏమిటి

భారత మ్యూచువల్ ఫండ్ల పరిశ్రమ కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని అంచనా వేస్తున్నాం. ప్రస్తుతం రూ.22.36 లక్షల కోట్లుగా ఉన్న మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ఆస్తులు... వచ్చే పదేళ్లలో రూ.100 లక్షల కోట్లకు చేరొచ్చు. చిన్న మదుపర్లు ఇందుకు దన్నుగా నిలుస్తారు. ప్రజలు సంపద సృష్టికి, ద్రవ్యోల్బణాన్ని అధిగమించడానికి ఈక్విటీ సరైన మార్గమని అర్థం చేసుకున్నారు. అందువల్లే వారు సంప్రదాయ పెట్టుబడులైన పసిడి, స్థిరాస్తి నుంచి మ్యూచువల్ ఫండ్ పథకాలపై దృష్టి పెడుతున్నారు. ఫలితంగా పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల విలువ వచ్చే పదేళ్లలో రూ.100 లక్షల కోట్లకు చేరొచ్చు. 2017లో చురుగ్గా ఉన్న 42 ఫండ్ సంస్థల మొత్తం ఆస్తుల విలువ ఏకంగా 32 శాతం వృద్ధి చెందింది. గత అయిదేళ్లలో ఈ వృద్ధి 24 శాతంగా ఉంది. మదుపర్ల అవగాహన కార్యక్రమాన్ని చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. దీని ఫలాలు సైతం వృద్ధికి దోహదపడతాయి. మిడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే విధంగా మహీంద్రా ఉన్నతి ఎమర్జింగ్ బిజినెస్ యోజన పథకాన్ని ప్రారంభించాం. 2016 జులైలో కార్యకలాపాలు ప్రారంభించిన మహీంద్రా ఏఎంసీ.. వచ్చే పదేళ్లలో సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద ఫండ్ సంస్థగా నిలపడమే మా లక్ష్యం.



సలీల్ విషయంలో ఎందుకిలా

- ఇన్ఫోసిస్ కొత్త సీఈఓ వార్షిక వేతనం రూ.18.6 కోట్లు
- ఏప్రిల్ నుంచి ప్యాకేజీ అమలు
- సిక్కా కంటే తక్కువే

ఎవరైనా కంపెనీ మారారంటే... కొత్త కంపెనీలో వాళ్లు ఎక్కువ వేతనానికే చేరి ఉంటారని అనుకోవచ్చు. కానీ ఇన్ఫోసిస్ కొత్త సీఈఓ సలీల్ పరేఖ్ పరిస్థితి తద్విరుద్ధం. ఈయనకు ఇన్ఫోసిస్ ఇస్తానన్న గరిష్ఠ వార్షిక ప్యాకేజీ రూ.18.6 కోట్లు. ఈయన క్యాప్‌జెమినీలో అందుకున్న రూ.20 కోట్ల(!) వేతనం కంటే తక్కువే. పైగా ఈయనకు ముందు ఇన్ఫోసిస్ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన విశాల్ సిక్కా కంటే కూడా తక్కువే. అంతర్గత కారణాలు, షరతులు ఎలా ఉన్నప్పటికీ, సంవత్సరానికి సలీల్‌కు దక్కేది గరిష్ఠంగా రూ.18.6 కోట్లు మాత్రమే.

ఇందులో స్థిర వేతనం రూ.6.5 కోట్లు కాగా.. చలన (వేరియబుల్) వేతనం గరిష్ఠంగా రూ.12.18 కోట్లు. ఒకవేళ 2017-18లో నిర్దేశిత లక్ష్యాలను సాధించని పక్షంలో కనీసం రూ.9.75 కోట్ల చలన వేతనం ఆయనకు లభిస్తుంది. ఈ ప్రకారం చూస్తే పరేఖ్ రూ.16.25- 18.6 కోట్ల మధ్య వేతనాన్ని అందుకునే వీలుందన్నమాట.

వాటాదార్ల అనుమతి నిమిత్తం పంపిన పోస్టల్ బ్యాలెట్ పత్రంలో పైవిధంగా సలీల్ వేతన ప్యాకేజీని ఇన్ఫోసిస్ ప్రతిపాదించింది. అయితే ఈ వేతన ప్యాకేజీ ఏప్రిల్ నుంచి వర్తిస్తుంది. అప్పటివరకు అంటే తొలి మూడు నెలల్లో నెలకు సగటున రూ.1.33 కోట్ల వేతనాన్ని పరేఖ్‌కు ఇన్ఫీ ఇవ్వనుంది.

పై వేతన ప్యాకేజీతో పాటు అదనంగా వార్షిక గ్రాంటు కింద పరిమిత షేర్ల రూపంలో రూ.3.25 కోట్లు, వార్షిక పనితీరు ఈక్విటీ గ్రాంటు కింద రూ.13 కోట్లు పరేఖ్ పొందనున్నారు. అలాగే ఒక్కసారి ఈక్విటీ గ్రాంట్ రూపేణా రూ.9.75 కోట్లను రెండు విడతల్లో కంపెనీ చెల్లించనుంది.

పరేఖ్ వీడ్కోలు ప్యాకేజీకి సంబంధించిన షరతులను కూడా పోస్టల్ బ్యాలెట్‌లో కంపెనీ పొందుపరిచింది. వీడ్కోలు సమయంలో 50 శాతం స్థిర వేతనం, అంతకుముందు 12 నెలల కాలానికి బోనస్‌ను చెల్లించడంతో పాటు ఆయనకు రావాల్సిన షేర్లను దశలవారీగా కంపెనీ కేటాయిస్తుంది.

అదే పదవి.. అదే బాధ్యత.. నడిపించే వ్యక్తి మారారు. కాని వేతనం తగ్గింది. అంతేనా.. లక్ష్యాలకు అనుగుణంగా పని తీరు లేకుంటే మళ్లీ ఇందులో కోత. ఆ పదవి ఇన్ఫోసిస్ సీఈఓ కాగా.. ఆ బాధ్యతలు చేపట్టిన వ్యక్తి సలీల్ పరేఖ్. మరి గతంతో పోలిస్తే ఇన్ఫోసిస్ ఎందుకు ఇంత తక్కువ వేతన ప్యాకేజీ ఇస్తోంది? పరేఖ్‌కు ఈ ప్యాకేజీ సమ్మతమేనా..?

తక్కువ అందుకేనా: విశాల్ సిక్కా, ప్రమోటర్ల మధ్య భేదాభిప్రాయాలకు దారి తీసిన ప్రధాన అంశాల్లో వేతన ప్యాకేజీ కూడా ఒకటి. సిక్కా హయాంలో కొంత మంది ఉన్నత అధికారులకు (టాప్ ఎగ్జిక్యూటివ్‌లు) అధిక స్థాయిలో వేతనాలు ఇవ్వడం, వీడ్కోలు పలికిన వారికి భారీ ప్యాకేజీలిచ్చి పంపించడాన్ని తప్పుపడుతూ ఆ సమయంలో నారాయణ మూర్తి లేఖ రాసిన విషయం విదితమే. ఇన్ఫోసిస్‌తో పోలిస్తే పోటీ సంస్థల్లోనే ఉన్నతాధికారుల వేతనాలు తక్కువగా ఉన్నాయనే విషయం కూడా అప్పట్లో ప్రస్తావనకు వచ్చింది. ఇప్పుడు కొత్త సీఈఓ వేతన ప్యాకేజీని ప్రతిపాదించే విషయంలో ఈ విషయాలన్నింటినీ ఇన్ఫోసిస్ పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే 2016-17లో విశాల్ సిక్కా అందుకున్న వేతన ప్యాకేజీతో పోలిస్తే సలీల్‌కు ఇవ్వనున్న పారితోషికం తక్కువేగానే ఉంది. ఆ ఆర్థిక సంవత్సరంలో బోనస్, షేర్ల గ్రాంట్‌తో కలుపుకొని మొత్తంగా రూ.45.11 కోట్ల పారితోషికాన్ని సిక్కా అందుకున్నారు. అంటే నెలకు సగటున రూ.3.7 కోట్ల వేతనాన్ని ఆయనకు కంపెనీ చెల్లించింది. ఇదే సమయంలో విప్రో సీఈఓ అబిదాలి నీముచ్‌వాలా వేతన ప్యాకేజీ రూ.13.2 కోట్లు కాగా.. టీసీఎస్ సీఈఓ రాజేశ్ గోపీనాథన్ రూ.6.22 కోట్ల వేతనాన్ని తీసుకున్నారు.

అక్కడ.. ఇక్కడ ఏంటి తేడా?: ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన సలీల్ 2000లో కేప్‌జెమినిలో అడుగుపెట్టారు. ఆ తర్వాత భారత్, అమెరికాలోని గ్రూపు కార్యకలాపాల్లో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇన్ఫోసిస్‌లో సీఈఓగా నియామకానికి ముందు కేప్‌జెమిని గ్రూపు ఎగ్జిక్యూటివ్ బోర్డులో సభ్యుడిగా ఉన్నారు. కేప్‌జెమినిలో సుమారు 3 మిలియన్ డాలర్ల వేతనాన్ని (రూ.20 కోట్లు) పరేఖ్ అందుకునేవారని తెలుస్తోంది. ఈ ప్రకారం చూస్తే ఇంచుమించు ఇదే స్థాయిలోనే ఇన్ఫోసిస్ వేతన ప్యాకేజీ ఉంది. అయితే ఇన్ఫీలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనితీరు ఉంటేనే ప్రతిపాదిత ప్యాకేజీలో పూర్తి మొత్తాన్ని పరేఖ్ పొందగలుగుతారు. ఒకవేళ బోర్డు అంచనాలకు తగ్గట్లుగా కంపెనీని విజయవంతంగా ముందుకు నడిపిస్తే 2021 మార్చి కల్లా ఆయన వేతన ప్యాకేజీ రెట్టింపు అయ్యేందుకు (రూ.35 కోట్లు) అవకాశాలూ ఉన్నాయి. అంటే నెలకు రూ.3 కోట్లు అన్నమాట. సిక్కా అందుకున్న ఆఖరి వేతన ప్యాకేజీతో పోలిస్తే కూడా ఇది తక్కువే.

ఆమోదముద్ర కావాలి..: ఐదేళ్ల కాలానికి సీఈఓగా పరేఖ్ నియామకం, వేతన ప్యాకేజీ ప్రతిపాదనపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదార్ల అనుమతిని ఇన్ఫోసిస్ కోరింది. కంపెనీ షరతుల ప్రకారం కంపెనీ విడిచిపెట్టిన రోజు నుంచి ఆరు నెలల వరకు నిర్దిష్ట పోటీ కంపెనీలతో పనిచేయడానికి వీలు లేదు. గత 12 నెలల్లో సేవలు అందించిన క్లయింట్లతోనూ ఆయన పనిచేయకూడదు. అలాగే యు.బి.ప్రవీణ్ రావు హోదాను ముఖ్య కార్య నిర్వహణ అధికారి, పూర్తి కాల డైరెక్టరుగా మార్చేందుకు కూడా వాటాదార్ల అంగీకారాన్ని కంపెనీ అడిగింది. జనవరి 22- ఫిబ్రవరి 20 మధ్య పై ప్రతిపాదనలపై వాటాదార్లు అభిప్రాయాలు తెలియజేస్తారు.

2018లో అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశంగా అమెరికా!

వాషింగ్టన్: ఈ ఏడాదిలో అమెరికా అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశంగా మారొచ్చని ఓ పరిశోధన నివేదిక అంచనా వేసింది. 2018లో ముడిచమురు ఉత్పత్తిని అమెరికా 10 శాతం పెంచి.. దాదాపు రోజుకు 11 మిలియన్ బ్యారెళ్ల ఉత్పత్తి సాధించొచ్చని తెలిపింది. షేల్ చమురు ఉత్పత్తి ఇందుకు దన్నుగా నిలవొచ్చని రైస్టడ్ ఎనర్జీ నివేదిక వెల్లడించింది. షేల్ చమురు ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి వల్ల.. రష్యా, సౌదీ అరేబియాలను వెనక్కి నెట్టే అవకాశం ఉందని అభిప్రాయపడింది. 1975 తర్వాత చమురు ఉత్పత్తిలో రష్యా, సౌదీ అరేబియాలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. అమెరికా షేల్ వ్యవస్థ వల్ల మొత్తం మార్కెట్ స్వరూపమే మారిపోయిందని రైస్టడ్ ఉపాధ్యక్షుడు నడియా మార్టిన్ తెలిపారు. 2015 చివర్లో సౌదీ నేతృత్వంలో ఒపెక్ దేశాలు ధరల పోటీకి దారితీయడంతో అమెరికా చమురు ఉత్పత్తి తగ్గింది. సరఫరా అధికం కావడంతో బ్యారెల్ చమురు ధర 100 డాలర్ల నుంచి ఒకానొకదశలో 26 డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. అయితే గతేడాది ధరలు పుంజుకోవడంతో అమెరికాలో చమురు ఉత్పత్తి మళ్లీ పెరిగిందని రైస్టడ్ తెలిపింది.

జేఎల్ఆర్ అమ్మకాల్లో 49% వృద్ధి

దిల్లీ: డిసెంబరులో టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా (జేఎల్ఆర్) 3,954 వాహనాలు విక్రయించింది. 2016 డిసెంబరులో కంపెనీ విక్రయించిన వాహనాలతో పోలిస్తే, ఈసారి అమ్మకాలు 49 శాతం పెరిగాయి. 2017లో అద్భుతమైన పనితీరు ప్రదర్శించామని, కొత్త మోడళ్లు, విక్రయశాలల పెంపు, సేవలు, బ్రాండ్ మెరుగుదల కార్యక్రమాలు ఇందుకు దోహదపడ్డాయని కంపెనీ వెల్లడించింది. జేఎల్ఆర్ ఎక్స్ఈ నుంచి ఎక్స్ఎఫ్, ఎఫ్-పేస్, డిస్కవరీ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఇవోక్ మోడళ్లన్నింటికీ మంచి స్పందన లభించిందని తెలిపింది. కొత్తగా విడుదల చేసిన ల్యాండ్‌రోవర్ డిస్కవరీ, రేంజ్ రోవర్ స్పోర్ట్‌లకు గిరాకీతో అమ్మకాలు పెరగడానికి దోహదపడ్డాయని కంపెనీ పేర్కొంది. మరిన్ని కొత్త ఉత్పత్తులతో 2018 లోనూ ఇదే వృద్ధి జోరును కొనసాగిస్తామని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జాగ్వార్ ఎక్స్ఈ (ధర రూ.35.85 లక్షలు) నుంచి ఎఫ్-టైప్ (రూ.1.34 కోట్లు) శ్రేణిలో వాహనాలను విక్రయిస్తుంది. ఇక ల్యాండ్ రోవర్ పోర్ట్‌ఫోలియోలో డిస్కవరీ స్పోర్ట్ (ధర రూ.42.48 లక్షలు) నుంచి (రేంజ్ రోవర్ (రూ.1.66 కోట్లు) శ్రేణిలో వాహనాలు ఉన్నాయి.

రాబోయే తరాలు మా ప్రభుత్వాన్ని గుర్తుపెట్టుకుంటాయ్

- కొత్త ఆర్థిక చరిత్రను లిఖించాం
- దీర్ఘకాలంలో సంస్కరణల ప్రభావం
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

దిల్లీ: ప్రభుత్వం తీసుకుంటున్న వృద్ధి కారక చర్యల ప్రభావం మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో కనిపిస్తుందని. . ఆర్థిక వ్యవస్థకు అది సానుకూలమని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. గురువారం రాజ్యసభలో జరిగిన 'ఆర్థిక వ్యవస్థపై స్వల్పకాలిక చర్చ' అనే అంశంపై మాట్లాడుతూ 'ఒక కొత్త ఆర్థిక చరిత్రను లిఖించిన ప్రభుత్వంగా రాబోయే తరాలకు మేం గుర్తుండిపోతామ'ని పేర్కొన్నారు. గత మూడున్నరేళ్లలో నిరుద్యోగం పెరిగిందని.. అన్ని కీలక ఆర్థిక గణాంకాలు క్షీణించాయని ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ విమర్శించింది. దీనిపై దీటుగా సమాధానమిస్తూ.. 'నరేంద్ర మోదీ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసింది; ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధనాన్ని ప్రకటించింది; జీఎస్‌టీని అమలు చేసింది.. ఈ చర్యలన్నీ స్వల్పకాలంలో ప్రతికూలంగా కనిపించొచ్చు. కానీ దీర్ఘకాలంలో అవి దేశ ఆర్థిక వ్యవస్థను రాబోయే తరాలు గుర్తుంచుకునేలా తయారు చేస్తాయ'ని పేర్కొన్నారు. 'భారత్ 7-8 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది. ఇది చాలా బలమైన వృద్ధి. అయితే భారత్ సంతప్తి చెందే దేశం కాదు. ప్రపంచంలోనే అత్యుత్తమ వృద్ధిని నమోదు చేస్తున్నప్పటికీ.. మేం కూడా సంతృప్తి చెందం. భారత్ ఒక ఆశావహ దేశం. అది ఒక మంచి సంకేతం' అని ఆయన అన్నారు. చిన్న పరిశ్రమలకు జీఎస్‌టీ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని ప్రతిపక్షాలు విమర్శించగా.. రూ.1.5 కోట్ల టర్నోవరు లోపు ఉన్న వ్యాపారాలపై ప్రపంచంలోనే అతి తక్కువ పన్ను(1%) మన దేశంలోనే ఉందని గుర్తు చేశారు.



రూ.80,000 కోట్ల బాండ్లకు లోక్‌సభ ఆమోదం

ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేసేందుకు రూ.80,000 కోట్ల మూలధన పునర్ వ్యవస్థీకరణ బాండ్లను లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ 'బ్యాంకులకు మూలధనం ఇవ్వడంతో పాటు.. పలు సంస్కరణలను సైతం వాటి కోసం చేపట్టనున్నాం. ఈ మూలధనం వల్ల వాటి ఆర్థిక ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా.. మార్కెట్ నుంచి నిధులను సమీకరించే సత్తా కూడా పెరుగుతుంద'న్నారు. కాగా, విశ్వసనీయ వర్గాల ప్రకారం.. ఈ బాండ్ల కోసం ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లను పరిశీలించే అవకాశం ఉంది.

శామ్‌సంగ్ ఫోన్లపై ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఆఫర్లు

దిల్లీ: శామ్‌సంగ్‌తో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లు జట్టుకట్టాయి. ఎంపిక చేసిన శామ్‌సంగ్ గెలాక్సీ జే-సిరీస్ మొబైళ్లపై రెండేళ్ల కాలవ్యవధిలో రూ.1500 వరకు నగదు వాపసు (క్యాష్‌బ్యాక్) ఆఫర్లు ప్రకటించాయి. గెలాక్సీ జే2 (2017), గెలాక్సీ జే5 ప్రైమ్, గెలాక్సీ జే7 ప్రైమ్, గెలాక్సీ జే7 ప్రో (ధరల శ్రేణి రూ.6,990- 19,900) మోడళ్లపై ఎయిర్‌టెల్ ఆఫర్లు ప్రకటించింది. ఇక గెలాక్సీ జే2 ప్రో, గెలాక్సీ జే7 నెక్స్ట్, గెలాక్సీ జే7 (ధరల శ్రేణి రూ. 8,490- 16,900) మోడళ్లపై నగదు వాపసు ఇవ్వనున్నట్లు వొడాఫోన్ తెలిపింది.

శామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్లు కొనుగోలు చేసిన ఎయిర్‌టెల్ వినియోగదారులు.. రూ.199తో ప్రత్యేక రీఛార్జి చేసుకుంటే.. దేశవ్యాప్తంగా అపరిమిత కాల్స్, రోజుకు 1 జీబీ డేటా పొందుతారు. మొత్తంగా రెండేళ్లలో ఎయిర్‌టెల్ ఖాతాదారులు రూ.5,000తో రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వొడాఫోన్ ఖాతాదారులు ప్రతినెలా రూ.198తో (రెండేళ్లలో మొత్తంగా రూ.4,752) రీఛార్జి చేసుకుంటే నగదు వాపసు పథకాన్ని పొందుతారు. 'రెండేళ్ల కాలవ్యవధిలో రూ.1,500 నగదు వాపసును ఖాతాదారులు పొందుతారు. ఏడాది ముగిసేసరికి.. వినియోగదారులు ఏ రీఛార్జి చేసుకున్నా మొత్తం విలువ రూ. 2,500కు సమానం కావాలి. ఏడాది ముగిసేసరికి రూ.300 నగదు వాపసుకు వీరు అర్హత సాధిస్తారు. ఇక రెండో ఏడాదీ మరో రూ.2,500 సమానమైన రీఛార్జి చేసుకుంటే రెండో విడతగా రూ.1200 నగదు వాపసు పొందగలరు' అని ఎయిర్‌టెల్ వివరించింది. అర్హులైన ఖాతాదారుకు చెందిన ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలో ఎయిర్‌టెల్ నగదు జమ చేస్తుంది. పోస్ట్‌పెయిడ్ ఖాతాదారులకు సైతం వొడాఫోన్ ఈ సదుపాయాన్ని అందిస్తోంది. ఏడాది తర్వాత రూ.600, రెండో ఏడాది తర్వాత రూ.900 వినియోగదారులు పొందే సౌలభ్యం ఉంది. ఈ నగదు వాపసును వొడాఫోన్ ఎం-పెసా వాలెట్లలో జమచేయనుంది.

భారత సంతతి బ్యాంకరుకు గుర్తింపు

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉత్తమ కేంద్ర బ్యాంక్ గవర్నర్ మేనన్

సింగపూర్: ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2018 సంవత్సరానికి గాను అత్యుత్తమ కేంద్ర బ్యాంకు గవర్నర్‌గా భారతీయ సంతతి వ్యక్తి నిలవడం విశేషం. సింగపూర్ కేంద్ర బ్యాంకు అయిన మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్(ఎమ్ఏఎస్) ఎండీగా పనిచేస్తున్న రవి మేనన్‌ను బ్రిటన్‌కు చెందిన మ్యాగజైన్ 'బ్యాంకర్' ఆ మేరకు గుర్తింపును ఆయనకిచ్చింది. సింగపూర్ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో మేనన్ కృషికి ఈ గౌరవం దక్కింది. ద ఫైనాన్షియల్ టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న ఈ మ్యాగజైన్ పలువురు బ్యాంకర్లు, ఆర్థికవేత్తలతో కలిసి ఈ ఎంపిక ప్రక్రియను చేపట్టినట్లు ద స్ట్రెయిట్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సింగపూర్ ఆర్థిక మంత్రి హెంగ్ స్వీ కీట్‌ను సైతం 2011లో ఉత్తమ బ్యాంకరుగా ఈ మ్యాగజైన్ గుర్తించింది. అప్పట్లో ఆయన ఎమ్ఏఎస్‌కు ఎండీగా ఉన్నారు. గత మూడేళ్లలో వియత్నాం, భారత్, బంగ్లాదేశ్‌లకు చెందిన కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు సైతం ఈ గుర్తింపు లభించింది.



సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే వాహనం గురించి మోదీకి వివరిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని (దాచిన చిత్రం)

మోదీకి బహుమతిగా గాల్ మొబైల్ జీపు

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన స్నేహితుడు ప్రధాని నరేంద్రమోదీకి సంచార నీటి నిర్లవణీకరణ సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న గాల్ మొబైల్ జీపును ప్రత్యేక బహుమతిగా ఇవ్వనున్నారు. గత ఏడాది జులైలో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు మధ్యధరా సముద్ర తీరం వెంబడి ఈ జీపులో ఇద్దరు ప్రధానులు కాస్త దూరం ప్రయాణించారు. ఈ నెల 14నుంచి నెతన్యాహు భారత పర్యటన ప్రారంభమవుతుంది. అదే వాహనాన్ని ఈ పర్యటనలో నెతన్యాహు బహూకరించనున్నారు. ఈ వాహనం ఖరీదు దాదాపు రూ.70లక్షలు. మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు ఓల్గా బీచ్‌లో సముద్రపు నీటిని మంచినీటిగా మార్చడాన్ని చూశారు. ఈ వాహనం రోజుకు 20వేల లీటర్ల సముద్రపు నీటిని మంచినీటిగా మార్చగలదు. బురద బురదగా ఉన్న లేదా కలుషితమయిన నది నీటిని అయితే రోజుకు 80వేల లీటర్లను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా తాగునీటిగా మార్చగలదు.

వీర కణాలనే ఎంపికచేస్తుంది

- ఐవీఎఫ్‌తో ఇక మెరుగ్గా గర్భధారణ!
- నూతన పరికరాన్ని అభివృద్ధి చేసిన అమెరికా శాస్త్రవేత్తలు

బోస్టన్: కృత్రిమ గర్భధారణ విధానం (ఐవీఎఫ్) ద్వారా గర్భం ధరించాలనుకుంటున్న మహిళలకు శుభవార్త. తక్కువ సమయంతోనే వీరు తమ కలను సాకారం చేసుకునేందుకు శాస్త్రవేత్తలు ఒక కొత్త సాధనాన్ని కొనుగొన్నారు. ఇది చాలా వేగవంతమైన, ఆరోగ్య వీర్యకణాలను ఎంపిక చేస్తుంది. పరిశోధకుల బృందంలో భారత సంతతికి చెందిన తిరుపతిరాజా చిన్నస్వామి కూడా ఉన్నారు.

'స్పార్టన్' అనే ఈ సూక్ష్మ ద్రవ సాధనాన్ని అమెరికాలోని వోర్సెస్టర్ పాలీటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీర్య కణాలు ఈత కొట్టడం కోసం ఇది 'పోటీ క్షేత్రాన్ని' సృష్టిస్తుంది. బలమైన, ఆరోగ్యవంతమైన వీర్య కణాలు మాత్రమే దీన్ని దాటుకొని వస్తాయి. వీటిని ఐవీఎఫ్ కోసం ఉపయోగిస్తే గర్భధారణ అవకాశాలు మెరుగుపడతాయి.

సంప్రదాయ పద్ధతుల్లో.. వేగంగా ఈదగలిగే వీర్యకణాన్ని మాత్రమే ఐవీఎఫ్ చికిత్సలో ఉపయోగిస్తారు. స్పార్టన్ పరికరం మాత్రం అటు వేగంతోపాటు ఆరోగ్యంపైనా దృష్టిపెడుతుంది. వంగిపోయిన మెడ, పెద్ద తలలు కలిగి ఉండటం వంటి అవకారాలున్న వీర్య కణాలను ఇది ఏరివేస్తుంది. స్పార్టన్ పొడవు 12-16 మిల్లీమీటర్లు. వెడల్పు నాలుగు మిల్లీమీటర్లు. దీనిలోని ఒక అంచులో వీర్యాన్ని చొప్పించాలి. వేగవంతమైన, ఆరోగ్యవంతమైన కణాలు రెండో అంచువద్దకు వస్తాయి. వాటిని అప్పటికప్పుడే ఐవీఎఫ్ కోసం ఉపయోగించుకోవచ్చు. ఈ ఎంపిక ప్రక్రియ 5-30 నిమిషాల్లో ముగుస్తుంది.

స్పార్టన్‌ను సంతాన సాఫల్య క్లినిక్‌లోనే ఉపయోగించే వీలుండటం వల్ల వీర్య కణాలను చల్లబరచి, ల్యాబ్‌కు తరలించాల్సిన అవసరం కూడా ఉండదు. సంప్రదాయ ఎంపిక ప్రక్రియలలో శక్తిమంతమైన సెంట్రిఫ్యూజ్ వంటి సాధనాలను ఉపయోగిస్తారు. వాటివల్ల వీర్య కణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. స్పార్టన్‌తో ఆ ఇబ్బంది ఉండదు. పైగా తక్కువ ప్రయత్నాల్లోనే గర్భధారణ అవకాశం ఉండటం వల్ల రోగులకు ఖర్చు కూడా తగ్గుతుంది.

ఆధార్ పట్టేసింది గురూ!

ఉన్నత విద్యా సంస్థల్లో 1.30 లక్షల మంది బోగస్ అధ్యాపకులు

ఈనాడు, దిల్లీ: ఉన్నత విద్యాసంస్థల్లోని బోధన సిబ్బంది వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల సత్ఫలితాలు వచ్చాయి. దేశవ్యాప్తంగా సుమారు 1.30 లక్షల మంది బోగస్ అధ్యాపకులు ఉన్నట్టు తేలింది. ఇందుకు సంబంధించి రాష్ట్రాల వారీ వివరాలను ఈ నెలాఖరుకల్లా విడుదల చేయాలని కేంద్ర మానవ వనరుల శాఖ భావిస్తోంది. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో 14 లక్షల మంది బోధన సిబ్బంది ఉండగా, వారిలో చాలా పేర్లు బోగస్‌వేనని ఫిర్యాదులు అందాయి. దాంతో అధ్యాపకుల పేర్ల వద్ద వారి ఆధార్ సంఖ్యలనూ నమోదు చేయాలని గత ఏడాది మానవ వనరుల శాఖ ఆదేశించింది. కొన్ని విద్యాసంస్థలు అనుమతులు సంపాదించడం కోసం అధ్యాపకుల సంఖ్యను పెంచుతూ బోగస్ వివరాలు నమోదు చేస్తున్నాయి. ఆధార్ అనుసంధానంతో విద్యాసంస్థల వాస్తవ పరిస్థితి, ఇంకా భర్తీ కావాల్సిన పోస్టుల వివరాలు తేటతెల్లం కానున్నాయి.

సీజేఐ వేతనం 2.80 లక్షలు!

- న్యాయమూర్తుల వేతనాల పెంపు బిల్లుకు లోక్‌సభలో ఆమోదం

దిల్లీ

సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల వేతనాలను దాదాపు రెండు రెట్లకుపైగా పెంచడానికి ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చాక భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నెలవారీ వేతనం ఇప్పుడున్న రూ.లక్ష నుంచి రూ.2.80 లక్షలకు పెరుగుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల వేతనం రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు చేరుతుంది. హైకోర్టుల న్యాయమూర్తుల వేతనం రూ.80,000 నుంచి రూ.2.25 లక్షలకు పెరుగుతుంది. ఏడో వేతన సంఘం సిఫార్సులకు తగ్గట్టుగా రూపొందించిన ఈ మార్పులు 2016 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. విశ్రాంత న్యాయమూర్తులకూ ఇవి వర్తిస్తాయి. ఇంటి అద్దె భత్యం వంటివీ పెరగనున్నాయి. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు చివరిరోజైన శుక్రవారం ఈ బిల్లుకు ఒకవేళ రాజ్యసభలో ఆమోదం లభించకపోతే ఈ నెల 30 నుంచి మొదలయ్యే బడ్జెట్ సమావేశాల్లో చర్చకు రానుంది.

జవాబుదారీతనం, పారదర్శకత అవసరం

న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, వారి పనితీరుకు జవాబుదారీతనం అవసరమని పలువురు సభ్యులు చర్చ సందర్భంగా పేర్కొన్నారు. చట్టాలను చేయడంలో పార్లమెంటుదే పైచేయి అని చెప్పారు. శాసనవ్యవస్థ పరిధిలోకి న్యాయవ్యవస్థ చొరబడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థ చట్టాన్ని అమలు పరచాలే గానీ చట్టాలు చేయకూడదని ఉప సభాపతి ఎం.తంబిదురై పేర్కొన్నారు. న్యాయస్థాన ధిక్కరణ కేసులో ఇటీవల ఒక న్యాయమూర్తికి శిక్ష పడిన విషయాన్ని మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రస్తావిస్తూ- కొలీజియం వ్యవస్థ రద్దు కావాల్సిన అవసరం ఉందన్నారు.

దివాలా, నాబార్డు బిల్లులకూ పచ్చజెండా

దివాలా స్మృతి బిల్లు, జాతీయ వ్యవసాయ- గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) బిల్లుల్లో రాజ్యసభ ప్రతిపాదించిన సవరణల్ని లోక్‌సభ ఆమోదించింది.

హిందీపై సంవాదం

హిందీని ఐరాసలో అధికారిక భాషగా ప్రకటించే అంశంపై విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ లోక్‌సభలో వాక్‌బాణాలు సంధించుకున్నారు. 'హిందీ మన జాతీయ భాషకాదు. అధికారిక భాష మాత్రమే. ఐరాసలోనూ దీన్ని అధికారిక భాషగా ప్రకటించాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు? అరబిక్‌లో ఎక్కువ మంది మాట్లాడకపోవచ్చు. కానీ 22 దేశాల ప్రజలకు ఆ భాషే ప్రధానం. హిందీ మాత్రం ఒకే దేశం (భారత్)లో అధికారిక భాష'అని థరూర్ వ్యాఖ్యానించారు. హిందీని అధికారిక భాషగా ప్రకటించడంతో భవిష్యత్తులో తమిళనాడు లాంటి హిందీభాష మాట్లాడని రాష్ట్రల నుంచి వచ్చే ప్రధానులు, విదేశాంగ మంత్రులు ఇబ్బంది పడే అవకాశముందని చెప్పారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా సభలో పలువురు సభ్యులు ఆందోళనవ్యక్తంచేశారు. 'హిందీ కేవలం భారత్‌లోనే మాట్లాడతారని అనుకోవడం మీ అజ్ఞానం'అని సుష్మా స్వరాజ్ వ్యాఖ్యానించారు.

ఏ నిర్ణయం తీసుకున్నా సభా గౌరవం పెంచడానికే

రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు

దిల్లీ: సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సభ్యులంతా బాధ్యతాయుతంగా మెలగాలని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు. సభాపతిగా తాను ఏ నిర్ణయం తీసుకున్నా అది సభా గౌరవం పెంచడానికేనని స్పష్టం చేశారు. సభ్యులంతా ఇదే సూత్రాన్ని పాటించాలని కోరారు. ఎగువ సభలో అనేక బిల్లులపై అవాంతరాల నేపథ్యంలో గురువారం ఆయన వివిధ పార్టీలకు చెందిన సభ్యులతో సమావేశమయ్యారు. తలాక్ బిల్లు కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అధికార, విపక్షాలు పరస్పరం చర్చించుకుని వివాదాన్ని పరిష్కరించుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. తమతమ రాజకీయ అజెండాలపై ఒత్తిడి తీసుకురావడం కోసం పదేపదే సభకు అవాంతరాలు కల్పిస్తూ, వాయిదా పడేలా చేయడం సబబేనా అనేది అన్ని పార్టీలూ ఆత్మశోధన చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధాన పార్టీలు తమ డిమాండ్లను వినిపించడానికి చేస్తున్న ప్రయత్నంలో ప్రజా సమస్యల్ని లేవనెత్తే అవకాశం తమకు చేజారిపోతోందని పలు చిన్న పార్టీల సభ్యులు ఫిర్యాదు చేశారు. తలాక్ బిల్లుపై సవరణల్ని ప్రతిపాదించడానికి కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మకు ఎంత సమయం కావాలంటే అంత ఇచ్చేందుకు వెంకయ్యనాయుడు అంగీకరించారు.

ఆధార్ సమాచారం భద్రం

- దుర్వినియోగం జరిగితే ఇట్టే కనిపెట్టొచ్చు: యూఐడీఏఐ

దిల్లీ: ఆధార్ సమాచారం భద్రంగా ఉందని విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) గురువారం నొక్కిచెప్పింది. రూ.500 ఇస్తే ఎవరి ఆధార్ సమాచారం కావాలన్నా ఇట్టే వాట్సాప్‌లో పంపిస్తామని గుర్తుతెలియని వ్యక్తులు నెట్‌లో ప్రచారం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో యూఐడీఏఐ స్పందించింది. బయోమెట్రిక్ వివరాలు సహా ఎలాంటి సమాచారమూ బయటకుపొక్కలేదనీ ఓ ప్రకటనను విడుదలచేసింది. 'ఆధార్‌లో "సెర్చ్ ఆప్షన్"ను ప్రజాసాధక బాధకాల పరిష్కరణకు మాత్రమే ప్రవేశపెట్టాం. ప్రభుత్వ అధికారులు, ప్రత్యేక ప్రతినిధులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. అది కూడా వారు ప్రత్యేక లాగ్‌ఇన్‌లలో మాత్రమే సమాచారాన్ని శోధించాల్సి ఉంటుంది. దీనికి వారి ఆధార్ నంబరు తప్పనిసరి. దీంతో ఎలాంటి దుర్వినియోగం జరిగినా ఇట్టే తెలిసిపోతుంది'అని సంస్థ వెల్లడించింది. ప్రస్తుత వార్తలను పరిశీలిస్తే "సెర్చ్" సదుపాయాన్ని ఎవరో దుర్వినియోగం చేయాలని ప్రయత్నించినట్లు తెలుస్తోందని, వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

ముంబయిలో అగ్ని ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి సజీవ దహనం

ముంబయి, న్యూస్‌టుడే: ముంబయిలో మరో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అంధేరిలోని మోరోల్‌నాకా పరిసరాల్లోని ఓ భవనం మూడో అంతస్తులో గురువారం తెల్లవారి మంటలు చెలరేగాయి. వీటిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. తలుపుగడియ లోపలి నుంచి మూసుకుపోవడంతో వీరంతా ప్రమాద సమయంలో ఇంట్లోనే ఉండిపోయారు. కాపాడాలంటూ వీరు ఆర్తనాదాలు చేశారు. అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకొని మంటల్ని అదుపుచేసే లోపే నలుగురు ప్రాణాలు విడిచారు. వీరిలో ఎనిమిదేళ్ల చిన్నారి కూడా ఉంది. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. మృతులను మోహిన్ కప్సీ(80), తస్లీమ్ కప్సీ(42), సాకీనా కప్సీ(13), మోయిజ్ కప్సీ(8)గా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. వారం రోజుల కిందట ఇక్కడి కమలా మిల్ సముదాయంలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 14 మంది మరణించిన సంగతి తెలిసిందే.

జైల్లో చలివేస్తోంది.. అయితే తబలా వాయించుకోండి

- లాలూ విన్నపంపై న్యాయమూర్తి స్పందన
- నేడు శిక్ష ఖరారు

రాంచీ: పశు దాణా కుంభకోణంలో దోషిగా రుజువైన ఆర్జేడీ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్... కారాగారంలో బాగా చలివేస్తోందని తనదైన చమత్కార శైలిలో గురువారం న్యాయమూర్తికి తెలిపారు. అయితే తబలా వాయించుకోండని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శివపాల్‌సింగ్ బదులిచ్చారు. లాలూకు ఎంత శిక్ష విధించేదీ ప్రకటించనుండడంతో న్యాయస్థానం కిక్కిరిసిపోయింది. అయితే శిక్ష ఖరారు చేయడాన్ని శుక్రవారానికి వాయిదా వేశారు. లాలూ రికార్డు మొత్తాన్ని తాను పరిశీలించాననీ, నిఘా పక్కాగా ఉన్నట్లయితే దాణా కుంభకోణం చోటు చేసుకునే ఉండేది కాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సకాలంలో తగినరీతిలో ఆయన స్పందించలేదని శివపాల్‌సింగ్ చెప్పగానే లాలూ జోక్యం చేసుకుంటూ తాను కూడా న్యాయవాదినేనని చెప్పారు. (పట్నా విశ్వవిద్యాలయం నుంచి ఆయన ఎల్ఎల్‌బీ చేశారు.) ఆర్జేడీ నేతలు రఘువంశ్‌ప్రసాద్ సింగ్, శివానంద్ తివారీ, లాలూ తనయుడు తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నేత మనీశ్ తివారీలపై ఉన్న న్యాయస్థాన ధిక్కార నోటీసుల గురించీ న్యాయమూర్తి ప్రస్తావించారు. ఈ నోటీసుల్ని ఉపసంహరించుకోవాలని లాలూ కోరారు. న్యాయస్థాన గది నుంచి తనను బయటకు తరలించబోతున్న తరుణంలో న్యాయమూర్తిని ఉద్దేశించి లాలూ మాట్లాడుతూ- ప్రశాంతంగా (కూల్ మైండ్‌తో) ఆలోచించండని కోరారు. శుక్రవారం నాటి విచారణకు వ్యక్తిగతంగా హాజరయ్యే బదులు ప్రత్యక్ష ప్రసార సదస్సు విధానాన్ని ఎంచుకోవచ్చని న్యాయమూర్తి సూచించారు. వ్యక్తిగతంగా హాజరయ్యే అవకాశం కల్పించాలని ఆర్జేడీ అధినేత కోరుతూ, మద్దతుదారులెవరూ కోర్టులో నినాదాలు చేయబోరని చెప్పారు. దానిపై శుక్రవారం నిర్ణయం తీసుకుంటానని న్యాయమూర్తి చెప్పారు.



బిర్భమ్‌లోని జోయ్‌దేవ్ వద్ద బౌల్ బిటన్ పర్యటక కేంద్రానికి శంకుస్థాపన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

మద్యపానంతో క్యాన్సర్ ముప్పు!



లండన్: మద్యపానంతో మూల కణాల్లోని డీఎన్ఏ శాశ్వతంగా దెబ్బతినే ముప్పుందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. ఈ పరిస్థితి క్యాన్సర్‌కు దారితీసే అవకాశముందని సూచించింది. తాజా అధ్యయనంలో భాగంగా భారత సంతతి శాస్త్రవేత్త ఆచార్య కేతన్ పటేల్ నేతృత్వంలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ పరిశోధక బృందం ఎలుకలకు ఇథనాల్ రూపంలో మద్యాన్ని కొంతకాలంపాటు అందించింది. అనంతరం వాటిలో క్రోమోజోమ్, డీఎన్ఏ సీక్వెన్సింగ్‌లను సమగ్రంగా విశ్లేషించింది. మద్యపానంతో శరీరంలో ఉత్పత్తయ్యే అసిటాల్డిహైడ్ అనే హానికర రసాయనం కారణంగా రక్తంలో మూలకణాల డీఎన్ఏ శాశ్వతంగా దెబ్బతింటున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. డీఎన్ఏ సీక్వెన్సింగ్ కూడా మారుతోందని కనుగొన్నారు. ఫలితంగా రొమ్ము, పేగు క్యాన్సర్ల ముప్పు పెరుగుతోందని తెలిపారు.

మహాసముద్రాల సగటు ఉష్ణోగ్రత 3.5 డిగ్రీల సెల్సియస్



లాస్ ఏంజిలెస్: ప్రపంచవ్యాప్తంగా మహాసముద్రాల సగటు ఉష్ణోగ్రతను 3.5 డిగ్రీల సెల్సియస్‌గా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గతంలో ఎన్నడూ ఉపయోగించని ఓ అద్భుత విధానంలో ఈ ఉష్ణోగ్రతను గుర్తించారు. మహాసముద్రాల సగటు ఉష్ణోగ్రతను లెక్కించడం అత్యంత క్లిష్టమైన వ్యవహారం. ఎందుకంటే నీటిపొరల మధ్య ఉష్ణోగ్రతల్లో తేడాలు ఎక్కువగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా నీటి విస్తరణ తీరు కూడా భిన్నంగా ఉంటుంది. ఈ అడ్డంకులను అధిగమిస్తూ.. మహాసముద్రాల సంయుక్త సగటు ఉష్ణోగ్రతను కనుగొనేందుకు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు సరికొత్త విధానాన్ని రూపొందించారు. నూతన విధానంలో నీటి ఉష్ణోగ్రతను లెక్కించడానికి బదులు.. వాతావరణంలోని ఆర్గాన్, క్రిప్టాన్, గ్జినాన్ అనే మూడు జడవాయువుల నిష్పత్తిని గుర్తిస్తారు. వీటి పరిమాణం మహాసముద్రాల ఉష్ణోగ్రతకు అనులోమానుపాతంలో ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. మహాసముద్రాలు వెచ్చగా ఉన్నప్పుడు ఈ జడవాయువులు వాతావరణంలోకి విడుదలవుతుంటాయని వివరించారు. ప్రస్తుత ఆధునిక యుగంలో మహాసముద్రాల సగటు ఉష్ణోగ్రతను 3.5 డిగ్రీల సెల్సియస్‌గా ఈ విధానంలోనే నిర్ధారించారు.

సంప్రదాయ కెమెరా కటకాలకు సెలవు!



లండన్: సంప్రదాయ కెమెరా కటకాలకు ఇక కాలం చెల్లినట్లే! చరవాణులు, కెమెరాల్లో ఉపయోగించేందుకు వీలుగా భవిష్యత్తుతరం సూక్ష్మ కటకాన్ని హార్వర్డ్ పరిశోధకులు తాజాగా ఆవిష్కరించారు. 'మెటాలెన్స్'గా పిలుస్తున్న ఈ నూతన కటకంలో 'నానోఫిన్స్' అనే చిన్నచిన్న భాగాలుంటాయి. ఇవి కాంతి వేగాన్ని నియంత్రిస్తాయి. హరివిల్లులోని అన్ని రంగులపై దృష్టిపెట్టగల సామర్థ్యం 'మెటాలెన్స్' సొంతమని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయబద్ధ కెమెరా కటకాలు పెద్ద పరిమాణంలో, వంగి ఉంటున్న సంగతిని గుర్తుచేశారు. వాటిని వెంట తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. అందుకు భిన్నంగా 'మెటాలెన్స్' బల్లపరుపుగా.. ఎక్కడికైనాసరే తీసుకెళ్లేందుకు అనువుగా చిన్నగా ఉంటుందని తెలిపారు. కెమెరాలు, చరవాణులు, వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్లలో సంప్రదాయ కటకాలకు బదులుగా మెటాలెన్స్‌ను ఉపయోగిస్తే.. తద్వారా కలిసొచ్చిన అదనపు చోటును బ్యాటరీలు, ఇతర హార్డ్‌వేర్ల పరిమాణాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకోవచ్చునని వివరించారు.

జాదవ్ ఆనందంగా ఉన్నారట!

- దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్న పాక్
- ఆయన మాటలతో మరో వీడియో విడుదల
- గట్టిగా జవాబిచ్చిన భారత్



ఇస్లామాబాద్/ దిల్లీ: గూఢచర్యం ఆరోపణలతో పాక్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయుడు కుల్‌భూషణ్ జాదవ్ చెబుతున్నట్లుగా.. మరో కల్లబొల్లి వీడియోను పాకిస్థాన్ గురువారం విడుదల చేసింది. అందులో జాదవ్ - పాక్ కస్టడీలో తనకెలాంటి హాని జరగడం లేదని చెప్పడమే కాకుండా.. భారత్‌పైన, భారత దౌత్యాధికారిపైన ఆరోపణలు చేయడంతోనే - అది ఎంత వరకు వాస్తవమన్నది స్పష్టమవుతోంది. దీనిపై ఘాటుగా స్పందించిన భారత్ - పాక్ దుష్ప్రచారాన్ని ఎండగట్టింది. పాక్ విడుదల చేసిన వీడియోలో జాదవ్ - "భారత ప్రజలకు, ప్రభుత్వానికి, నేవీకి ఒక ముఖ్యవిషయం చెప్పాలి. నేను భారత నావికాదళంలో ఉన్నతాధికారిని. నా ఉద్యోగం పోలేదు. నేను నిఘాసంస్థ కోసం పనిచేయలేదని భారత్ అబద్ధాలు ఎందుకు చెబుతోంది? నా తల్లి పాక్‌కు వచ్చినప్పుడు ఆమె కళ్లలో భయం చూశాను. భారత దౌత్యాధికారి ఆమెపై కేకలేశారు. బయటకు వెళుతున్నప్పుడు అరుస్తూ భయపెట్టడం చూశాను. నా కుటుంబీకులతో ఆ సమావేశం సానుకూలంగానే జరిగింది. దీనికి నా తల్లి ఆనందించి ఉంటారు.. అందుకే నేనూ సంతోషంగా ఉండగలుగుతాను. పాక్ నన్ను జాగ్రత్తగా చూసుకుంటోందని.. అమ్మకు చెప్పాను. నన్నుచూసిన తర్వాత ఆమెకు నమ్మకం వచ్చింది.." అని అంటున్నట్లుగా ఉంది. డిసెంబరు 25న పాక్‌లో జాదవ్‌ను ఆయన తల్లి, భార్య కలిసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఇస్లామాబాద్‌లోని భారత డిప్యూటీ హైకమిషనర్ వారితో ఉన్నారు. కాగా తన తల్లి బయటకెళ్లిన తర్వాత ఆయన కేకలేసినట్లుగా జాదవ్ ఎలా చూశారన్నది అంతుచిక్కని ప్రశ్న.

పాక్ దుష్ప్రచారానికి పరాకాష్ఠ: భారత్

దుష్ప్రచార పన్నాగాల్లో భాగంగానే పాక్ జాదవ్ వీడియోను విడుదల చేసిందంటూ భారత్ ఖండించింది. "ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. బెదిరిస్తూ.. బలవంతంగా మాట్లాడించే ప్రక్రియను పాక్ కొనసాగిస్తోంది.." అని భారత విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఓ వ్యక్తి తనను జైలులో ఉంచినవారు చెప్పిన మాటలనే మాట్లాడుతూ.. తన యోగక్షేమాలను తానే ధ్రువీకరించుకోవడంలో అర్థం లేదని.. ఇంతకు మించి చెప్పేదేమీ ఉండదని పేర్కొన్నారు. దౌత్య సంబంధాలు, ఉగ్రవాదంపై పాక్ తన అంతర్జాతీయ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలని హితవు పలికారు.

రైల్వే 'సెలూన్'లలో రైల్వేయేతరులకూ అవకాశం!

దిల్లీ: రైల్వేలో అత్యున్నతస్థాయి అధికారులే వినియోగించే ప్రత్యేక తనిఖీ పెట్టె (రైల్వే పరిభాషలో వీటిని సెలూన్ అంటారు) ఇకపై బయటివారికీ అందుబాటులోకి రానుంది. రెండు పడక గదులు, వరండా, వంటగది, మరుగుదొడ్డి వంటి సదుపాయాలతో... కదిలే నక్షత్ర హోటల్ గది మాదిరిగా ఉండే ఈ పెట్టెలో ప్రయాణించే అనుభూతిని ప్రయాణికులకు కల్పిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన మొగ్గ తొడిగింది. ప్రయాణికుల, వర్తక సంఘాలతో రైల్వేబోర్డు ఛైర్మన్ అశ్వనీ లోహానీ గురువారం నిర్వహించిన సమావేశంలో దీనిపై ప్రస్తావన వచ్చింది. ఈ తరహా ప్రయాణాన్ని కోరుకునేవారికి కోసం దిల్లీలో కనీసం రెండు సెలూన్‌లను అందుబాటులో ఉంచాలని ఛైర్మన్ ఆదేశించారు. రెండు కుటుంబాలు 5 రోజుల పాటు గడిపేందుకు ఈ పెట్టెలు వీలుగా ఉంటాయని అధికారులు తెలిపారు.

రైలుపట్టాలపై చుట్టుపక్కల ప్రాంతాలవారు చెత్తను పడవేయకుండా చూడడానికి గోడల్ని నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

కృష్ణజింకల వేట కేసులో తుదివిచారణకు హాజరైన సల్మాన్




జోధ్‌పుర్: కృష్ణ జింకల వేట కేసులో తుదివాదనలకు.. రాజస్థాన్‌లోని కోర్టు ముందు ప్రముఖ హిందీ సినీనటుడు సల్మాన్‌ఖాన్ గురువారం హాజరయ్యారు. 1998 అక్టోబర్ 2న జోధ్‌పుర్ జిల్లాలోని కంకనీ గ్రామంలో రెండు కృష్ణ జింకలను వేటాడినట్లు సల్మాన్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించి జోధ్‌పుర్‌లోని ట్రయల్ కోర్టులో సెప్టెంబర్ 13న తుదివాదనలు మొదలయ్యాయి. కోర్టులో సల్మాన్ కాస్త ఇబ్బందిపడ్డట్లు కనపడ్డారని కొందరు న్యాయవాదులు తెలిపారు. కేసులో ఓ సాక్షి వాంగ్మూలం వీడియో రికార్డింగ్‌కు.. విచారణ అధికారి నమోదు చేసుకున్న వాంగ్మూలానికి మధ్య వైరుధ్యాలు ఉన్నట్లు సల్మాన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. సాక్షుల వాంగ్మూలాలు, జింకల మృతదేహాలకు నిర్వహించిన పరీక్షలు వేట జరిగినట్లు తేటతెల్లం చేస్తున్నాయని ప్రాసిక్యూషన్ పేర్కొంది.

కామన్వెల్త్ కేసులో హైదరాబాద్ కంపెనీ ఆస్తుల జప్తు

ఈనాడు, దిల్లీ: కామన్‌వెల్త్ క్రీడల కుంభకోణంలో హైదరాబాద్‌కు చెందిన ఏకేఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన రూ.11.28 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. పోటీల్లో టైమింగ్, స్కోరింగ్, రిజల్టింగ్ వ్యవస్థ ఏర్పాటు టెండరును స్విస్ టైమింగ్ కంపెనీకి కట్టబెట్టడంలో అధికార దుర్వినియోగం జరిగింది. ఈ పనుల కోసం స్విస్‌టైమింగ్ సంస్థ జెమ్ ఇంటర్నేషనల్‌తో మోసపూరిత కాంట్రాక్ట్ కుదుర్చుకొంది. జెమ్ ఇంటర్నేషనల్.. హైదరాబాద్‌కు చెందిన ఏకేఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీతో సబ్‌కాంట్రాక్ట్ కుదుర్చుకొని రూ.11.28 కోట్లు చెల్లించింది. ఏకేరెడ్డి అనే వ్యక్తి నేతృత్వంలో పనిచేసే ఈ కంపెనీ లేబర్ కాంట్రాక్ట్, కేబుళ్ల సరఫరా విషయంలో తప్పుడు బిల్లులు సృష్టించి సొమ్ము చేసుకొంది. దీనిపై దర్యాప్తు జరిపిన ఈడీ.. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద ఏకేఆర్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన బంజారాహిల్స్‌లోని రూ.5.99 కోట్ల విలువైన ఆస్తులు, రూ.5.29 కోట్ల విలువైన బ్యాంకు ఖాతాలను జప్తు చేసింది.

ట్రంప్ లక్ష్యం అధ్యక్ష పీఠం కాదా!

- ప్రపంచంలో అత్యంత ప్రముఖుడు కావాలన్నదే ఉద్దేశమా?
- తాజా పుస్తకంలో వెల్లడైన అంశాలు



వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా అధ్యక్షుడు కావాలన్న ఉద్దేశమే లేదట! అమెరికాకు చెందిన విలేఖరి మైఖేల్ వుల్ఫ్ తన పుస్తకం 'ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ద ట్రంప్ వైట్‌హౌస్'లో ఇలాంటి ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పుస్తకంలోని అంశాలివీ..

ట్రంప్ అంతిమ లక్ష్యం.. గెలుపు సాధించాలన్నది కాదు. ప్రపంచంలోనే అత్యంత ప్రముఖ వ్యక్తి కావాలన్నది ఆయన ఉద్దేశం. అధ్యక్ష రేసు ఆరంభంలోనే ఈ విషయాన్ని ఆయన తన సహాయకుడు శామ్ నన్‌బర్గ్‌కు చెప్పారు. టీవీ రంగంలో కెరీర్‌ను నిర్మించుకోవాలనుకుంటే తొలుత అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని 'ఫాక్స్ న్యూస్' మాజీ అధిపతి రోజర్ ఏయిల్స్ ఆయనకు సూచించేవారు. వైట్‌హౌస్‌లోకి వచ్చాక.. పాలన, విధాన నిబంధనలను సమూలంగా మార్చేయాలని ట్రంప్ భావించారు. అయితే సమాచార మదింపు సరిగా చేసేవారు కాదు. ఆయనను అరకొర అక్షరాస్యుడిగా కొందరు అభివర్ణిస్తుంటారు. ఎంత నాసిరకంగా, అసంబద్ధంగా ఉన్నప్పటికీ తన సొంత నైపుణ్యంపైనే ఆయనకు నమ్మకం ఎక్కువ.

ఫలితాల రోజు..: ఎన్నికల ఫలితాలు వచ్చే రోజు రాత్రి 8 గంటల సమయంలో.. ట్రంప్ గెలుపు సాధించబోతున్నారని స్పష్టమైంది. ఆ సమయంలో మెలానియాను చూసి దెయ్యాన్ని చూసినట్లుగా అదిరిపోయానని ట్రంప్ కుమారుడు డాన్ జూనియర్ తన స్నేహితుడితో చెప్పాడు. ఆమె కన్నీటి పర్యంతమయ్యారని, అయితే అవి ఆనందబాష్పాలు కావని పేర్కొన్నారు. నాడు గంట సమయంలోనే ట్రంప్ ముఖ కవళికలు మారిపోయాయని రచయిత పేర్కొన్నారు. తొలుత అయోమయంలో ఉన్న ట్రంప్.. ఆ తర్వాత అపనమ్మకంలో ఉన్న ట్రంప్.. ఆనక బిత్తరపోయిన ట్రంప్ ఆవిష్కృతమయ్యారు. అంతలోనే ఆయన.. అమెరికా అధ్యక్ష పదవికి అర్హుడైన, ఆ సామర్థ్యం కలిగిన వ్యక్తిగా తనను తాను భావిస్తున్నట్లుగా ఫోజులిచ్చారు. అధికారం చేపట్టిన మొదటి కొద్దినెలల్లో ట్రంప్, ఆయన సలహాదారులు తీసుకున్న నిర్ణయాలు గందరగోళానికి దారితీశాయి.

మారిన తీరు..: హెచ్-1బీ సహా సిలికాన్ వేలీకి సంబంధించిన సమస్యలపై ట్రంప్ తొలుత సానుభూతితో ఉండేవారు. అధికారం చేపట్టాక హెచ్-1బీ అంశంపై ఆయన తీసుకున్న కఠిన వైఖరి.. మునుపటి దృక్పథానికి భిన్నంగా ఉంది. ఆయన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు 2016 డిసెంబర్ 14న సిలికాన్ వేలీ అగ్రనాయకులు ఆయనతో భేటీ అయ్యారు. ఐటీ పరిశ్రమకు సహాయం చేయాల్సిన అవసరం ఉందని, దానిపై మితిమీరిన నియంత్రణ ఉందని ఆయన ఆ తర్వాత.. మీడియా దిగ్గజం రూపర్ట్ మర్డోక్‌తో ఫోన్‌లో చెప్పారు. వారికి నిజంగానే హెచ్-1బీ వీసాలు అవసరమన్నారు. వారికి సహాయం చేయడానికి ఇది తనకు అవకాశమన్నారు. అయితే హెచ్-1బీపై సరళ వైఖరిని అనుసరించడం.. గోడను నిర్మించి, సరిహద్దులను మూసేస్తాన్న తన ఎన్నికల హామీకి విరుద్ధంగా ఉంటుందని మర్డోక్ పేర్కొన్నారు. దీనికి ట్రంప్ బదులిస్తూ.. "దాన్ని మేం పరిష్కరిస్తాం" అని చెప్పారు. ఈ పుస్తకంలోని అంశాలను వైట్‌హౌస్ కొట్టిపడేసింది. "వైట్‌హౌస్‌లోకి రావడానికి అనుమతి లేని, ఎలాంటి ప్రభావం లేని కొందరు వ్యక్తులు చెప్పిన తప్పుదోవ పట్టించే మాటలతో ఈ పుస్తకం నిండిపోయింది" అని అధికార ప్రతినిధి శారా శాండర్స్ తెలిపారు.

రూ.8.4 కోట్ల విలువైన వోడ్కా



ప్రపంచంలోనే అత్యధిక విలువ కలిగిన వోడ్కా సీసా ఇది. దీని విలువ సుమారు రూ.8.4 కోట్లు. డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో గల కేఫ్ 33 అనే బార్ నుంచి దీన్ని దొంగిలించినట్లు కేసు నమోదైంది. కోపెన్‌హాగన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

ఛాంపియన్స్

2 గత రెండున్నరేళ్లలో భారత్‌కు ఎదురైన ఓటములు. 30 మ్యాచ్‌ల్లో 21 విజయాలు అందుకున్న టీమ్‌ఇండియా.. 7 మ్యాచ్‌లను డ్రాగా ముగించింది. శ్రీలంకలో ఓ మ్యాచ్.. స్వదేశంలో ఆస్ట్రేలియా చేతిలో ఓ మ్యాచ్ ఓడింది.

6 దక్షిణాఫ్రికాలో భారత్ ఆడిన టెస్టు సిరీస్‌లు. ఐదింట్లో ఓడింది. 2010-11 సిరీస్‌ను డ్రా చేసుకుంది.

9 ఈ సిరీస్‌కు ముందు భారత్ ఆడిన సిరీస్‌లు. అన్నింట్లో గెలిచింది. రెండు సార్లు శ్రీలంకలో పర్యటించిన భారత్.. మరోసారి వెస్టిండీస్‌లో ఆడింది. మిగతావన్నీ స్వదేశీ సిరీస్‌లే.



భారత్ × దక్షిణాఫ్రికా

తొలి టెస్టు నేటి నుంచే

ఇప్పుడు కాకుంటే మరెప్పుడు..!

కోహ్లిని నియంత్రిస్తే...

"భారత్‌లో గత సిరీస్ మమ్మల్ని తీవ్రంగా నిరాశపరిచింది. బదులు తీర్చుకోవడానికి ఇంతకన్నా గొప్ప అవకాశముండదు. మా లక్ష్యం కోహ్లి ఒక్కడే కాదు. ఐతే అతడిని నియంత్రిస్తే.. సిరీస్‌లో మా అవకాశాలు మెరుగవుతాయనడంలో సందేహం లేదు" – డుప్లెసిస్



మధ్యాహ్నం 2 నుంచి సోనీటెన్-1, 3లో

పాతికేళ్ల నిరీక్షణకు కోహ్లి సేన తెరదించేనా..

ఎన్ని పరాభవాలో.. ఎన్ని అవమానాలో..! చరిత్ర తిరగేస్తే సంతోషించడానికి కారణాలే కనిపించవు..! ఇదీ మీ సత్తా అంటూ.. ఘోర పరాజయాలు వెక్కిరిస్తాయి..! 25 ఏళ్లవుతోంది తొలిసారి భారత్ పర్యటించి.. ఇప్పటివరకు ఒక్క సిరీసూ గెలవలేదు! దక్షిణాఫ్రికాలో టీమ్‌ఇండియా పరిస్థితి ఇది..!

రెండున్నరేళ్లుగా ఓటమన్నదే లేదు. వరుసగా తొమ్మిది సిరీస్‌ల్లో విజయ దుందుభి మోగించింది. దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక.. ఇలా దాదాపుగా అన్ని ప్రధాన జట్లను ఓడించి తిరిగి ప్రపంచ నం.1 జట్టుగా అవతరించింది. గత కొంతకాలంగా ఎదురేలేదు. ఇదీ భారత జట్టు ప్రస్తుత స్థితి..!

అటు చరిత్ర భయపెడుతుంటే.. ఇటు వర్తమానం ఉత్సాహపరుస్తోంది. గత పరాభవాలు ఆందోళన కలిగిస్తుంటే.. గత రెండేళ్లలో అసాధారణ ప్రదర్శనలు.. విశ్వాసాన్నిస్తున్నాయ్, ఆశలు పెంచుతున్నాయ్..! సఫారీ గడ్డపై రెండున్నర దశాబ్దాల్లో దిగ్గజ ఆటగాళ్ల వల్ల సాధ్యం కాని సిరీస్ విజయాన్ని కోహ్లిసేన సాధిస్తుందన్న అంచనా బలపడుతోంది..! ఇప్పుడు కాకుంటే మరెప్పుడు..! స్వదేశంలో కాదు.. అన్ని దేశాల్లో గెలిచినప్పుడే.. నం.1కు సార్థకత అన్న వ్యాఖ్యలు, విమర్శలు ఎక్కువవుతున్న తరుణంలో ప్రపంచ మేటి జట్టుగా చాటుకోవాల్సిన బాధ్యత టీమ్‌ఇండియాపై ఉంది. మరి 25 ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా..? కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా, భారత్ మధ్య తొలి టెస్టు ఆరంభమయ్యేది నేడే..!

కేప్‌టౌన్

రెండేళ్లుగా టీమ్‌ఇండియా సిరీస్ విజయాలను సాధిస్తున్న ప్రతీసారి ఓ హెచ్చరిక వినిపించింది. ముందుంది అసలు సవాల్ అని! ఆ సవాల్ వచ్చేసింది. దక్షిణాఫ్రికా పర్యటన ఆరంభానికి వేళయింది. రెండు జట్ల మధ్య మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ శుక్రవారం మొదలు కానుంది. దక్షిణాఫ్రికా గడ్డపై సిరీస్ విజయం సాధించాలని పట్టుదలతో ఉన్న భారత్ తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటాలని చూస్తుండగా.. ఉపఖండ జట్టుపై ఆధిపత్యాన్ని కొనసాగించాలని కోరుకుంటోంది ఆతిథ్య దక్షిణాఫ్రికా. మరి విజయం ఎవరి సొంతమయ్యేనో..!

రెండేళ్ల కిందటి మాట..! నాలుగు టెస్టుల సిరీస్ కోసం దక్షిణాఫ్రికా.. భారత పర్యటనకు వచ్చింది. సిరీస్‌లో తొలి టెస్టు సందర్భంగా పిచ్‌ను పరిశీలించిన వారంతా ఆశ్చర్యపోయారు! మొదటి రోజు నుంచే బంతి తిరగడం ఖాయమన్నారు. సొంత గడ్డపై పరిస్థితులను సద్వినియోగం చేసుకోవడంలో తప్పేం లేదని వాదించిన భారత్.. సిరీస్‌లో పూర్తిగా స్పిన్ పిచ్‌లనే రూపొందించింది. సిరీస్‌లో అశ్విన్ (31), జడేజా (23) కలిసి 54 వికెట్లు పడగొడితే.. దక్షిణాఫ్రికా బౌలర్లంతా కలిసి తీసింది 55 వికెట్లే. అప్పుడు 0-3తో సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా ప్రతీకారేచ్ఛతో ఇప్పుడు పచ్చని పిచ్‌తో టీమ్‌ఇండియాకు ఆహ్వానం పలికింది. సవాల్‌ను భారత్ ఎలా అధిగమిస్తుందో..!

అదే ఆశ: తొలి టెస్టులో ప్రధాన పోటీ భారత్ బ్యాట్స్‌మెన్, దక్షిణాఫ్రికా పేసర్ల మధ్యనే అని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఐతే షమి, భువనేశ్వర్, ఉమేశ్‌ల ఫామ్ టీమ్‌ఇండియా బలాన్ని పెంచుతోంది. ఓపెనర్ల దగ్గర నుంచి.. జట్టులో ఆఖరి ఆటగాడి వరకు దాదాపుగా అంతా మంచి ఫామ్‌లో ఉన్నారు. జోరు కొనసాగితే భారత్ గెలవకపోవడానికి కారణమేం కనిపించదు. అదీగాక ప్రస్తుత జట్టులో 13 మంది ఆటగాళ్లకు దక్షిణాఫ్రికాలో ఆడిన అనుభవముంది. గత సిరీస్ (2013-14)లో దక్షిణాఫ్రికాకు గట్టి పోటీనిచ్చిన భారత కుర్రాళ్లు ఇంకాస్త పోరాడితే విజయం కష్టమేం కాదు. ఓపెనర్లు విజయ్, ధావన్ (లేదా రాహుల్) శుభారంభం అందించడం అత్యంత కీలకం. ఆ తర్వాత పుజారా, కోహ్లి, రహానెలతో మిడిలార్డర్ పటిష్ఠంగా కనిపిస్తోంది. లోయర్‌ఆర్డర్‌లో హార్దిక్, భువనేశ్వర్, అశ్విన్‌లు పరుగులు చేయగల సత్తా ఉన్నవాళ్లే. అన్నీ అనుకున్నట్లు సాగితే భారత్‌కు మంచి అవకాశమున్నట్లే. ఐతే.. ప్రపంచంలోనే మేటి పేస్ దళం బౌలింగ్‌లో.. ముఖం మీదుగా దూసుకొచ్చే బంతులను బ్యాట్స్‌మెన్ ఎలా ఎదుర్కొంటారన్న దానిపైనే అంతిమ ఫలితం ఆధారపడివుంటుంది!

రోహిత్ ఉన్నట్టేనా..: జట్టు ఎంపిక భారత వ్యూహ బృందానికి పరీక్షగా మారనుంది. పిచ్ పేస్‌కు అనుకూలం కాబట్టి.. షమి, భువనేశ్వర్, ఇషాంత్‌లకు చోటు ఖాయంగా కనిపిస్తోంది. జడేజా అనారోగ్యానికి గురికావడంతో అశ్విన్ ఏకైక స్పిన్నర్‌గా బరిలో దిగనున్నాడు. ఐతే రాహుల్, రోహిత్‌లకు తుది జట్టులో చోటు ఉంటుందా? అన్నదే ఆసక్తికరం. గాయం నుంచి కోలుకున్న ధావన్‌పై జట్టు నమ్మకముంచితే.. రాహుల్ బెంచ్‌కే పరిమితమవుతాడు. ఒక బౌలర్ (లేదా ఆల్‌రౌండర్)కు బదులుగా రోహిత్ శర్మను ఆడించే అవకాశాన్ని కొట్టిపారేయలేం. బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్.. రోహిత్ తుది జట్టులో ఉంటాడన్న సంకేతాలిచ్చాడు. ఐతే ఎవరి స్థానంలో అతడు వస్తాడన్నదే కీలకం. ప్రస్తుతం ఫామ్‌లో లేకున్నా రహానె విదేశీ రికార్డు గొప్పగా ఉంది. కీలక మ్యాచ్‌ల్లో జట్టును నిలబెట్టిన రికార్డు అతడి సొంతం. అతడిపై వేటు సాహసమే అవుతుంది!

వారి బలం పేస్..: ఫామ్ పక్కన పెడితే.. దక్షిణాఫ్రికాకు ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఆందోళన కలిగిస్తోంది. డుప్లెసిస్, స్టెయిన్, ఆమ్లా ఈ మధ్య అనారోగ్యానికి గురయ్యారు. దక్షిణాఫ్రికాతో నాలుగు రోజుల మ్యాచ్‌లో కూడా వారు ఆడలేదు. ఐతే తమ ప్రధాన బలమైన పేస్ విభాగంలో ఆ జట్టుకు తిరుగులేదు. స్టెయిన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినా.. అతడిని ఆడించే సాహసం చేయమంటోంది దక్షిణాఫ్రికా. రబాడ, ఫిలాండర్, మోర్నీ మోర్కెల్‌లు పేస్ భారం మోయనున్నారు! ఐతే ఆ జట్టులోని స్టార్ బ్యాట్స్‌మెన్‌ను ఎంత త్వరగా పడగొడతారన్నదానిపైనే భారత అవకాశాలు ఆధారపడివుంటాయి. కెప్టెన్ డుప్లెసిస్, ఆమ్లా, డివిలియర్స్‌లకు భారత్‌పై మంచి రికార్డుంది.

పిచ్ ఈసారి ఏం చేస్తుందో.. కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ పిచ్ పచ్చగా ఉన్నా అది పూర్తిగా పేస్‌కు అనుకూలమని చెప్పడానికి వీల్లేదు. ఇక్కడ జరిగిన గత మ్యాచ్‌లు భిన్నమైన అనుభవాలు మిగిల్చాయి. 2016లో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్‌లో కేవలం 13 వికెట్లే పడ్డాయి. 1272 పరుగులొచ్చాయి. 2013లో పాకిస్థాన్‌తో టెస్టులో పిచ్ పేసర్లకు, స్పిన్నర్లకు అనుకూలించింది. ఇక 2011లో పూర్తిగా పేస్‌కు స్వర్గధామంగా నిలిచింది. ఫిలాండర్, మోర్నీ మోర్కెల్‌ల దాటికి ఆసీస్ 47 పరుగులకే కుప్పకూలింది. ఇక్కడ టాస్ ఓడిన జట్లు 22 సార్లు మ్యాచ్ గెలవగా.. టాస్ గెలిచిన జట్టు నెగ్గిన మ్యాచ్‌లు 21 కావడం విశేషం. ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండు మ్యాచ్‌ల్లో ఓడి.. మరో రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకుంది.

జట్లు (అంచనా)... భారత్: విజయ్, ధావన్/రాహుల్, పుజారా, కోహ్లి, రహానె, సాహా, రోహిత్/పాండ్య, అశ్విన్, భువనేశ్వర్, షమి, ఇషాంత్.

దక్షిణాఫ్రికా: ఎల్గర్, ఐడెన్ మక్రం, ఆమ్లా, డుప్లెసిస్ (కెప్టెన్), డివిలియర్స్/బవుమా, డికాక్, ఫెలుక్వయో/మోరిస్, ఫిలాండర్, రబాడ, స్టెయిన్/మోర్కెల్, కేశవ్ మహరాజ్

విరాట్ × డివిలియర్స్

సిరీస్ భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్నా ప్రధానంగా అందరి దృష్టి కోహ్లి, డివిలియర్స్‌లపైనే. ఐపీఎల్‌లో బెంగళూరు జట్టుకు ఆడే వీరిద్దరు ప్రత్యర్థులుగా బరిలో దిగనున్నారు. రెండు జట్లకు వీరిద్దరు గెలుపు గుర్రాలు అన్నది స్పష్టం. ఐతే కోహ్లి మంచి ఫామ్‌లో ఉండగా డివిలియర్స్ మళ్లీ తానేంటో నిరూపించుకునే పనిలో ఉన్నాడు. దాదాపుగా రెండేళ్ల విరామం తర్వాత జింబాబ్వేతో మ్యాచ్‌తో అతడు టెస్టుల్లో పునరాగమనం చేశాడు. కోహ్లి ఫామ్‌పైనే భారత్ అవకాశాలు ఆధారపడ్డాయి. అతడు రాణిస్తే ఆ ప్రభావం మిగతా జట్టుపై ఉంటుంది. మరోవైపు డివిలియర్స్‌కు ఎలాంటి ఒత్తిడి లేదు. కెప్టెన్సీ భారం కూడా అతడిపై లేదు. స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసుకునే అవకాశం అతడికి ఉంది.

దక్షిణాఫ్రికాలో భారత్

	టెస్టులు	గెలుపు	ఓటమి	డ్రా
1992	4	0	1	3
1996–97	3	0	2	1
2001	2	0	1	1
2006–07	3	1	2	0
2010–11	3	1	1	1
2013	2	0	1	1



● మిగతా స్టార్లు పాత జట్లకే
● చెన్నైలో ధోని, రైనా, జడేజా

గంభీర్‌ను వదిలేశారు!

● కోహ్లికి రూ. 17 కోట్లు, రాజస్థాన్‌కు స్టీవ్ స్మిత్
● అట్టిపెట్టుకున్న ఆటగాళ్లను ప్రకటించిన ఫ్రాంఛైజీలు

ముంబయి: ఊహాగానాలకు తెర! ఐపీఎల్ 11వ సీజన్ కోసం అట్టిపెట్టుకునే ఆటగాళ్ల వివరాలను ఎనిమిది ఫ్రాంఛైజీలు ప్రకటించాయి. గురువారం ముంబయిలో జరిగిన కార్యక్రమంలో నాలుగు జట్లు గరిష్ఠంగా ముగ్గురిని అట్టిపెట్టుకోగా.. మిగతావన్నీ ఒకరిద్దరితో సరిపెట్టుకున్నాయి. మొత్తం 8 ఫ్రాంఛైజీలు కలిపి 18 మంది ఆటగాళ్లను తీసుకున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ కోహ్లిని రూ. 17 కోట్ల లీగ్ ఫీజుతో తిరిగి తీసుకుంది. రెండేళ్ల నిషేధం ముగించుకుని ఐపీఎల్‌లో పునరాగమనం చేసిన చెన్నై సూపర్ కింగ్స్ తమ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో పాటు.. సురేశ్ రైనా, రవీంద్ర జడేజాలను తీసుకుంటున్నట్లు ప్రకటించింది. రాజస్థాన్ రాయల్స్.. పుణె సూపర్ జెయింట్స్‌కు ఆడిన స్టీవెన్ స్మిత్‌ను ఎంపిక చేసుకుంది. ఐతే రెండుసార్లు ఐపీఎల్ ట్రోఫీ అందించిన కెప్టెన్ గౌతం గంభీర్‌ను వేలానికి వదిలేసి కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆశ్చర్యపరిచింది. ఆ జట్టు నరైన్, ఆండ్రీ రస్సెల్‌లను ఉంచుకుంది. ఇక కింగ్స్ ఎలెవన్ పంజాబ్ అక్షర్ పటేల్‌ను మాత్రమే దగ్గర పెట్టుకుంది. పదకొండో సీజన్ కోసం ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్ఠంగా రూ. 80 కోట్లు ఖర్చు చేసుకోవచ్చు. అట్టిపెట్టుకోవడంలో భాగంగా ముగ్గురు ఆటగాళ్లను తిరిగి తీసుకుంటే.. ఫ్రాంఛైజీ ఖర్చు చేసే మొత్తం నుంచి మొదటి ఆటగాడికి రూ. 15 కోట్లు, రెండో ఆటగాడికి రూ. 11 కోట్లు, మూడో ఆటగాడికి రూ. 7 కోట్లు కోత పెడుతుంది ఐపీఎల్. ఇద్దరిని తీసుకుంటే.. మొదటి ఆటగాడికి రూ. 12.5 కోట్లు, రెండో ఆటగాడికి రూ. 8.5 కోట్ల.. ఒక్కరినే తీసుకుంటే రూ. 12.5 కోట్లు కోత పడుతుంది. ఐతే ఆటగాడి లీగ్ ఫీజు (ఆటగాడితో ఫ్రాంఛైజీ చేసుకున్న ఒప్పందం) ఎక్కువ ఉంటే ఆ మేరకు ఫ్రాంఛైజీ ఖర్చు చేసే మొత్తం తగ్గిపోతుంది. కోహ్లి లీగ్ ఫీజు రూ. 17 కోట్లు కాబట్టి.. తొలి ఆటగాడి కింద ఆ మేరకు బెంగళూరు చేయాల్సిన ఖర్చు తగ్గిపోయింది. ఒకవేళ ఆటగాడి లీగ్ ఫీజు తక్కువగా ఉన్నా... ఐపీఎల్ నిబంధనల ప్రకారం గరిష్ఠ మొత్తాన్ని తగ్గిస్తుంది. ఉదాహరణకు అక్షర్ లీగ్ ఫీజు రూ. 6.75 కోట్లు మాత్రమే.. ఐతే ఫ్రాంఛైజీ ఖర్చు చేయాల్సిన మొత్తం నుంచి రూ. 12.5 కోట్లు కోత వేస్తుంది. అంటే ఆ జట్టు వేలంలో గరిష్ఠంగా రూ. 67.5 కోట్లు ఖర్చు చేయొచ్చు. ఈ నెల 27, 28 తేదీల్లో వేలం నిర్వహించనున్నారు. అట్టిపెట్టుకోవడం, రైట్ టు మ్యాచ్ పద్ధతుల ద్వారా ఒక్కో ఫ్రాంఛైజీ గరిష్ఠంగా ఐదుగురు పాత ఆటగాళ్లను తీసుకోవచ్చు. ప్రస్తుతం ముగ్గురు ఆటగాళ్లను అట్టిపెట్టుకున్న వాళ్లు.. రైట్ టు మ్యాచ్ కింద మరో ఇద్దరిని తీసుకునే వీలుంటుంది. మిగతా వారు ముగ్గురిని తీసుకోవచ్చు. రైట్ టు మ్యాచ్ ప్రయోగించి తక్కువ ధరకు వేలంలో దక్కించుకోవచ్చన్న ఉద్దేశంతో చాలా జట్లు కీలక ఆటగాళ్లను వ్యూహాత్మకంగా వదిలేశాయి.

ఎవరెక్కడ..

ఆటగాళ్లు (లీగ్ ఫీజు)

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (రూ. 15 కోట్లు); రైనా (రూ. 11 కోట్లు), జడేజా (రూ. 7 కోట్లు); **వేలంలో ఖర్చు చేసేందుకు మిగిలిన మొత్తం:** రూ. 47 కోట్లు; **ఆర్టీఎం** (రైట్ టు మ్యాచ్ అవకాశాలు)- 2

దిల్లీ డేర్‌డెవిల్స్: రిషబ్ పంత్ (రూ. 8కోట్లు), క్రిస్ మోరిస్ (రూ. 7.1 కోట్లు), శ్రేయస్ అయ్యర్ (రూ. 7 కోట్లు); **మిగిలిన మొత్తం:** రూ. 47 కోట్లు, ఆర్టీఎం: 2

కింగ్స్ ఎలెవన్ పంజాబ్: అక్షర్ పటేల్ (రూ. 6.75 కోట్లు); **మిగిలిన మొత్తం:** 67.5 కోట్లు, **ఆర్టీఎం**-3

కోల్‌కతా నైట్‌రైడర్స్: సునీల్ నరైన్ (రూ. 8.5 కోట్లు), ఆండ్రీ రస్సెల్ (రూ. 7 కోట్లు); **మిగిలిన మొత్తం** (రూ. 59 కోట్లు), **ఆర్టీఎం:** 3

ముంబయి ఇండియన్స్: రోహిత్ శర్మ (రూ. 15 కోట్లు), హార్దిక్ పాండ్య (రూ. 11 కోట్లు), జస్ప్రిత్ బుమ్రా (రూ. 7 కోట్లు); **మిగిలిన మొత్తం:** రూ. 47 కోట్లు; **ఆర్టీఎం:** 2

రాజస్థాన్ రాయల్స్: స్టీవ్ స్మిత్ (రూ. 12 కోట్లు); **మిగిలిన మొత్తం:** రూ. 67.5 కోట్లు; **ఆర్టీఎం:** 3

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: విరాట్ కోహ్లి (రూ. 17 కోట్లు), డివిలియర్స్ (రూ. 11 కోట్లు), సర్ఫరాజ్ ఖాన్ (రూ. 1.75 కోట్లు) **మిగిలిన మొత్తం:** రూ. 49 కోట్లు; **ఆర్టీఎం:** 2

సన్‌రైజర్స్ హైదరాబాద్: డేవిడ్ వార్నర్ (రూ. 12 కోట్లు), భువనేశ్వర్ కుమార్ (రూ. 8.5 కోట్లు); **మిగిలిన మొత్తం:** రూ. 59 కోట్లు; **ఆర్టీఎం:** 3

దిల్లీ డేర్‌డెవిల్స్ కోచ్‌గా పాంటింగ్

దిల్లీ: గత రెండు సీజన్లు ముంబయి ఇండియన్స్ కోచ్‌గా పనిచేసిన ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం రికీ పాంటింగ్.. ఈ ఏడాది నుంచి ఐపీఎల్‌లో దిల్లీ డేర్‌డెవిల్స్ కోచ్‌గా పనిచేయనున్నాడు. ఈ మేరకు దిల్లీ డేర్‌డెవిల్స్ ఒక ప్రకటన విడుదల చేసింది.

ఇంగ్లాండ్ 233/5

ఆస్ట్రేలియాతో ఐదో టెస్టు

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టులో ఇంగ్లాండ్ తడబడుతూ సాగుతోంది. గురువారం మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 233/5తో నిలిచింది. కమిన్స్ (2/44), హాజిల్‌వుడ్ (2/47) విజృంభించడంతో ఇంగ్లాండ్ 95కే 3 వికెట్లు కోల్పోయింది. ఐతే ఆ తర్వాత రూట్ (83; 141 బంతుల్లో 8×4), మలన్ (55; 160 బంతుల్లో 5×4) నాలుగో వికెట్‌కు 133 పరుగులు జోడించడంతో కోలుకుంది. ఓ దశలో 228/3తో రోజును సంతృప్తికరంగా మగించేలా కనిపించింది. ఐతే రూట్, బెయిర్‌స్టో (5) వరుస ఓవర్లలో నిష్క్రమించడంతో తొలి రోజు ఆస్ట్రేలియాదే పైచేయి అయ్యింది. కుక్ (39), స్టోన్‌మన్ (24), విన్స్ (25) ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. సిరీస్‌ను ఆస్ట్రేలియా ఇప్పటికే 3-0తో సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

అతడి ఫామే కీలకం



సౌరభ్ గంగూలీ

2017లో భారత్ అద్భుతంగా ఆడింది. అదే జోరు దక్షిణాఫ్రికాలోనూ కొనసాగించాలనుకుంటోంది. అయితే విదేశీ గడ్డపై రాణించడం అంత సులభం కాదు. అయితే ప్రస్తుత జట్టు ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించగలదన్న నమ్మకం నాకుంది. విజయానికి కీలకం విరాట్ కోహ్లి ఫామ్. తన తొలి విదేశీ పర్యటనలో కోహ్లి అటు ఆటగాడిగా, ఇటు కెప్టెన్‌గా రెండు పాత్రలకూ న్యాయం చేయాల్సి ఉంటుంది. ఇంతకుముందు అడిలైడ్, సిడ్నీల్లో అలా చేశాడు. ఆ ఫామ్ కోహ్లికి గుర్తుండే ఉంటుంది. జట్టు ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. పాండ్యను జట్టులోకి తీసుకోవాలి. దీనివల్ల ఐదుగురు బౌలర్లతో ఆడే అవకాశం లభిస్తుంది. 20 వికెట్లు తీయొచ్చు. దిగువశ్రేణిలో పాండ్య, అశ్విన్, సాహా బ్యాట్‌తో రాణించగలరు. భువీ కూడా ఓ చేయి వేస్తాడు. సిరీస్‌లో తొలి టెస్టు చాలా ముఖ్యమైంది. బౌలర్లకు లెంగ్త్ చాలా కీలకం. వాళ్ల బంతి.. స్టంప్స్ మీదకే వేయాలి. షార్ట్‌పిచ్ బంతులు వేయాలని చూస్తే సఫారీలు ఆడేసుకుంటారు. ఈ సిరీస్ అశ్విన్‌కూ చాలా కీలకమైందే. తన సత్తా ఏంటో.. మళ్లీ ఓసారి అతడు నిరూపించుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్నాడు. ఇక్కడి ప్రదర్శనతో అతడిపై సందేహాలన్నీ పటాపంచలైపోతాయి. సత్తా లేకపోతే ఇక్కడ 300 వికెట్లు తీయలేరన్న విషయాన్ని ఇక్కడ అందరూ గుర్తుపెట్టుకోవాలి.

నితీశ్‌కుమార్ 441

ఆంధ్ర 801/2 డిక్లేర్డ్ ● నాగాలాండ్‌తో విజయ్ మర్చంట్ ట్రోఫీ



నితీశ్‌కుమార్‌రెడ్డి

రాజ్‌కోట్: ఆంధ్ర అండర్-16 ఆటగాడు నితీశ్‌కుమార్‌రెడ్డి (441; 366 బంతుల్లో 60×4, 7×6) చెలరేగాడు. నాగాలాండ్‌తో జరుగుతున్న అఖిల భారత విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్-16 నాకౌట్ క్రికెట్ మ్యాచ్‌లో ఏకంగా 441 పరుగులు సాధించాడు. బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నాగాలాండ్ 23.3 ఓవర్లలో 56 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు నితీశ్‌కుమార్‌రెడ్డి (3/24), వాసు (4/15) విజృంభించారు. అనంతరం ఆంధ్ర 126 ఓవర్లలో 801/2 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. నితీశ్‌కుమార్‌రెడ్డి భారీస్కోరు నమోదు చేయగా.. యోగానంద్ (217; 260 బంతుల్లో 23×4) డబుల్ సెంచరీ, కెప్టెన్ సుబ్రహ్మణ్యం (106 నాటౌట్; 131 బంతుల్లో 9×4, 1×6) సెంచరీ సాధించారు. నితీశ్, యోగానంద్ తొలి వికెట్‌కు 535 పరుగులు జోడించడం విశేషం. బీసీసీఐ టోర్నీల్లో ఆంధ్ర తరపున ఇదే అత్యుత్తమ తొలి వికెట్ భాగస్వామ్యం. నితీశ్ సాధించిన పరుగులు బీసీసీఐ జూనియర్ క్రికెట్లో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు. భారత అండర్-19 మాజీ కెప్టెన్ విజయ్ జోల్ (451) మొదటి స్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు ఈ టోర్నీలో 6 మ్యాచ్‌లాడిన నితీశ్.. 245 సగటుతో 1229 పరుగులు సాధించాడు. ట్రిపుల్ సెంచరీ కూడా చేశాడు. ఆ మ్యాచ్‌లో 18 వికెట్లు పడగొట్టాడు.